నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ గురువారం 4-2-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 158 పేజీలు: 8 వెల: రూ.1/-

సరిహద్దుల్లో దుస్సాహసానికి పాల్పడితే దీటైన జవాబు

బెంగుళూరు ఎయిర్ షో ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్

బెంగుళూరు,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): సరిహద్దుల్లో శత్రువులు దుస్సాహసాలకు పాల్పడితే తిప్పికొట్టేందుకు భారత సేనలు సిద్ధంగా ఉన్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కర్ణాటకలో ఏరో ఇండియా-2021 ఎయిర్ షోను ప్రారంభించిన అనంతరం ప్రసంగించిన ఆయన.. లఢక్ సరిహద్దుల్లో భారత్-చైనా ప్రతిష్టంభన గురించి ప్రస్తావించారు. భౌగోళిక సమగ్రతను కాపాడుకునేందుకు, దేశ ప్రజల రక్షణకు భారత సైన్యం సంసిద్ధంగా ఉన్నదని చెప్పారు. సరిహద్దుల్లో కట్టుదిట్టంగా బలగాలను మోహరించామని, శత్రు దేశాల సేనలు ఎలాంటి దుస్సాహసం చేసినా వెంటనే తిప్పికొట్టేందుకు సైన్యం అప్రమత్తంగా ఉన్నదని తెలిపారు. కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేసిన సమయంలోనూ ఎయిరో షోలో అనేక దేశాలకు చెందిన వైమానిక సంస్థలు పాల్గొనడం చాలా ఆనందంగా ఉన్నదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ఎయిర్ షోలో నేరుగా, వర్చువల్‌గా పాల్గొన్న సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భారత రక్షణరంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కింద రక్షణ సామర్థ్యాన్ని పెంచడంలో భాగంగా వచ్చే ఏడెనిమిదేండ్లలో 130 బిలియన్ డాలర్లతో దళాలను ఆధునీకరించనున్నామని ఆయన తెలిపారు.

కాగా, ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప కూడా హాజరయ్యారు. నేటి నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ ఎయిర్ షో జరుగనుంది. కరోనా నేపథ్యంలో సాధారణ ప్రేక్షకులకు డిజిటల్ వేదికల ద్వారా ఈ ప్రదర్శనను వీక్షించే వీలు కల్పించారు. ఈ ఎయిర్ షోలో ప్రపంచ దేశాల్లోని 601 సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. ఆద్యంతం ఆసక్తి కలిగించే రఫేల్ జెట్, అమెరికా అపాచి హెలిక్యాప్టర్లు భారతీయ సైన్యం తరపున విన్యాసాలు చేయనున్నాయి. ఎయిర్ షో సందర్భంగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి కేంద్రం 83 తేజస్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విలువ రూ.48 వేల కోట్లు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో రక్షణశాఖ అధికారులు, హాల్ అధికారులు ఒప్పందంపై సంతకాలు చేశారు. తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు గత నెల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో తాజాగా ఈ ఒప్పందం జరిగింది. దీనిపై రాజ్‌నాథ్ హర్షం వ్యక్తంచేశారు. రక్షణ రంగ చరిత్రలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద మేకిన్ ఇండియా రక్షణ ఒప్పందం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎం యెడ్యూరప్ప తదితరులు పాల్గొన్నారు.

మయన్మార్‌లో తొలగని ప్రతిష్ఠంభన

నిర్బంధంలో ఎంపిల అవస్థలు
11 మంది మాజీ సైనికాధికారులతో నూతన కేబినెట్

యంగోన్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): మయన్మార్‌లో సైనిక తిరుగుబాటుతో తలెత్తిన ప్రతిష్టంభన ఇంకా కొనసాగుతోనే ఉంది. దేశ రాజధాని నేపిడాలోని ప్రభుత్వ గృహ సముదాయంలో బందీలుగా ఉన్న దాదాపు 400 మంది ఎంపి లు రాత్రిళ్లు నిద్రించడానికి కూడా భయపడుతోన్నారు. నిర్బంధంలో ఉన్నవారిలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్ శాన్ సూచీ నేతఅత్యంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్ఎల్‌డీ) పార్టీ సభ్యులతోపాటు పలు ఇతర పార్టీల ఎంపిలు ఉన్నారు. బందీగా ఉన్న ఓ ఎంపి మాట్లాడుతూ.. బయటకు వెళ్లేందుకు తమను అనుమతించడం లేదని వాపోయారు. గృహ సముదాయంలో పోలీసులు, బయట సైనికులు కాపలాగా ఉన్నారని చెప్పారు. ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు, ఫోన్‌లో సంభాషించేందుకు మాత్రమే పోలీసులు తమను అనుమతిస్తున్నారని అన్నారు. ఎక్కడికైనా తరలిస్తారేమోనన్న భయంతో సోమవారం రాత్రి తాము నిద్రించనే లేదని ఆవేదన చెందారు. మయన్మార్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో.. యంగోన్ నగంలోని భారత రాయబార కార్యాల యం అప్రమత్తమైంది. తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అనవసర ప్రయాణాలు చేయకూడదని అక్కడి భారతీ యులకు సూచించింది. మయన్మార్‌లో ఎన్ఎ ల్‌డి ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం.. ఉపాధ్యక్షుడు మయింట్ స్వెనిని తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించి, మయింట్ సర్వాధికారాలను సైన్యాధిపతి మిన్ ఆంగ్ లయాంగ్‌కు అధికారులు బదలాయించారు. అత్యవసర పరిస్థితుల్లో ఇలా అధికారాలను బదలాయించడానికి ఆ దేశ రాజ్యాంగం అనుమతిస్తుంది. లయాంగ్ 11 మంది మాజీ సైనికాధికారులతో నూతన కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. మయన్మార్‌లో సైనిక తిరుగుబాటును 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభివర్ణిం చారు. ఆ దేశంపై ఆంక్షల పునరుద్ధరణకు సంకోచించబోమని హెచ్చరించారు. ఎన్నికైన ప్రభుత్వం పాలన కొనసాగించేందుకు సైన్యం సహకరించాలని జో బైడెన్ పేర్కొన్నారు.

వ్యవసాయరంగంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

రైతుబంధును మించిన పథకం లేదు
బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు దక్కని స్థానం
-మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): తెలంగాణ సీఎం కేసీఆర్ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని, వ్యవసాయ రంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని గ్రామీణాభివృద్ధి ఆఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పథకాలకు నిధుల కేటాయింపు లేకపోగా అనేక విషయాల్లో మన పథకాలను కాపీ కొట్టారని అన్నారు. కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు, నిధుల కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేదన్నది మాత్రం వాస్తవం అన్నారు. మోడీ సర్కార్ మరింత విశాలదృక్పథంతో ఆలోచించి ఉంటే దేశ వ్యాప్తంగా రైతులకు న్యాయం జరిగేదన్నారు. వ్యవసాయ సమస్యలపై కేసీఆర్‌కు ఉన్న లోతైన అవగాహన మరే నేతకు లేదని మెచ్చుకున్నారు. తెలంగాణ చేపట్టిన పథకాలనే ప్రధాని అమలు చేస్తున్నారని.. ప్రధాని మోడీకి స్వంత ఐడియాలు లేవని ఎద్దేవా చేశారు. అయితే కెసిఆర్‌లా విశాల దృక్పథం కొరవడిందని అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం కంటే మెరుగ్గా తెలంగాణలో రైతుబంధు పథకం దిగ్విజయంగా అమలవుతోంది. రైతుబంధు పథకం సీఎం కేసీఆర్ మానసపుత్రిక. ఈ పథకం కింద ఎకరాకు ఐదువేల రూపాయల చొప్పున రెండుపంటలకు పదివేల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే రైతుబంధు కింద అర్హులైన అన్నదాతలందరికీ పంట పెట్టుబడి సాయం విజయవంతంగా అందుతోంది. ఈ పథకం అమలవుతున్న తీరుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆర్థికవేత్తలతో పాటు పలువురు ప్రముఖులు పంట పెట్టుబడి సాయం ఎంతో గొప్పదంటూ మెచ్చుకుంటున్నారు. పలు రాష్ట్రాలు రైతుబంధు దిశగా కసరత్తు కూడా చేస్తున్నాయి. తెలంగాణ రైతు బంధుకు, కేంద్రం రైతు బంధుకు తేడా ఉందని అన్నారు. తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న రైతు బంధుతో పోలిస్తే కేంద్రసాయం చాలా చిన్నది. కనీసం తెలంగాణ రైతుబంధును కాపీ కొట్టినా సరిపోయేది. తెలంగాణలో గుంట భూమి మొదలుకొని మొదలుకొని వ్యవసాయం భూమి ఎంత ఉన్నా ఎకరాకు ఐదువేల రూపాయల చొప్పున రెండుపంటలకు పంటపెట్టుబడి సాయం అందుతోంది. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఏడాదికి సుమారు రూ.15 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నది. అదే కేంద్రం రైతులకు ఇచ్చేది దేశవ్యాప్తంగా 75 వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఒక్క తెలంగాణలో 15 వేల కోట్ల రూపాయలు రైతుబంధు గురించి ఖర్చు పెడితే.. దేశవ్యాప్తంగా కేంద్రం ఏ స్థాయిలో నిధులు కేటాయించాలి? అందుకే తెలంగాణ రైతులు నిజంగా అదృష్టవంతుని ఆయన అన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ఆఖిరిబ్రహ్మాస్త్రమ్మును
దాఖలు పరచెడి నవయుగ దర్శకమణియై
శేఖరు కమ్ముల కైనిరా
దాఖండల సూరివోలె నభినందనలన్ !!

(ఫిబ్రవరి 4 దర్శకుడు శేఖర్ కమ్ముల జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

వ్యవసాయ చట్టాల రద్దుకు ఆప్ డిమాండ్

రాజ్యసభలో కార్యక్రమాలకు ఎంపిల అంతరాయం
ఒకరోజు సస్పెండ్ చేసి బయటకు పంపిన ఛైర్మన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): రాజ్యసభ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. బుధవారం ఉదయం సభ ప్రారంభం కాగానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ మొదలుపెట్టారు. ఇంతలో వివాదాస్పద వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు అందుకు అంగీకరించ లేదు. సంజయ్ సింగ్ తన సీట్లో కూర్చోవాలని, తర్వాత మాట్లాడే అవకాశం ఇస్తానని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలను పట్టించుకోని సంజయ్ సింగ్ ఆప్‌కు చెందిన మరో ఇద్దరు సభ్యులతో కలిసి పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేశారు. సభ్యులు వెనక్కి వెళ్లాలని ఛైర్మన్ ఎన్నిసార్లు హెచ్చరించినా వారు వినిపించుకోలేదు. దాంతో ముగ్గురు ఆప్ సభ్యులపై ఒకరోజు సస్పెన్షన్ విధిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. సస్పెండ్ చేసినా ఆప్ సభ్యులు బయటికి వెళ్లకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. వాయిదా అనంతరం సభ పునఃప్రారంభమైనా ఆప్ సభ్యులు నినాదాలు కొనసాగించడంతో రూల్ 255ని ఉపయోగించి మార్షల్స్‌తో వారిని బయటికి గెంటించారు. కాగా, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తే తమపై ఒకరోజు సస్పెన్షన్ విధించారని, రేపు కూడా వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సభలో తమ గళం వినిపిస్తామని ఆప్ ఎంపీలు చెప్పారు.

కూలీల ఆటో బోల్తా: 18మందికి తీవ్ర గాయాలు

రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ ఆటో బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న 18 మంది గాయపడ్డారు. సిరిసిల్లలోని సుభాష్ నగర్‌కు చెందిన కూలీలు దుమాల గ్రామంలో పత్తి తీయడానికి ఆటోలో వెళుతున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న ఆటో ఎల్లారెడ్డి పేట మండలం హరిదాస్‌నగర్, వెంకటాపూర్ గ్రామాల మధ్య అదుపుతప్పి పరిపాలంలో బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. కూలీలు ప్రయాణిస్తున్న ఆటోకి ఎదురుగా రేకుల లోడుతో ట్రాలీ ఆటో వస్తున్నది. ఈ క్రమంలో అందులో ఓ రేకు పైకి ఎగిరి ప్యాసింజర్ ఆటో వైపు దూసుకొస్తుండగా డ్రైవర్ దానిని తప్పించడానికి ప్రయత్నించడాని, దీంతో అదుపుతప్పి పంట పొలంలో పడిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సిరిసిల్లకు చెందిన జిందం సత్తవ్వ (70) చేయి విరిగిందని, మిగిలినవారికి గాయాలయ్యాయని వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆటో డ్రైవర్ పరారీలో ఉండగా, ప్యాసింజర్ ఆటో డ్రైవర్ బుర్ర శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సేవా కేంద్రాల వద్ద ప్రజల ఆందోళన

ఆధార్‌తో అనుసంధానం కోసం తంటాలు

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా రేషన్ సరకులను సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డు దారులు ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని అధికారులు కోరారు.

దీంతో ఆధార్-ఫోన్ నంబర్ అనుసంధానం కోసం పెద్ద సంఖ్యలో ఆధార్ కేంద్రాలకు ప్రజలు వస్తున్నారు. ఆదిలాబాద్ ఆధార్ కేంద్రం వద్ద ఉదయం నుంచే స్థానికులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. ఆధార్ కేంద్రం తెరవలేదని సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో స్థానికులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కరోనా నేపథ్యంలో వేలిముద్రకు బదులు ఐరిస్ లేదా మొబైల్ నంబరు ఓటీపీ ద్వారా రేషన్ సరకుల పంపిణీ ఫిబ్రవరి 1 నుంచి మొదలైంది. ఆధార్ సంఖ్యతో మొబైల్ నంబరు అనుసంధానం అయితేనే ఓటీపీ వస్తుంది. చాలామంది ఇలా అనుసంధానం చేసుకోకపోవడంతో వారికి సంబంధిత సేవలు అందించడంపై తపాలాశాఖ కూడా దృష్టిపెట్టింది.

పరకాల ఎమ్మెల్యే తీరుపై వీహెచ్ ఆగ్రహం

చల్లా ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడం కోసం అంబేద్కర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు పేర్కొన్నారు. అగ్రవర్ణాలలో వెనకబడిన వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను మోదీ తీసుకొచ్చారన్నారు. ఈ రిజర్వేషన్లను కొందరు వ్యతిరేకిస్తున్నప్పటికీ తాము మాత్రం ఏమీ అనడం లేదన్నారు. ఈబీసీ మీటింగ్ పెట్టుకొని ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని వీహెచ్ పేర్కొన్నారు. తాము ఏమైనా చదువు రానోళ్లమా అని వీహెచ్ ప్రశ్నించారు. చదువు అగ్రకులాలకే వస్తదా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే.. వాళ్ల ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 5న సోమాజిగూడలో అన్ని కులాలతో మీటింగ్ పెడుతున్నానని.. వచ్చి క్షమాపణ చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా.. అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకునేలా చట్టం చేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు

వ్యవసాయ చట్టాలపై రాజ్యసభలో చర్చకు ఓకే

15గంటలపాటు చర్చకు అంగీకరించిన ప్రభుత్వం
ఆప్ ఎమ్మెల్యేల నినాదాలపై ఛైర్మన్ అసహనం
వారిని బయటకు పంపించాలని ఆదేశం
రైతు ఉద్యమంతో ప్రభుత్వం,ప్రజలకు నష్టం కలిగిందన్న కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రైతుల ఆందోళనపై పార్లమెంట్‌లో 15 గంటల పాటు చర్చకు ప్రభుత్వం అంగీకరించింది. బుధవారం ప్రతిపక్షాలతో సమావేశమైన తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చర్చ రాజ్యసభలో జరగనుంది. అయితే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం తర్వాత ఈ చర్చ జరపనున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు చెప్పారు. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో నినాదాలు చేశాయి. ముగ్గురు ఆమ్ ఆద్మీ సభ్యులు పదేపదే నినాదాలు చేయడంతో వాళ్లను సభ నుంచి బయటకు పంపించి వేస్తూ ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆదేశించారు. కేవలం రైతుల ఆందోళనలపైనే ఐదు గంటల పాటు చర్చ జరపాలని 16 ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. అయితే ప్రభుత్వం దానిని 15 గంటలకు పెంచడానికి అంగీకరించింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సభలో ప్రకటన చేశారు. చర్చకు తాము కూడా సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ చెప్పారు. ఇదిలావుంటే వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ పొలిమేరల్లో రైతులు చేస్తున్న ఆందోళనతో కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రజలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని రాజ్యసభలో ప్రకటించారు. ఢిల్లీ పొలిమేరల్లో రైతుల దిగ్బంధనాన్ని తొలగించడానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని శివసేన ఎంపీ అనిల్ దేశాయ్ అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి సమాధానమిస్తూ... రైతు ఉద్యమంతో అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అయితే ఢిల్లీ పొలిమేరల్లో ఉద్యమం చేస్తున్న రైతులను వెనక్కి పంపడానికి కేంద్రం చేపడుతున్న చర్యలను మాత్రం ఆయన ఎక్కడా ప్రస్తావించలేదు. శివసేన ఎంపీ అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ... రైతుల ఉద్యమంతో అటు కేంద్రం, ఇటు ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఘాజీపూర్, టిక్రీ, సింఘూ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఆందోళనతో ఢిల్లీతో పాటు, ఢిల్లీ సరిహద్దులను పంచుకున్న రాష్ట్రాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయి. అని పేర్కొన్నారు. మరోవైపు... రైతు ఉద్యమానికి మద్దతిచ్చే వారెవరికీ కూడా ఎన్ఐఏ తరపున కానీ, ఈడీ తరపున కానీ ఎలాంటి సమన్లూ జారీ చేయలేదని రాజ్యసభ వేదికగా కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.

నయా ఆన్‌లైన్ మోసం.. మోసగాడి అరెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): కాంచన్ బాగ్ పోలిస్ స్టేషన్ పరిధిలో నయా ఆన్‌లైన్ మోసం గుట్టురట్టయింది. చీటింగ్ వ్యవహారంలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోకరు పరారీలో ఉన్నారు. షాపులో వస్తువులు కొనుగోలు చేసి పేటీఎం ద్వారా చెల్లింపులు చేసిన ఓ వ్యక్తి.. పేక్ ఐడీ ని క్రియేట్ చేసి షాపు యజమానికి డబ్బులు చెల్లించినట్టు గుర్తించారు. డబ్బులు అకౌంట్‌లో జమ కాకపోవడంతో పోలీసులకు షాపు యజమాని పిర్యాదు చేశారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కాంచన్ బాగ్ పోలీసులు నకిలీ పేమెంట్ చేసిన వ్యక్తిను అరెస్ట్ చేసి అతని నుండి 28 వేల రూపాయల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలోని హైదర్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శేఖర్ అనే వ్యక్తి జలమండలి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదర్‌నగర్ వాటర్ వర్క్స్, కార్యాలయం ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరేసుకునే ముందు వీడియో తీసి తన తమ్ముడికి పంపినట్లు తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26నాటి విధ్వంసం కేసులో 115మంది అరెస్ట్

వివిధ జైళ్లలో ఉన్నవారి జాబితా విడుదల
ఢిల్లీ సిఎంఅరవింద్ కేజీవ్రాల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): జనవరి 26న దేశ రాజధాని ఎర్రకోట వద్ద జరిగిన విధ్వంసం అనంతరం 115 మందిని అరెస్ట్ చేశారు. అయితే వారి పూర్తి వివరాలతో కూడిన జాబితాను విడుదల చేసినట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత,ఢిల్లీ సిఎంఅరవింద్ కేజీవ్రాల్ తెలిపారు. విధ్వంసంలో తప్పిపోయిన తమ వారిని వెతుక్కోవడానికి ఇది ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం వారిని ఢిల్లీలోని వివిధ జైళ్లలో ఉంచినట్లు కేజీవ్రాల్ చెప్పుకొచ్చారు. బుధవారం జాబితా విడుదల చేసిన అనంతరం కేజీవ్రాల్ మీడియాతో మాట్లాడుతూ జనవరి 26 విధ్వంసంలో అరెస్టయి ఢిల్లీలోని వివిధ జైళ్లలో ఉన్న వారి వివరాలతో కూడా జాబితాను విడుదల చేశాం. గణతంత్ర దినోత్సవాన నిర్వహించిన కిసాన్ ఆందోళనలతో తప్పి పోయిన తమ కుటుంబ సభ్యులను వెతుక్కోవడానికి ఈ జాబితా ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నామని అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున జరిగిన ట్రాక్టర్ ర్యాలీ విధ్వంసంగా మారిన విషయం తెలిసిందే. ఎర్రకోటపై నిషాన్ సాహిబ్ జెండా ఎగురవేయడం, అనంతరం జరిగిన విధ్వంసం వివాదస్పదమైంది. రైతుల్లో విధ్వంసకారులు చేరి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించారని ప్రభుత్వాలు వాదిస్తుండగా, ప్రభుత్వ తప్పిదం వల్లనే ఇలా జరిగిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాగా, నిషాన్ సాహిబ్ జెండా ఎగురవేసిన దీప్ సింగ్ అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు చెప్తున్నారు.

పప్పుధాన్యాలకు ప్రాధాన్యత పెరగాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 3: పప్పుధాన్యాలకు ప్రాధాన్యత పెరగాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో 'వరల్డ్ పల్సెస్ డే' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మాంసాహారం తర్వాత అత్యధిక ప్రొటీన్లు ఉండేది పప్పుధాన్యాలల్లోనే అని తెలిపారు. అందులో 20 నుంచి 25 శాతం ప్రోటీన్లు ఉంటాయి. వరి కన్నా మూడింతలు, గోధమకన్నా రెండింతలు ప్రొటీన్లు ఎక్కువుంటాయని పేర్కొన్నారు.

ప్రపంచంలో అత్యధికంగా పప్పుధాన్యాలు పండేది మన దేశంలోనే ప్రతి ఏటా 20 నుంచి 22 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందన్నారు. కాగా, దేశ అవసరాల నిమిత్తం రెండు నుంచి మూడు మిలియన్ టన్నుల పప్పుధాన్యాలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. పప్పు ధాన్యాల ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఏడాది తెలంగాణలో 10.8 లక్షల ఎకరాలలో కంది సాగును ప్రోత్సహించారని తెలిపారు.

మన రాష్ట్ర నేలలు, వాతావరణ పరిస్థితులు పప్పు ధాన్యాల సాగుకు అనుకూలం. నీటి ఎద్దడిని తట్టుకుని నిలబడతాయి. కాబట్టి రైతులు కందితో పాటు పప్పుశనగ, పెసర, మినుము తదితర పంటలు మరింతగా సాగుచేసి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని సూచించారు. పప్పు ధాన్యాల ప్రాధాన్యతపై ఈ నెల 10న వరల్డ్ పల్సెస్ డే నిర్వహించనున్న సందర్భంగా ద ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ కామర్స్ ఆ ఇండస్ట్రీ సంస్థకు, ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, సీఈవో క్యాతి నరవణి, ఎఫ్ టి సీఐఐ ప్రతినిధుల ఉన్నారు.

కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న గవర్నర్ భర్త

అభినందించిన గవర్నర్ తమిళ సై
వైద్య సిబ్బంది అంతా వ్యాక్సిన్ వేయించుకోవాలని హితవు



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళసై భర్త డాక్టర్ సౌందర్య రాజన్ కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న దృశ్యం.

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ భర్త సౌందర రాజన్ కరోనా టీకా వేయించుకున్నారు. మొదటి విడుతలో భాగంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య కార్యకర్తలకు కరోనా టీకా పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా ఫ్రంట్‌లైన్ వారియర్‌గా డాక్టర్ సౌందర రాజన్ కరోనా టీకా తీసుకున్నారు. కాగా, కొవిడ్ టీకా వేయించుకున్న తన భర్తను గవర్నర్ తమిళిసై అభినందించారు. తన భర్త, ప్రముఖ వైద్యుడు, నెఫ్రాలజి నిపుణులు డా. పి. సౌందరరాజ



బాల వికాసం

స్నేహితులు కట్టిన గోడలు

(కథ)



ఒక ఊరిలో రామ, అల్లా, ఏసు అనే మంచి స్నేహితులు ఉండేవారు. ముగ్గురి ఇండ్లు పక్కన పక్కనే ఉన్నాయి. చిన్నప్పటినుండి బాగా బడికి పోయి చక్కగా చదువుకొనేవారు. ఆటలు ఆడుకొనేవారు. ఒకే కుటుంబంలోని అన్నదమ్ములుగా ఉండేవారు. ఎవ్వరి పండుగ వచ్చినా స్నేహితులను ఇంటికి పిలుచుకొని పోయి భోజనం పెట్టే వారు. వాళ్ళను చూసి చాలా మంది అసూయ పడేవారు. వారు పెరిగి పెద్దయ్యారు. ఊర్లోనే తమకున్న పొలంలో వ్యవసాయం చేసుకొని బ్రతికే వారు.

కొన్ని రోజులకు ఆ ఊరికి సర్పంచు ఎన్నికలు వచ్చాయి. పార్టీల నాయకులు ఆ ఊరి మతాల యువకులకు సమావేశం ఏర్పాటు చేసి ఏ మతం నాయకుడు వారి మతమే గొప్పదని, మన మతం కంటే గొప్పది లేదని వారితో మాట్లాడవద్దని, వారు పెట్టింది తినవద్దని అలా చేస్తే మన దేవుడు శిక్షిస్తాడని భయాన్ని నూరి పోశారు.

దాంతో రామ,అల్లా, ఏసు, ల మనసులలో ఎన్నో మార్పులు వచ్చాయి. వారి ముఖాలు చూస్తె పాపం అని మూడు ఇండ్ల చుట్టూ గోడలు కట్టుకున్నారు.

ఒక రోజు రామ తన గోడ ప్రక్కన మామిడి చెట్టును నాటి రోజూ నీళ్ళు పోసి ప్రాణంగా పెంచుతున్నాడు. అది గమనించిన అల్లా, జామ చెట్టు, ఏసు కమలాపండ్ల చెట్టు, నాటి చాలా చక్కగా పెంచసాగారు.

కొన్ని రోజులకు ఎన్నికలు అయిపోయాయి. నాయకులు గెలిచారు. రామ, అల్లా, ఏసు, లను తర్వాత ఎవ్వరూ పట్టించుకోలేదు. కాని వారి మనసులలో మాత్రం వేరే మతం అంటే చులకన భావం విపరీతంగా ఉంది.

చాలా దూరం అయి పోయారు. వీళ్ళింటి మీది కాకి వాళ్ళింటిమీద వాలినా కోపాలు వచ్చి గొడవలు పడేవారు. పిల్లలు కూడా ఎవరి ఇంటి హద్దుల్లో వాళ్ళు ఆడుకొనేవారు. ఇదివరకు ఎవ్వరినైనా అమ్మా, పెద్దనాన్నా, అక్కా, చెల్లి, అన్నా, తమ్ముడూ, అంటూ ప్రేమగా పలకరించుకోనేవారు.

ఏ కష్టమొచ్చినా దగ్గరుండి పాలుపంచుకొనే వారు. పెళ్ళిల్లలో అన్ని పనులు మావే అనుకుని చేసే వారు. కాని ఇప్పుడు మనుసుల మధ్య దూరంతో గోడలు కట్టుకొని నివసిస్తున్నారు. ఆ ఈర్ష్య, అసూయ ల మధ్య మామిడి, జామ, కమలాపండ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. గాలికి చెట్ల కొమ్మలు ఊగి పండ్లు ముగ్గురి ఇండ్లమీద రాలేవి. పిల్లలు వాటిని తీసుకొని తినేవారు.

కొద్దికాలానికి చెట్లు పెద్ద మాన్లు గా పెరిగాయి. రామ, అల్లా, ఏసు కట్టుకున్న గోడలన్నీ పగులగొట్టాయి. నేలకూల్చాయి.

ఒకరోజు రామ అల్లా ను పిల్చి "నీ చెట్టు నా గోడను పగుల గొట్టింది, డబ్బులు కట్టు" అన్నాడు. అల్లా ఏసు ను పిల్చి "నీ చెట్టు నా గోడను పగుల కొట్టింది, డబ్బులు కట్టు" అన్నాడు.

ఏసు రామ ను పిల్చి "మీ చెట్టు పండ్లు మా పిల్లల మీద పడి బుర్ర పగిలింది, డబ్బులు కట్టు" అన్నాడు.

దాంతో ముగ్గురూ నీదంటే తప్పు నీదని కొట్టుకునేందుకు సిద్ధమయ్యారు.

అంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చాడు. "రామ, అల్లా, ఏసు!, మీరు ఎంతమంచివారు. గ్రామం అంటే మీ లాగా, కుటుంబం అంటే మీలాగా, స్నేహితులంటే మీలాగా, జీవితం అంటే మీలాగే జీవించాలని ఊరంతా అనుకునే వారు. కాని ఓట్ల కోసం నాయకులు పెట్టిన చిచ్చులో స్నేహాన్ని మరచి దగ్గరున్నా దూరమై కాలి పోతున్నారు.

ఈ విషయం మీకు ఎలా తెలుసు పెద్దమనిషి" అన్నారు రామ,అల్లా,ఏసు. నాకు తెలియంది ఏముంది, సమస్య ఎక్కడుంటే అక్కడ నేనుంటాను." అన్నాడు పెద్దమనిషి వాల్మీకి.

"పెద్దయ్యా, ఇదిగో! వాళ్ళ మతం కంటే, మా మతమే గొప్పది" అన్నాడు రామ.

"కాదు మా మతమే గొప్పది" అన్నాడు అల్లా.

"కాదు కాదు! మా మతమే గొప్పది " ఏసు అన్నాడు.

"మతం అంటే మానవత్వాన్ని పెంచేది, నల్గురికి సహాయం చేసేది. మనుషులందరినీ ఒక్కటిగా చేసేది." అన్నాడు వాల్మికి.

' "అలా ఎలా అవుతుంది.?" అన్నారు రామ, అల్లా, ఏసు.

"చూడండి నాయనలారా! మీరు ముగ్గురు పెంచిన చెట్లను పరిశీలించండి. మామిడి, జామ, కమలా, చెట్లు వేరు, కాని వాటి ఫలాలు మాత్రం చాలా తీపి. అవి మనుషుల, పక్షుల ఆకలి తీరుస్తున్నాయి. అంతే కాదు మీ మంచితనం చూసి ఆ మూడు చెట్లు మీ ముగ్గురు కట్టుకున్న గోడల్ని కావాలనే పగులగొట్టాయి. కారణం జాతులు వేరైనా మీ లాగా జీవించాలని అనుకున్నాయి. మీ మధ్య దూరాలను తెంచేయాలని అనుకున్నాయి. ఆ చెట్ల కున్న జ్ఞానం మీకుంటే, మతాలను వదలి మహాత్ములుగా జీవిస్తారో, లేదంటే గోడలు కట్టి నిరంతరం కొట్లాడుతూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటారో, మీ ఇష్టం. నిర్ణయం మీది " అని వాల్మికి మరో గ్రామం వైపు అడుగులు వేశాడు.

రామ, అల్లా, ఏసు, ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. గతంలో వారి మంచితనం జ్ఞాపకం వచ్చింది. తమ తప్పు తెలిసింది. అంతకుముందే రామ, అల్లా, ఏసు, ల పిల్లలు ఒకరినొకరు చేతులు పట్టుకొని చెట్ల క్రింద ఆడుకుంటున్నారు.

-పుల్లా రామాంజనేయులు
9491851349

బాల గేయం

ఏడవకు పాపాయి!

ఏడవకు ఏడవకు ముద్దు పాపాయీ!
ఏడిస్తె నీ కళ్లు ఎర్రగవునోయీ!
అమ్మ పాలు తాగి ఆటలాడోయీ
గుమ్మపాలుతాగి గుర్రుపెట్టోయీ!
॥ఏ॥

పాలబువ్వను తినగ త్వరగలేవోయీ!
పాఠాలఱు నేర్వగా బడికి పోవోయీ!
శ్రద్ధగా చదివితే బుద్ధి పెరుగోయీ!
పెరుగన్నమూ తింటె పెరుగుతావోయీ
పప్పన్నమూ తింటె బలము కలుగోయీ!
॥ఏ॥

అమ్మ చెప్పే మాట అమృతవాక్కోయీ
నాన్న చూపే బాట నడువ మేలోయీ
గురువు నేర్పేపాట గుర్తుంచుకోవోయీ!
పెద్దలను ప్రేమగా ఆదరించాలోయి
మేటి మాటలు వింటె మేలు జరుగోయీ!
॥ఏ॥

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

వారెవా..!

ఇప్పుడే
ఓ కుక్కను తెచ్చాను..
పెంచుకుందామనీ,,
చిత్రం
దాన్ని చూశాకే
నాలో మనిషి లక్షణాలు
కనిపిస్తున్నై..!

కాళ్ళ కింది మట్టిని చూసి
కన్నెర్ర చేయకు...
ఎగిరొచ్చి నీ కళ్ళలో దూరొచ్చు
మెదడులో చేరొచ్చు
అప్పుడు నీ పని
దబిడ దిబిడే..!

యుద్ధానికి
సిద్ధమేనా
అడిగాడు దర్పంతో..
పదునెక్కిన
అక్షరాలు
బెదరొద్దన్నాయి..

- సంగెవేని రవీంద్ర
సెల్ : 99871 45310

బడి గంట... మోగింది

కరోనా కష్టకాలంలో
అన్నీ వదులుకుని
భయం భయం తో
బిక్కుబిక్కుమంటూ గడుపుతూ
ఆ అల్లరి.. ఆ చిలిపి చేష్టలు
ఆ ఆటలు..ఆ పాటలు
చూసి.. ఎన్నాళ్ళయిందో ?
మరిచి పోయాం .. ఎప్పుడో..!
గురుశిష్యుల బంధానికి
కోవిడ్ మహమ్మారి
సంవత్సరకాలం అడ్డు పడినా..
ఆ చిరునవ్వులతో అవే కేరింతలతో
మూడు వందల రోజుల తర్వాత
బడిగంట గానంతో
ముచ్చటగా ముస్తాబై
విద్యార్థులతో కళకళలాడుతుంది
మా పాఠశాల ...!
జ్ఞాన సముపార్జన కొరకు
ప్రత్యక్షంగా మమేకమవడానికి
వస్తున్న ఆ చిన్నారుల
చిరునవ్వును చూసి ..
ఆనందభాష్పాలతో స్వాగతిస్తూ
మా పాఠశాల పట్టరాని
సంతోషంతో పరిఢవిల్లుతుంది ..!
గతమంతా ఒక పీడ కలనుకుని
నూతన విద్యా సంవత్సరానికి
స్వాగతం పలుకుదాం..
సరదాగా ఉందాం..!
మాస్కును దరిద్దాం..
ఆరోగ్యంగా జీవిద్దాం..!!

- రవి చంచల
8500330700

ఊయల బాల గేయమాలికలు

పసిపిల్లలు తల్లి ఒడిలో చేసే అల్లరి?.తిననని మారాం చేసినప్పుడు లాలిస్తూ గోరుముద్దలు తినిపిస్తూ అమ్మ పాడే పాటలు.ప్రేమ పూరిత మాతృత్వపు వాక్యాల మధురిమలు ఆణిముత్యాలై బాలలను సాంత్వన పరిచి అలరిస్తాయి. పిల్లలు మట్టి ముద్దలు.మట్టిని మన చేతుల్లోకి తీసుకొని నచ్చిన ఆకారంలో మట్టితో ఎలాగైతే తయారు చేయాలి అనుకుంటామో అలా మలుచుకోవచ్చు.

పిల్లలు ఆట పాటలతో ఎక్కువగా కాలక్షేపం చేస్తారు. నీతి కథలను చెపుతూ అభినయగేయాలు నేర్పిస్తూ మనము చెప్పదలచుకున్న విషయాన్ని సులువుగా నేర్పించవచ్చు.

అర్థవంతమైన పదాల అల్లిక తో భిన్నమైన బాల గేయాలతో "ఊయల" బాల గేయ సంపుటి తో గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ 39 చక్కని గేయాలతో అలరించారు.

"మన కంటి వెలుగే అమ్మ/ మన గుండె ధైర్యమె అమ్మ /మహనీయుల బాట నడుపుచు/మనలదిద్దు గురువే అమ్మ (అమ్మ) నవమాసాలు మోసి తన రక్తాన్ని పంచి పేగు తెంచుకుని పుట్టిన బిడ్డను సమాజంలో ఉన్నత వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది అమ్మ .అలాంటి మాతృమూర్తిని అలతి పదాలతో గేయ రూపమిచ్చారు కవి కాంతి కృష్ణ.

"మమతను పంచును నాన్న/ సమతను నేర్పును నాన్న/ మానవతా తరువులు గా /సంతును పెంచును నాన్న (నాన్న) జన్మనిచ్చినది తల్లి అయితే ఆజన్మాంతము రక్షణ కవచమై నిరంతరం కన్నబిడ్డల కోసం శ్రమించే త్యాగధనుడు నాన్నే కదా నాన్నను గేయంలో బంధించి ఉన్నతంగా అక్షరీకరించాడు కవి.

".....//పుస్తకమున పాఠములను/ జీవిత గుణపాఠములను/అనుభవజ్ఞుడైన గురువు/శిష్య తతికి నేర్పించును

(గురువు) పై గేయంలో ఆచార్యదేవోభవ అనే మాటను సార్థకం చేశాడు తిరుమల కాంతి కృష్ణ.

"అమ్మ భాషలో చదువు/ అందరికీ అవసరమ్ము/ విషయమంత అర్థమౌను/ విజ్ఞానము లభియించును (అమ్మ భాష) మాతృభాషలో విద్య నేర్చుకుంటే అన్యభాషల ను సులువుగా నేర్చుకోవచ్చు .పరభాషను



అనుసరించిన మన భాషను మరువరాదు అని అమ్మ భాషపై మమకారాన్ని చాటుకున్నారు కవి.

"తొలకరి చినుకులు కురిసాయి/ మొలకల నవ్వులు విరిసాయి/ కలివిడి లోని ఆనందంతో మోములు కళకళలాడాయి(చదువుల మేళం)

ఎండాకాలం సెలవుల అనంతరం పాఠశాలలకు వెళ్లే పిల్లల హడావిడి నితోటి తరగతి స్నేహితులను కలిసి మాట్లాడే మాటలను ఉపాధ్యాయులను చూడగానే పిల్లల మనసులో కలిగే ఆనందం వర్ణించ తరమా!

".....// సుందర విద్యానందనవని లో /విరిసిన తెల్లని మల్లెలము/ప్రేమసువాసన జగతికి పంచి/?.../ విశ్వ ప్రేమను ప్రజలందరిలో /?.../(బాలలము) నేటి బాలలే రేపటి పౌరులు కల్లా కపటం ఎరుగని పిల్లలు విద్యా నందనవనం లో చేరి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి జాతికి ఆశాజ్యోతి గా నిలుస్తామని బాలలపలుకులను తన గేయంలో పలికించాడు కవి

×...../ఆటలంటే మాకిష్టం/ పాటలంటే మాకిష్టం /ఆటపాటలతో చదువును /నేర్పించరు ఎందుకు?(ఎందుకు ?) పిల్లల అభిరుచి అర్థం చేసుకోకుండా ఆంక్షలతో ర్యాంకుల కోసం చదివించే చదువులు ఎందుకు ?.?ఆటపాటలతో చదివేందుకు నేర్పించరు ?అని బాలల వైపు నిలబడి ప్రశ్నిస్తున్నాడు.కవి హృదయం ఎంత సున్నితమో పైగేయం ద్వారా బోధపడుతుంది.

".../ పచ్చని చెట్లే ఆనందం/ ప్రకృతి శోభయె ఆనందం /తరువుల పెంచి చెరువుల నింపి/ కరువును తరుముటె ఆనందం(ఆనందం)

ఆనందం అనేది ఎక్కడో లేదు విలువలతో విద్య నేర్చుకోవడం లో... విద్య నేర్పడం లో ?.విద్యలో పోటీ పడటం లో?. వర్షం లో తడుస్తూ ఆడటంలో.., చెట్లను పెంచి ప్రకృతిని కాపాడుకొనుట లో ...పరులకు సాయం చేయడంలో అంతులేని ఆనందం ఉందని గేయం నడక సాగింది .

".....//భవిష్యత్తును తీర్చిదిద్ద/యువశక్తిని కదిలించెను /భారతి పద సేవ కొరకు /బ్రహ్మచారిగా బతికెను(కలాం) అబ్దుల్ కలాం గారి జీవితంలో తాను అనుకున్నవి ఎలా సాధించాడో సకల శాస్త్రాలు చదివి భరతజాతికి కీర్తి కిరీటం గా నిలిచిన వారి జీవితాన్ని గేయంగా మలిచాడు కవి.

".....//అణగారిన జాతులలో/ ఆత్మగౌరవము నింపెను /ఆదర్శము మనకు అతడు/" అంబేద్కర్" యుగపురుషుడు (అంబేద్కర్)దళితవాడలో పుట్టి అంటరాని వాడంటూ వెలివేయబడిన ఉన్నత వ్యక్తి బంతికి నేలకేసి ఎంత గట్టిగా కొడితే అంతెత్తు ఎగిరినట్లు తాను ఎదిగి జాతికి బలమై భారతజాతి గర్వించదగ్గ స్థానంలో నిలిచిన అంబేద్కర్ గారిని చక్కని గేయ మాలిక తో కూర్చారు .

గునపమ్ముల నేల ద్రవ్వి కనకమ్ములను తీయు వారు /అనవరతం కష్టపడే గని లోని కార్మికులు (కార్మికులు)

దేశం అభివృద్ధి పథంలో నడవడానికి నిరంతరం సేవలందించే శ్రామికులందరినీ గేయంలో కూర్చారుకవి.

"నింగిని మబ్బులు క్రమ్మెను/ తొలకరి చినుకులు కురిసెపు/పుడమిని మట్టిని తడి పెను/మొగమున నగవులు నిండెను(తొలకరి)తొలకరి సమయంలో రైతులు చేసే హడావిడిని ఆనందాన్ని చక్కని గేయంలో పొందుపర్చాడు.

''రాతిరి ఇంటికి వద్దాము /తాత చెంత పడుకుందాము/ వీరుల కథలను విందాము/ కమ్మని కలలను కందాము (తాతీళ్ళు)

ఎండాకాలం వచ్చిందంటే పల్లెల్లో ఉండే అమ్మమ్మ తాతయ్యల దగ్గరకు వెళ్లి

అల్లరి చేసి ఆనందిస్తారు పిల్లలు . సెలవులు అంటే పిల్లలకు అంత సరదా ఆ సమయంలో చేసే హంగామా అంతా ఇంతా కాదు.పెద్దవాళ్ళుచెప్పే నీతికథలతో పిల్లలు పరివర్తన చెంది సమాజంలో వారిని వారు ఉన్నతంగా ఉంచుకునేందుకు తోడ్పడతాయి

చిన్న కుటుంబాల నేపథ్యంలో పెద్దలవిలువను తెలుసుకుని వారిని గౌరవించేవిధంగా మంచి అలవాట్లు అలవరచు కోవచ్చు.ఇలా విభిన్న అంశాలను సులభశైలిలో పాడుకునే విధంగా చక్కని గేయాలుగా మలిచాడు కవి గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ.వారు ఉపాధ్యాయుడు కావడంవల్ల విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేసి వారిలో కలిసిపోయి వారి మనస్సును చదివిన విధంగా అద్భుతమైన గేయాలు రచించి ఆవిష్కరించారు.

ముస్మందు బాలసాహిత్యం లో మరింత కృషి చేయాలని మనసారా కోరుకుంటూ గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ గారికి శుభాకాంక్షలు.

-ప్రతులకు:
గుళ్ళపల్లి కవిత కాంతి కృష్ణ
ఇ..నెం. 16-16, చేర్యాల
సిద్దిపేట జిల్లా
చరవాణి:9490003295

-శ్రీమతి జయంతి వాసరచెట్ల
చరవాణి:9985525355

భార్య "మణి"

గృహమనే సాగరాన్ని
నిరతము సహనమనే దీపాన్ని
నెత్తిన పెట్టుకొని ఇంటిల్లపాదికి
"దారి"చూపించే కలియుగ దేవత భార్య.

భార్యంటే ఓ మనిషని
బరువు మోసే పని మనిషని
భాధ్యతలను నిర్వహించే యంత్రమని
భావించే "మగ మహారాజులు",కు
తెలియకపోతే ఎలా?
భర్తలు తెలుసుకోపోతే ఎలా?

భార్యంటే భర్తనంటిపట్టుకున్న నీడని
భర్తకు వస్తున్న బాధలను బద్దలకొట్టే గోడని
భర్తకేకాదు ఆకుటుంబాని నడిపించే త్రోవని
కష్టమైనా,సుఖమైనా వీడని జాడని
తెలుసుకోకపోతే,తెలియకపోతే ఎలా?.

మగువెప్పుడూ ఏమీ ఆశించదు
భర్త తన మీద చూపే గుప్పెడు ప్రేమను తప్ప
అతివెప్పుడు ఏమీ కోరుకోదు
తను కోరుకునే కుటుంబ ఆప్యాయతలు తప్ప
భార్యంటే ఓ "మణి"
సుగుణాలు పొదిగిన జవ్వని
తలమీద మణిని వుంచుకొన్నప్పుడే
ఆమె దేవత
ఆ సుగుణ మణిని ప్రేమతో కాకుండా
కర్కసముగా పొందాలను కొన్నప్పుడు
దురుద్దేశ్యముగా ప్రవర్తించినప్పుడు
ఆమె విషము చిమ్ము "కాలనాగు"

- విశ్వనాధ నరసింహం
9490971589

'మేము'

మేము ప్రతి చోట ఉంటాం
మా తోనే దొరలకు ఉషోదయం
మా బతుకులు కళా విహీనం
దొరలకే మేము అంకితం
పశువుల దగ్గర నుంచి
పక్షులు, పైర్ల వరకు
మా అవసరాలకన్నీ మేమే
మా ఉనికి లేకపోతే
దొరల మనుగడ లేదు
మంచ కాడా, చావుకాడ మేమే
మీ కక్షలకు,కారిన్యాలకు బలి మేమే
పొద్దు పొడిచిన దగ్గర నుంచి
పొద్దు కుంగే వరకు
సేవలు చేసేది మేమే
మా జవసత్వాలు, నర నరాలు
మీకోసమే పని చేస్తున్నాయి
మా తదనంతరం
మా వంశంకురాలు
మేము నివసించిన
గాడిపాట కింద బతుకుతూ
మీ వంశవృక్షాలకు
ఊడిగం చేస్తూ జీవిస్తున్నాం
సమాజంలో మేము
ఋణగ్రస్తులం
మీ బానిసలం మేము.

-కనుమ ఎల్లారెడ్డి
93915 23027

ఇదా ప్రేమంటే?

చూపులు కలవగానే
ఉప్పెనలా ఆనందం
అనతికాలంలో ఆవిరి
తొందరపాటూ ఆరాటమూ
మదిలో ఉక్కిరిబిక్కిరి
ప్రతి చిన్నదానికి
పౌరుషమూ పంతాలూ
నిబ్బరం కోల్పోవడం
సగటు మనిషి ప్రేమ వెగటైపోవడం
చెప్పుకున్న ఊసులు
చేసుకున్న బాసలు
పంతాలకు ఆహుతి
ఆత్మావలోకనం లుప్తం
పరస్పర నిందారోపణం
నలుగురి ముందు నవ్వులపాలు
పెళ్ళంటూ అయితే
బాధ్యతలు తలెత్తుకోరు
పరస్పర కీచులాటలే
ఏదీ స్ఫురించదు
ప్రేమబంధం తెగిపోతే
మళ్ళీ మరో కథ
ప్రేమ పునరుద్ధరణ మాటే రాదు

ఆత్మీయత లోపించి
నిలిచిన హృదయ స్పందనలు
ఇది నిత్య కృత్యం
రోజురోజుకీ ముదిరే జాడ్యం
ఒకరినొకరు మభ్యపెట్టుకుని
తికమకలో పెళ్ళిళ్లు
మూన్నాళ్ల ముచ్చట్లు
పసలేని ప్రేమ వ్యసనం
నిజమైన ప్రేమతో
మసలుకోవాలి అందరం .

-ఆచార్య సువర్ణ అలివేలు
98660 75231

బడి మురిపెంగా మురిసిపోతుంది

మొదనట్టపు రోగం తోటి
మూతపడిన సరస్వతీ ప్రసాదాలు
నవ ఆలోచనలతో మొగ్గలు తొడ్కొని
భావి వేగుచుక్క లకు జ్ఞాన కిరణాలను
అమ్ములపొదిలో చేర్చడానికి
బడి ముస్తాబై మురిసిపోతుంది
థౌజండ్ బల్బు లా వెలిగిపోతుంది.
ముడుచుకున్న గేట్లన్నీ తెరుచుకొని
స్వాగత తోరణలై ఆప్యాయంగా
ఆహ్వానం పలుకుతున్నయ్
పక్షులన్నీ ఏకమై పిల్లల తో జాతీయ
గీతాల బృందగానం చేయడానికి
జోరుగా జత కడుతున్నయ్
ఎన్నో నిశీధి రాత్రులతో నిశ్శబ్దముగా
చిన్నబోయిన మైదానమంతా
బుడతల పాదాలతో మురిపెంగా
మురిసిపోతుంది.
సంకకు సంచు లేసుకొని
నెత్తికి నూనె పెట్టుకొని
జుట్లు నంతా నున్న గా దువ్వుకొని
బార్డర్ లో సైనికుడి లా
బడికి బయలు దేరుతుంటే
జన్మ కర్తల సంతోషాల సాగరాలు
అలుగులు పడుతున్నయ్
హరితహార తరువులన్నీ తన నేస్తాల
హస్తాల స్పర్శ తో పరవశిస్తున్నయ్.
పంతులందరూ తన శక్తినంతా ఒంపుకొని
తన ఆయుధాలన్నీ ఆకురాయితో
నూరుకొని నవ శైలి తో ,
నూతన ఉత్తేజం తో ముందుకు సాగుతున్ను
జ్ఞాన జ్యోతులను వెలిగించడానికి
అక్షర శిల్పులను అందించడానికి
నవ సమాజాన్ని నిర్మించడానికి

-తాటిపాముల రమేష్
7981566031

చదువంటే..

చదువంటే - మాకెంతో ఇష్టం
చదువుకుంటే - రాదు ఏ కష్టం
చదువిచ్చును- నీ కెంతో జ్ఞానం
ఆ-జ్ఞానమే-చూపును నీకు-సన్మార్గం.

చదువంటే-కదిలే చైతన్యం
చదువుంటే- కలుగును సౌభాగ్యం
చదువంటే-విరిసే ఓ ఉదయం
చదువుంటే- ఆగదు నీ పయనం
చదువంటే- వెలిగే ఒక దీపం
చదువుంటే- చెదరదు- నీ జీవితం

- బి. గోవర్ధనరావు
సెల్: 9441 968930

రాత - గీత

'ధర' హాసం

ఆకలి మంటల
అగ్ని జ్వాలలు
నింగిని తాకుతున్నాయి
ఆకాశాన ఉన్న ధరలు
దగ్ధమై ఉల్కల్లా
నేలరాలక తప్పదు

శరగోపం

తనపై తనకు
నమ్మకం ఉన్న వాడు సైతం
తలదించుకుంటాడు
భయంతో.. కాకుంటే భక్తితో...



రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

కిన్నెర, ద్వానా కుటీరం, నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు కీ॥శే॥ డా॥ ద్వా.నా.శాస్త్రి సంస్మరణ సభ సందర్భంగా

"నాన్న"

అంశంపై కవితల పోటీ

ప్రథమ బహుమతి రూ.5,000/- నగదు, ప్రశంసా పత్రము,
ద్వితీయ బహుమతి రూ.3,000/- నగదు ప్రశంసా పత్రం
తృతీయ బహుమతి రూ.1,000/- నగదు ప్రశంసా పత్రము,
ప్రోత్సాహక బహుమతులు 5: ఒక్కొక్కరికి రూ.500/-లు

రెండక్షరాల పదం, రెండు సెకండ్ల పిలుపు వర్ణించలేనంత ప్రేమ జన్మంతా సరిపడా నమ్మకం "నాన్న"
కుటుంబానికి మకుటం లేని మహారాజుగా నిలబడి జీవితాన్నంతా ధారపోసి ఏమీ ఆశించని రూపం "నాన్న"
ఇంతకంటే ఏం చెప్పగలం? ఇంతకంటే ఏం రాయగలం? అనుకుంటున్నారా... ఎంతో రాయవచ్చు.. త్యాగమనే పదంలో ఇరుక్కుని ఎవరికీ కనబడని పాత్ర "నాన్న"
ఇరవైఐదు వాక్యాలకు మించకుండా "నాన్న" పై మీకున్న అనురాగానికి అక్షర పట్టాభిషేకం చేయండి.

కవితలను 12-02-2021 లోగా పంపించండి..
(ఈ పోటీకి 50 సం॥లలోపు వారు మాత్రమే అర్హులు)

కవితలు పంపవలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్ నగర్, హైదరాబాద్-20

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 4-2-2021 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

భూ అనుబంధం
గోదాన పరంపర
జీవన జీవం.

ధన వ్యామోహం
అధిక కీర్తి కాంక్ష
పాపాల మెట్లు.

రైతుల ర్యాలి
దేశ కీర్తికి మచ్చ
బుద్ధ సందేశం.

టైర్ల రిపేరు
స్త్రీ శక్తికి జోహార్లు
సర్వసమానం.

జంటహత్యలు
విజ్ఞానుల అజ్ఞానం
క్షుద్ర పూజలు.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

భౌతిక ఎడముంటూనే
బడిగంట రమ్మనే !
చదువుల ఒడిలో చేరిరి
సరస్వతి అమ్మనే !

కరోనా కారణంగా
దీర్ఘ కాల సెలవులు !
విసిగి వేసారి పిల్లలు
కదిలినారునెలవులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

యువ విద్యార్థి నాయకుడు ఫణిభార్గవ్ చిరస్మరణీయుడు

పురస్కార గ్రహితలతో అతిథులు.

రాయప్రోలు వెంకటరమణను సత్కరిస్తున్న డా॥ కే.వి. రమణాచారి.

తెలంగాణ రాష్ట్ర యువ విద్యార్థి నాయకుడు ఫణిభార్గవ్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. కళానిలయం సంస్థ, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాసుబ్బారావు కళావేదికలో తెలంగాణ వీరాభిమాని ఫణి భార్గవ్ యాదిలో భాగంగా పలువురు ప్రముఖులకు నగదు పురస్కారాల ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డా॥ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. అతి చిన్నతనంలోనే ఆకస్మిక మరణం చెందిన ఫణిభార్గవ్ పేరు మీదుగా ప్రతి ఏటా కొందరి ప్రముఖులకు నగదు పురస్కారాలను అందిస్తున్న ఫణిభార్గవ్ తండ్రి పాత్రికేయుడు రాయప్రోలు వెంకటరమణను అభినందించారు. ఈ సభలో డాక్టర్ ఎంకే రాము, బైస దేవదాసు, డాక్టర్ రెంటాల జయదేవ్, కళా జనార్ధనమూర్తి, కులకర్ణి రంగాచార్యులు, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫణిభార్గవ్ యాదిలో భాగంగా సీనియర్ పాత్రికేయుడు ఎస్ఎస్ఆర్ శాస్త్రిని, పాత్రికేయుడు సుల్తాన్ అహ్మద్‌ను, సురభి వారధి ఫౌండేషన్ (అనాథ సేవా సంస్థ), నిర్వాహకుడిని, ప్రజానాట్యమండలి కళాకారుడు బూర్గుల ప్రభాకర్‌ను అతిథులు ఘనంగా సత్కరించి, నగదు పురస్కారాలను ప్రదానం చేశారు.

ఈ నగదు పురస్కారాలను ఫణిభార్గవ్ తండ్రి ఆర్.వి. రమణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త కులకర్ణి రంగాచార్యులును, విద్యావేత్త చల్లా సత్యనారాయణను అతిథులు ఆత్మీయ సత్కారాలు చేశారు. రాయప్రోలు వెంకటరమణ, ఏ సురేందర్ సభలో పాల్గొన్నారు. ముందుగా జరిగిన నృత్య ప్రదర్శనలు, మంథా సాయి భరద్వాజ వేణుగాన కచేరీ సభికులను అలరించాయి.

ఎప్పుడూ

ఎప్పుడూ అంతే కదా
మౌనం పోతపోసిన బొమ్మలాగే కనిపిస్తావు.
అయితేనేం
ఎన్ని మాటలు నీ చూపుల్లో క్షణక్షణానికీ
రంగుమారుతూ
ఇప్పుడో ఇహనో రాలిపోయే ఆకుల్లా
హేమంతానికి రూపు కడతాయో
రాలుతున్న రంగుల తలంబ్రాల మధ్య
రెప్ప వాల్చని మాటలు ఊపిరి పరిమళంలా మార్చుకు
ఎన్ని అత్తరు సీసాల జడి వానలో
చేతులు చాచి పసిపాపనై పోయాననీ ...

మసక వెలుగుల్లో అర్ధరాత్రి దాటే వరకూ తడిసి తడిసి
లోలోపల పెదవి కొసలు దాటని గమకపు తునకల్లో
తల్లీనమవుతూ, గుండె పై తలవాల్చి
నేను కాని నా ఉనికి మొత్తం
నీ అణువణువునా ప్రవహిస్తూ శూన్యమై పోయాక
జీవనదిలా ఒక అదృశ్య సరిత్తు నీవై
నాలో నన్ను తట్టి లేపాక
పధ్నాలుగు భువననాలే తప్ప
మన పాలపుంత దారి ఎవరికి తెలుసు?
నీకూ నాకూ తప్ప దారి తెలియని ఈ రహస్య విశ్వం
కాస్సేపు కళ్ళు వాల్చి – ముగ్ధ మనోహరి అవుతుంది.

ఎన్ని యుగాలు పరుగులు తీస్తేనేం?
ఎన్ని తరాలు పెదవులు విరిస్తేనేం?
ఎప్పటికప్పుడు కత్తిరించిన కొమ్మలనిండా కొత్తమొగ్గలు
ఎప్పటి కప్పుడు దూసేసిన ఆకుల మధ్య
బిడియంగా తలలెత్తుతూ
తెల్లని చిరునవ్వులు
సమయం ఒక మంత్రదండం
వెలుగులూ వెన్నెలలూ
హేమంతాలు వసంతాలూ దానికి మామూలే.
ఎప్పటికప్పుడు రాలిపోయిన రంగులు భద్రంగా
జీవితం పుటల మధ్య దాచుకు
కొమ్మకొమ్మనా మారాకు కోసమే
వెతుక్కుంటాం కదూ

–స్వాతీ శ్రీపాద
8297248988

మారుతోన్న దృశ్యం

మనిషి నుంచి జీవితం పారిపోయే దృశ్యం కనిపిస్తోంది!
అమ్మఒడి నుంచి పిల్లాడు దుముకుతున్నట్లు
లాంగ్‌బెల్ మోగగానే బడిపిల్లలు పరుగులు తీసినట్లు
తలుపు తీయగానే దొడ్లోంచి మేకలు గెంతులేసినట్లు
ఏమిటి?
ఎవరు వేశారీ వశీకరణ మంత్రం!!
నలుదిక్కుల నుంచీ ఆక్రమణల
అంబులెన్స్ మోత అధికమవుతూనే ఉంది
నిశ్చితి నుంచి అనిశ్చితిలోకి,
అభయం నుంచి భయంలోకి
నమ్మకం నుంచి అపనమ్మకంలోకి
పల్టీలు కొడుతూ కొడుతూ
ఉనికి మూలాల్ని ఛేదించుకొనే
కసరత్తు ఆగక సాగుతూనే ఉంది
చెట్టు నుంచి పువ్వు కాలడం సహజమే కానీ
పువ్వు నుంచి చెట్టువాలడం ఏమిటీ?
అదొక రివాజైపోవడం
మొదలు కోల్పోయిన ఊడలమర్రిలా
మనిషి కళ్ళప్పగించి చూస్తుండగానే
జీవితం పారిపోతోంది..



–చీకోలు సుందరయ్య
సెల్: 90300 00696

పుస్తక సమీక్ష

ప్రముఖులతో ముఖాముఖి

నక్షత్రాలతో మాటాడాలంటే, వాటంత ఎత్తుకు ఎదగాలి. ఇంటర్వ్యూ చేయాలంటే వాటికంటె ఒక ఆకు ఎక్కువ చదివి ఉండాలి. పద ముగ్గురు తెలుగు సాహితీ, సినీ తేజోమూర్తులను "ముఖాముఖి" ఇంటర్వ్యూ చేసి వివరాలను ఈ సంకలనం ద్వారా రచయిత్రి మనకందిస్తున్నారు.

డా॥సి. భవానీదేవిగారు తెలుగు పాఠకులకుపరిచయం అక్కరలేని ప్రతిభాశాలి. ఇంగ్లీషు తెలుగు హిందీ భాషల్లో పట్టభద్రురాలు. కథ కవిత్వం నవల వ్యాసం, అనువాదం– ఏది స్పృశించినా తన 'పరుసవేది' స్పర్శతో సువర్ణం చేసారు. అనువంశికంగా తండ్రి నుండి వచ్చిన తన సాహితీ జ్ఞానానికి తనదైన 'పదును'జోడించి ప్రకాశించారు. ఎందరో నిష్ణాతులు హేమాహేమీలతో అతి దగ్గరగా మెసలటమే కాకుండా పలు పత్రికల వారి పనుపున ఇంటర్వ్యూలు చేశారు. 1980–1995 మధ్య కాలంలో తాను ఇంటర్వ్యూలు చేసిన పదముగ్గురి వివరాలను పొందుపరిచిన సంకలనమే ఈ తేజోమూర్తుల ముఖాముఖి ఫీచర్.

సంకలనంలో 5గురు సాహితీవేత్తలు ఎనమందుగురు సినీరంగ ప్రముఖుల ఇంటర్వ్యూ వివరాలను ఇచ్చారు. ఊటూకూరి లక్ష్మీకాంతమ్మ, కరుణశ్రీ, మధురాంతరం రాజారాం, ఆచార్య తిరుమల కోడూరి (అరికెపూడి) కౌసల్యాదేవి సాహితీవేత్తలు. గుమ్మడి, అల్లురామలింగయ్య, బి. సరోజదేవి,కృష్ణకుమారి, జిక్కి, కాంతారావు, రమాప్రభ, నగేష్‌లు సినీరంగ ప్రముఖులు. ఒక్కో ఇంటర్వ్యూ ఒక పేజి (శ్రీమతి రమాప్రభ) నుండి ఏడుపేజీల వరకు (మధురాంతకం రాజారాం) విస్తరించాయి.

ఇంటర్వ్యూ చేయబడ్డ వారెంత ప్రతిభావంతులో అంతటి ప్రతిభ ఇంటర్వ్యూ చేసిన డా॥సి.భవానీదేవిగారు కనబర్చినారు.

సంకలనంలో భవానీదేవిగారు రాల్చిన మేలి ముత్యాలు కొన్ని. ఉత్తమ కవిత్వానికి నిర్వచనం "కవిత్వం అనేది ఒక మహా తపస్సు. సత్యం, శివం, సుందరం. కవి చెప్పేది వాస్తవానికి దగ్గరగా ఉండాలి. విశ్వానికి క్షేమం కలిగించేదిగా ఉండాలి. అది అందంగా ఉండాలి. (జంధ్యాల పాపయ్యశాస్త్రి)

కొత్తతరం రచయితల్లో ఎక్కువమంది వస్తువు కోసం జీవితాన్ని, శిల్పం కోసం సాహిత్యాన్ని శ్రద్ధగా పరిశీలించటం లేదు (మధురాంతకం రాజారాం).

నేను (సాహిత్యం ద్వారా) ఆనందాన్ని పొంది ఆ ఆనందాన్ని పదిమంది పంచాలన్నది నా ధ్యేయం (ఆచార్య తిరుమల).

విమర్శలనెలా స్వీకరిస్తారన్న ప్రశ్నకు గుమ్మడి జవాబు.

విమర్శలు స్వీకరిస్తున్నప్పుడు విమర్శకులస్థాయి పరిజ్ఞానం పరిగణలోకి తీసుకోవాలి.

సినిమా ఫీల్డ్‌లో భావదారిద్ర్యం బాగా ఉంది. (అల్లు రామలింగయ్య).

దుష్ట శిక్షణ–శిష్టరక్షణ ఎప్పుడూ ఉంది. ప్రతి కథలోనూ అది ఉంటుంది. కాని నేడు శృతి మించింది. సెంటిమెంట్స్ లేని ఫారిన్–కల్చర్‌ను మనం దిగుమతి చేసుకొన్నాం (టిఎల్ కాంతారావు)

నేను ప్రేమించింది ఏదీ నాకు లభించలేదు. నాకు లభించిన దాన్నే నేను ప్రేమించాను (సినీ హాస్యనటుడు శ్రీ నగేష్)

తను అభిమానించి, ఆరాధించిన మహానటి సావిత్రికి అంకితం చేసిన ఈ సంకలనంలో తానూటంకించిన తేజోమూర్తులందరి జీవన వివరాలు, వారి వారి ప్రతిభా పరిచయాలు Conclusion గా ఇస్తే మరీ బాగుండేది.



ప్రతులకు: సి.భవానీదేవి
హిమబిందు పబ్లికేషన్స్,102,
గగన్‌మహల్ అపార్టుమెంట్&
దోమల్‌గూడ
హైదరాబాద్–500 029
ఫోన్:040–2763 6172

– కూర చిదంబరం
సెల్: 8639338675

శిలా శాసనం

గతం తీయనిది
ఆనంద దాయకమైనది
భవిష్యత్తు అందమైనది
ఆశా జనకమైనది.

వర్తమానం
నికృష్టమైనది
కష్టదాయకమైనది.

మానవుడు
గతంలోనో భవిష్యత్తులోనో
జీవించే అవకాశం
వుండి వుంటే ఎంత బాగుండేది!

నేటికి తీయగా మారిన నిన్న
నిన్నటి రోజున
చేదైన నేడే కదా!

నేడు ఆశాజనకంగా కనిపిస్తున్న రేపు
రేపటికి
దుఃఖదాయకమైన నేడవుతుంది కదా!

ప్రస్తుతానుభవంలో లేని విషయం
ఆలోచనలో రసాత్మకమౌతుంది
రసప్లావిత హృదయం కనులనిండుగా
ఇంద్ర ధనుస్సుల్ని ప్రతిఫలింపజేస్తుంది.
నేటి చేదులో
ఏ మాత్రమో తీపి వుంటేనే కదా
గతం తీయగా మారగలిగేది!

నేటి కష్టంలో
లేశ మాత్రమైనా సుఖముంటేనే కదా
రేపటి రోజున సంతోషం కలిగేది!

వర్తమానపు
ముళ్ళ చక్రాల సాయంతోటే కదా
కాలం గొలుసు ముందుకెళ్ళేది.
గొలుసు ఖాళీల్లో చక్రపు ముళ్ళని
సరిగా అనుసంధానించ గలిగిన వాడి ముఖాన
నిప్పురవ్వలకు బదులుగా
ఫెనరిజాన్ని చిమ్ముతుంది
కాలాగ్నిశిఖ
కాలచక్రాన్ని గాలికొదిలేస్తే
ముళ్ళు చేసే గాయాల కారణంగా
రక్తసిక్తమైన మెదడు
ఎర్రబారిన కళ్ళగుండా
బొట్లు బొట్లుగా జారి
బుగ్గలపైన చారికలు కడుతుంది.
మనీషిపట్ల కాలం వైఖరెప్పుడూ
శిలా శాసనమే
కాలం శిలమాత్రమే
శాసనాన్ని రచించుకొనేది
మానవుడే సుమా!

– పరిగొండ కాంతారావు
సెల్:94418 86824

అల్పపీడనం

ఈరోజు రెండు కళ్లు వెంటాడాయి నన్ను
ఆకాశం కప్పుకింద రాత్రిపూచిన
స్వప్నాలను తలగడ చేసుకునే
అభాగ్య ప్రపంచపు అనామకజీవుల్లో అతనూ ఒకడు
అతని కళ్ళలోని నిర్లిప్తత కలవరపెట్టింది
స్వప్నాల మంచు కరిగిపోతూ
నిద్ర కప్పిన భద్రత దుప్పటిని లాగేసింది...

మరో పోరాటాన్ని ఆలోచించే
అతని బక్క పలచటి దేహం
అతని మనసును నిమిరింది
చుట్టూ ఉండే పరుగు ప్రపంచంతో
ఈ అధోజగత్ సోదరులకు సంబంధం ఉంటుందా...
అతను చేయి చాపితే ఒక సలహా పడేస్తామందరమూ
నాలుగు మెతుకులు దొరకని శరీరాన్ని
నాలుగు బస్తాలు మోయమని
హింసించలేని అల్పజీవతను
నాలో అల్పపీడనమై జొరబడ్డాడు

పిట్ట గూడుకు పేదరికం అడ్డురాదు
నాలుగుకాళ్ళ జీవులకు తిండిలోటుండదు
నీడనిచ్చే నిశ్చల వృక్షాలను ఎండా వానా బాధించవు
బాధ్యత తెలిసిన మనిషి
భాషణ చేసే మనిషి మాత్రం
తన ప్రపంచాన్ని అంతస్తులు చేసి పైకెగబాకుతుంటాడు
తమకంటూ పైకప్పులేని అతనిలాంటి దుర్బలులు
అనాచ్ఛాదిత రాత్రిని స్వప్నాలతో పూయిస్తారు
అందుకే
వేకువంటే భయంవారికి
వేకువంటే అభయం అనుకునే
నన్ను
అతని కళ్ళు వెంటాడాయి
అతని చూపులను అనువదించుకోమన్నాయి
వేకువ నాకు జవాబులేని ప్రశ్నయిందిప్పుడు
నాలో అల్పపీడనం తుఫానుగా మారింది .

–సి.యస్.రాంబాబు
8374818961

పౌరులకు పాఠాలు

దేశ పటం మీద పడిన
దుమ్ము ను పూర్తిగా దులిపేస్తే
లోపలి అల్మరాలోంచి
గుప్పుమంది
అప్పటి రాజకీయ సువాసన
నాయకులంతా గులాబిపూలే
ముళ్ళు ఉండేవి కాదు
తలపాగా విప్పితే చాలు
త్యాగాలన్నీ
పరుగుల వేటకు సిద్ధం
బలిదానాల కోసం
వరుసల్లో వీరులు
వందేమాతర గీతం
వజ్రాయుధమైన వేళ
అర్ధరాత్రి సాక్షిగా
దేశానికి స్వాతంత్ర్యం .

దేశంలో ఎన్నికలు
ఆ తరువాతే మొదలయింది
ప్రజలు నమ్మిన రాజకీయం
రంగు రుచి వాసన కోల్పోవటం
రాజసం నుంచి రాక్షసానికి
చాలా ఇష్టంగానే
పాలకుల బుద్ధి బదిలీ కాబడింది
దేశం నమ్మిన నీతి,
అవయవాలను కోల్పోయింది
అవినీతి మురికి
మెజారిటీ ఓట్లతో
దేశంనిండా ఊరేగింపు
ఎన్నికల్లో ఓటరు విజ్ఞత
ప్రతిసారి ఓడిపోతూనే ఉంది
చూపుడు వ్రేలిమీది గుర్తు
మళ్ళీ ఐదేళ్లదాకా
నిద్రకోసం మత్తుతో వొప్పందాలు
నిలువు దోపిడి
విధ్వంసాలను చూడలేక
గాంధీ విగ్రహం కళ్ళద్దాలు
పగిలిపోతున్నాయి.

పతాకంనిండా కన్నాలు
చెదనుమోస్తూ జెండా కర్రలు
గేయాల నిండా గాయాలు
జైహింద్ నినాదాల్లో
నిశ్శబ్దమై పోయిన దేశభక్తి
అంతా యాంత్రికం
అందరూ యంత్రాలే

దూరంగా ఏదో బడిగంట
అప్పట్లో
దేశంకోసం చిందిన రక్తం..
మళ్ళీ దేశ రాజసం కోసం
పాఠశాలల పెట్టి
పాఠాలు బోధిస్తోంది
ప్రజల్ని పౌరులుగా కాదు
వీరులుగా మార్చటానికి

–డా. కె.జి. వేణు
98480 70084

హరితహారం

చెట్లు ప్రగతికి మెట్లు
ప్రకృతి వస్త్రాలయం
జగతికి రక్షణ ఆలయం
వర్షాలు రావాలన్న
భూతం తగ్గాలన్న
పల్లె పులకరించాలన్న
ఆధారం చెట్లు. అవసరం చెట్టు
ప్రతిఫలేక్ష లేని హ్యూమనిస్టు
సమానత్వం లో కమ్యూనిస్టు
మానవ వికాస తరంగం చెట్లు
అలంకరప్రాయంగా ఫొటోకు పొజిచ్చి
ఆ క్షేణమే నన్నుమర్చి
నర్సరీ అనే నా ముద్దుల తల్లి గర్భంలో
ముద్దుగా పెరుగుతున్న నన్ను
నీరు పోయక,నన్ను రక్షించక
భ్రునహత్య చేయకు
ఆయుర్వేదంఅయ్యి ఆరోగ్యమిచ్చి.
వంటసరుకు అయ్యి....
పెళ్లి పందిరి హోమం అయ్యి
జీవన వేదంలో నీకు అర్థం కానీ వేదాన్ని
ఆరవ విడత అయిన
ఆరవ ప్రాణంగా నాటుదాం
చెట్లు..ప్రతి ఒక్కరు బాధ్యతగా పెంచుదాం
పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం
నాటిన చెట్లు
సాంస్కృతిక పునర్జీవన
సోపానాలు అయ్యి
సాగు ప్రగతికై...

–వి.శేషారావు
9440408080

ప్రజలను జాగృతం చేయడంలో పత్రికలది కీలకపాత్ర

'నేటి లీడర్' మాస పత్రిక వార్షికోత్సవంలో డా॥ రమణాచారి

రాజకీయంగా, సామాజికంగా ప్రజలను జాగృతం చేయడంలో పత్రికలు కీలకపాత్ర పోషిస్తాయని వక్తలు పేర్కొన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బుధవారం 'నేటి లీడర్' మాస పత్రిక వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విజయం' మాసపత్రిక సంపాదకులు వాసిరెడ్డి కాశీరత్నం, నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, కళా వి.యస్. జనార్ధమూర్తి, గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, గుదిబండి వెంకటరెడ్డి, కార్పొరేటర్ రంగా నరసింహగుప్త, ఆవిష్కర్త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రామణాచారి, నేటి లీడర్ సంపాదకులు లంకా ఫణికుమార్, డా॥ బోర కోదండపాణి, వరంకుమార్‌శర్మ, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, డా॥పి. లలితావాణి, పాతూరి సురేశ్‌కుమార్‌శర్మ, వల్లం నవీన్‌కుమార్, మోహన్ కుమార్ గాంధీ. పాల్గొన్నారు.

జనవరి 27, 2021న త్యాగరాయ గానసభలో 'నేటి లీడర్' మాస పత్రిక వార్షికోత్సవ సభలో వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న 'మహిళా విజయం' మాసపత్రిక సంపాదకులు వాసిరెడ్డి కాశీరత్నం, నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, కళా వి.యస్. జనార్ధమూర్తి, గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, గుదిబండి వెంకటరెడ్డి, కార్పొరేటర్ రంగా నరసింహగుప్త, ఆవిష్కర్త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రామణాచారి, నేటి లీడర్ సంపాదకులు లంకా ఫణికుమార్, డా॥ బోర కోదండపాణి, వరంకుమార్‌శర్మ, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, డా॥పి. లలితావాణి, పాతూరి సురేశ్‌కుమార్‌శర్మ, వల్లం నవీన్‌కుమార్, మోహన్ కుమార్ గాంధీ.

డా॥ రమణాచారిని సత్కరిస్తున్న నేటి లీడర్ సంపాదకులు లంకా ఫణికుమార్, డా॥ బోర కోదండపాణి.

అఖండ దీపం

అన్ని మతాల ఆత్మలు అనుసంధానమవకుంటే
ఒకే యేటి తరగలమై ప్రవహించగలమా?
ఒకరి ఆర్తి ఒకరికి సొంత మవకుంటే
సానుభూతి పవనాలమై వీయగలమా?

అంతరంగపు ఆమోదముద్ర పడకుంటే
ఇరుగు పొరుగున దశాబ్దాలు గడపగలమా?
సోదర భావమే మదిన స్థిరపడకుంటే
దేశ రక్షణకై కలిసి పోరాడగలమా?

మత వివాదాలు సత్యమే అయితే
మెరుపుల్లా మెరిసి మాయమవుతాయా?
విభేదాలు నిజంగా వేళ్ళూనుకుని ఉంటే
తారాజువ్వల్లా ఎగిసి నేల రాలుతాయా?

మతగాయాలను రేపే పదునైన గోళ్ళు
రాజకీయ రక్కసి వని పసిగట్టలేమా;
మతం ముసుగులో జరిగే దారుణాలను
మానవతా ఖడ్గంతో ఛేదించలేమా?

బలమైన పహారాల్లోంచి కాదు
యెద భూ పొరల్లోంచి పెల్లుబికింది
మన ఏకతాఖనిజం!
మతగురువుల బోధనల్లోంచి కాదు
మనో సంకల్ప బీజాల్లోంచి మొలకెత్తింది
మన ఓరిమి తత్వం!

కనబడని కుట్రలు ముక్కలు చేయాలనుకున్నా
కదంబ భారత మెన్నటికీ రూపు మార్చుకోదు!
వేర్పాటు మంటల్ని ఎవరెంతగా ఎగదోసినా
మన సహనపు జల్లులతో అవి చల్లారక తప్పదు!

మనం నడిచే దారిలో ఎత్తుపల్లాలెన్ని ఎదురైనా
శతాబ్దాల చెలిమి రథం సాగక ఆగదు!
జాతి వృక్షాన్ని ద్వేషంతో ఎన్నిసార్లు నరికేసినా
సమైకృతా చివుళ్ళు తొడిగి
మళ్ళీ మళ్ళీ ఫలించక మానదు!

చీల్చుకుంటే పోతే.. మిగిలేది శూన్యం!
చేర్చుకుంటూపోతే..
సొంతమయ్యేది సమున్నత విజయం!
చేతులు వదిలేస్తే
అందరం ఒక్కొక్కరమే నేస్తమా!
కలుపుకుంటే..
ఒక్కటే వెలిగే అఖండ దీపాలమౌతాం!

– ఎస్. కాశింబి
సెల్: 9052216044

ప్రకృతే పగబడితే - నరుడి బ్రతుకు నరకమే!

కెవ్వుమన్న కేక విన్న – తల్లిదండ్రి తన్మయత్వం చెందేరా
కన్ను మూశాక కట్టె రగిలేరా – మనిషి మట్టె మిగిలేరా
జగతిలో ఎంతకూ అంతుచిక్కనివి – జననమరణాలేరా–

లక్షలు లక్షలు ఆర్జించి – లాకర్ లో భద్రంగా పెట్టినా
కోట్లు కోట్లు ఖర్చుచేసి – కొంపలు కట్టినా,నీ ప్రాణమైన
చివరికి నీచేతిలోని సెల్ ఫోన్ కూడా – నీ వెంటరాదురా–

ఆస్తులెన్నో ఆర్జించినా – ఆకాశాన విహరించినా
సుందర గ్రానైట్ భవనాల్లో– సుఖంగా శయనించినా
కడకు కాటికి నీ పయనం – ఖాళీచేతులతోనే గదరా–

కలవాడైనా కడుపేదైనా కడకు – కన్నుమూసి, కట్టె
కాలవలసిందేరా – మళ్ళీ తిరిగి మట్టిపోవాల్సిందేరా
సుందరస్వప్నం కాదురా జీవితం – సుడిగాలిలో దీపంరా–

గ్రహాలను గాలించినా – చంద్రమండలాన్ని ఛేదించినా
గుండెలనుమార్చినా – టెస్ట్ ట్యూబ్ బేబీలనే సృష్టించినా
గాలిలో కెగిరే ప్రాణానికి – గాలం వేసే వాడెవ్వడురా ?

లేదురా చచ్చి బ్రతికిన వాడు – తిరిగి లేచిన వాడు
లేదురా లేదురా స్వర్గనరకాలు – చూసి వచ్చినవాడు
మట్టిలో కలిసే ఈ మనిషికి – మరోజన్మ ఎక్కడిదిరా ?

లెక్కపెట్టగవచ్చు – నింగిలోని చుక్కల్ని నీటిబిందువుల్ని
లెక్కపెట్టగవచ్చు – చెట్టులో ఆకుల్ని జుట్టులో వెంట్రుకల్ని
జననానికి అర్థంకానివి – ఈ జగతిలో జననం మరణాలేరా

సముద్రాలు ఇంకిపోయి – చుక్కలే రాలిపోయి,సూర్య
చంద్రులే గతితప్పిన – సృష్టేలేదురా అంతా శూన్యమేరా
ప్రకృతే పగబడితే – ఇక నరుడి బ్రతుకు నరకమేం!

–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

ఆడవాళ్ళు మీకు జోహార్లు

వంటగదిలో గరిటె తిప్పిన చేయి
పసిపాపలను పెంచిన చేయి
కారు స్టీరింగ్ తిప్పిన చేయి
బస్సు నడిపిన చేయి
లోకో పైలట్ గా ట్రైన్ నడిపిన చేయి
ఈరోజు అత్యంత కీలకమైన బోయింగ్
సమర్థవంతంగా నడిపిచూపించిన చేయి

ఆమే జోయాఅగర్వాల్
ఆమె ప్రపంచానికి విసిరిందో సవాలు
అత్యంత కఠినమైన రూటులో
చాలా కీలకమైన బాటలో
ప్రమాదపు అంచులో
అమెరికా దేశంలో సిలికాన్ వేలీ నుంచి
భారతదేశపు సిలికాన్ వేలీ వరకు

ఆగకుండా
ఆపకుండా
ఆత్మ విశ్వాసం తో నింపబడి
కర్తవ్యదీక్ష తో నింపబడి
ఏకబిగిన పదిహేడు గంటలపాటు
గగనతలంపై చేసిన విన్యాసం
స్త్రీ జాతిని జాగృతం చేసింది
స్త్రీజాతిని గౌరవాన్ని అమాంతం పెంచేసింది

ఎవరన్నారు
ఆడదానిగా పుట్టడం కంటె
అడివిలో మానై పుట్టడం మంచిదని
మేము ముక్తకంఠంతో అంటున్నాము
ఆకాశం కూడా అందుబాటులో ఉందని

–అరుణ డేనియల్
9000606889

ఆలోచించు!

నీ దగ్గర ఎంత ఉందని కాదు!
ఎంత ఇవ్వగలవు అన్నది ఆలోచించు!!

నీవెంత ఉత్తముడివి అన్నది కాదు!
ఎందరికి మేలు చేయగలవు అన్నది ఆలోచించు!!

నీకెంత భక్తి ఉందన్నది కాదు!
ఎందరికి భుక్తి కల్పించగలవో అలోచించు!!

నీకెందరు సాయం చేశారన్నది కాదు!
ఎందరికి చేయందించావోఆలోచించు!!

నీ కంటి నిండా నిద్ర పోయావన్నది కాదు!
ఎందరు నీవల్ల నిద్రలేని రాత్రులు
గడుపు తున్నారో ఆలోచించు!!

నీ బాధల్లో నిన్ను ఓదార్చే వారేవరన్నది కాదు!
ఎందరిని నీవు సంతోష పెట్టగలవో ఆలోచించు!!

–మెండు ఉమామహేశ్వర్ సైకాలజిస్ట్
9849741333

అశల అడుగు!

అశల పల్లకిలో కూర్చొని
అటూ ఇటూ చూస్తున్నా
కరోనా కాలి బూడిదయ్యిందేమోనని!
రూపాంతరం చెందిన కరోనా
రెండవ అడుగేసిందని తెలియక..
అయినా కొత్త సంవత్సరం
ఆదిలోనే అంతం చేస్తుందేమో నని
ఆరోగ్యం వెంట తెస్తుందేమోనని
అపురూపం గా చూస్తున్నా!
కొత్త సంవత్సరం కోటి ఆశలను
క్రొంగొత్త ఆశయాలతో ఇంటివాకిట
అడుగిందేమోనని అటూ ఇటూ చూస్తున్నా!
తెల్లవారిన ఉషోదయపు కాంతుల్ని
వెదజల్లుతూ, సూరీడు ఎప్పటిలా
కాలగమనాన్ని అనుసరిస్తూ
మౌనం గా ఆకాశయానం చేస్తూనే ఉన్నడు!
కాలం తనవెంట తెచ్చుకున్న
చలిదుప్పటి కప్పుకొని రోజూలా
సంచరిస్తూనే ఉన్నది,
నా బేలచూపులను చూసి నవ్వుకుంటూ
ఇరువదవ సంవత్సరం
వెనుదిరిగి చూడకుండా వెళ్లి నట్టనిపించింది!
కాలం ఎప్పటిలా ఇరువదొకటిని
మోసుకుంటూ నడుస్తోంది!
ఎప్పటిలా నా స్వగతం
స్వాగతగీతం ఆలపిస్తూ ముందుకు సాగుతోంది!
నిశ్శబ్ద సంకేతాలను నెమరేసుకుంటూ....!!

–యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్: 9866447234

నానీలు

మురిసిపోతుంది
నేలమ్మ.....
మెత్తగా రాలుతున్న
పత్ర హరితాలకు

తనివి తీరా తడుస్తుంది
వనమంతా....
మనసారా కురుస్తున్న
ముసురుకు

పరవశించి పోతుంది
ప్రకృతి
చిగురులు వేసిన
తరువుల జూసి....

–కళావతి కందగట్ల
9948263004

కుళ్ళుబట్టిన సమాజం

జెలసీ ద్వేషం
స్వార్థం వ్యామోహం
ధనం అహం
మదం మాత్సర్యం
దోపిడీ దౌర్జన్యం
ఉన్మాదం రాక్షసతత్వం
అత్యాచారం అరాచకత్వం
రాజకీయం రాజ్యాధికారం.

కావేవీ ఈ పదాలు కుత్సితత్వానికి అనర్హం
ఇవియే అనాదిగా కుళ్ళుతో కున్నారిల్లుతున్న
సమాజానికి నిరూపణం.

ఒక్కడు ఒక్కొక్కమెట్టు పైకెదికేకొద్దీ
నిచ్చెన మెట్లు కూల్చడమే
అసూయపరుడి రాక్షసత్వం.

ఉన్నోడు లెనోడి దగ్గరే దోచడం
లెనోడు అనాదిగా దగాపడుతున్న దౌర్భాగ్యం
ఇదే దుర్మార్గుడి మృగాన్ని మించిన మదం.

కర్రు కాల్చి కింద వాతబెట్టి
ఆపై కూర్చోబెట్టాలి ముళ్ళకంచెపై
అణిగేలా అహంకారం
కూకటి వేళ్ళతో నరికి పోగులుపెట్టాలి తక్షణం
చీడబట్టిన ఇలాంటి మకిలి కంటకుల మస్తిష్కం

అప్పుడు గానీ చేయలేం
ఈ కుళ్ళుబట్టిన సామాజాన్ని భూస్థాపితం
అప్పుడే ఈ సమాజానికి వెల్లివిరుస్తుంది సౌభ్రాతృత్వం.

–నాగముని. యం
9490856185

అమ్మ కొంగు

ఎండా వానలకు కాచే గొడుగైతాది
నిదురించాలంటే మెత్తటి పరుపైతాది
ఒణికించే చలికి వెచ్చని దుప్పటైతాది
ఉక్కపోతలో చల్లని గాలి వీచే విసనకర్రయితాది.

చెమటలు కారినా
జలుబే చేసినా
తుడుచుకునే తువ్వాలైతాది.

భయమేసినా , కొత్తవారు ఎదురొచ్చినా
సిగ్గు బిడియాలు అడ్డొచ్చినా
తాను ముఖం దాచుకునే
రక్షణ కవచమైతాది
అమ్మ కొంగులోనే కదా
మన భవిష్యత్తుకు వేసే బాటను
మూటగట్టి పెడుతుంది
ప్రపంచములోని ప్రేమంతా
అమ్మ కొంగులోనే కదా కొలువై ఉంటుంది.
అమ్మ కొంగేగా అందరికి
అత్యంత విలువైన ఆస్తి

–దేవలపల్లి సునంద
8297744716

ఏది.. నీది...?

నీ పుట్టుక కోసం పురిటినొప్పులతో ఏడ్చిన తల్లి
ఈ లోకంలోకి నువ్వు ఏడుస్తూ రాగానే నవ్వింది మళ్లీ
తప్పటడుగుల నుండి తడబడి నేర్చిన మాటల వరకు
పడిలేచి పరుగుతీసి ప్రయాణించినవ్ జీవనం కోరకు
బంధాలు, బంధువులంటూ కాలంతో పోటీపడి
ఆకలిని మించిన ఆశ కోసం అను నిత్యం కష్టపడి
తరగని సంపదున్న లోపల నీకుండదు మనశ్శాంతి
కంటినిండా కునుకు తియక్క దూరమైంది విశ్రాంతి
పక్కవాడు ఎదిగితే ఓర్చేదిలేదు
కాస్తయిన
నీ సంపదలో సాయం చేసి చూడు ఏనాడయినా
బంగళా అలంకరణతో నీకు మంచి పలుకుబడి
ఆకలి తీరక రోడ్డున పడ్డ
బతుకులని చూడు ఓ సారి నిలబడి
ఒక్కడిగా వచ్చి,ఒంటరిగా పోయే ఈ జీవితానికి
మధ్యలో వేసేది ఎన్ని వేషాలో నీ నాటకానికి
నాది, నీది అంటూ ఏది లేకుండా సాగే కాటికి
నీ ప్రయాణం
మంచి, చెడులే నువ్వు మిగిలేది
చివరి క్షణం

–పల్లె రాజు
9666207288

కలం-కత్తి

కలముచేతమధుర:కావ్యాలు వ్రాయొచ్చు
కత్తి తోడ వుళ్లి:కత్తిరించు
కావ్యపఠనవల్ల:జ్ఞానమ్ము పెరుగును
తల్లికన్న మిన్న:ఉల్లిమేలు!

కత్తి గొంతుగోసి:కడతేర్చు జీవుల
కలము కవిత వ్రాసి:ఘనతనొందు
ప్రాణహాని వల్ల:ఫలితమేమున్నది
గ్రంథ పఠనతోడ:జ్ఞానమబ్బు!

కత్తి తలలనరికి:కడురాజు లైరిగ
రాజ్యమేను వీర:భోజ్యమనిరి
కలము చేతసుకవి:కవ్వించురాజుల
కత్తికన్న మిన్న:కలము కాదె!

కలములోని యింకు:కావ్యసుధలనిచ్చు
కత్తి నరికిచంపి:రక్త మిచ్చు
కలము సకలసార:కావ్యపరిమళాలు
పఠిత మనసుకిచ్చి:పరవశించు!

కలముకున్న తెలివి:కత్తికెన్నడురాదు
కూరగాయలన్ని:కూర్చుకోసి
కత్తివలన కొద్ది:కనికర మేనుగా
పాళితోని రచన:పరిమళించు!

కలము చేతనున్న:కడుమేలుజేయును
కత్తి చెంతనున్న:కఠిన మేను
పెన్ను ప్రజల కెపుడు:పెన్నిధి చేతనౌ
కత్తితోడనుండు:కడుభయంబు !

–డా॥గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

గండు పిల్లి

అటక మీద
గండు పిల్లి
ఒకటి ఉన్నది

పొయ్యి మీద
పాలు బాగా
మరుగుతున్నది

పిల్లి ఏమో
తొంగి తొంగి
చూస్తున్నది

పాలు క్రింద
పొంగి పొంగి
పొర్లుతున్నది

క్రింద పడ్డ
పాలు చూసి
నోరూరుతున్నది

నేల మీద
పాలు తనకి
ఎంగిలన్నది

గిన్నెలో వేడి
పాలు తాగి
బావురన్నది

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

మా బ్రతుకమ్మ...

గునుగు, తంగేడు
బంతి పువ్వుల అందాలు
పేదోడి నైవేద్యాలు
ప్రకృతి ఆరాధనలు
బరువైన బ్రతుకులలో
ఆటై , పాటై
గడిల పోరాట బాటై
తెలంగాణ పల్లె సంస్కృతి
పూల సువాసనలతో
బ్రతుకును సల్లంగా చూసే
మా బ్రతుకమ్మ.....
ప్రకృతిలో మిళితమైన సంస్కృతి
చెరువులతో పెనవేసిన సోపతి
పచ్చదనం
బంగారు వర్ణం
సబ్బండ వర్ణాలు
కలగలిసి ఆడే ఆటై
మా బ్రతుకమ్మ ....
పోరాటమైన
బ్రతుకు ఆరాటమైన
ఎదిరించి నిలిచే ధైర్యమే
మా బ్రతుకమ్మ....
అలసటతో అలిసిన
చెమటతో తడిసిన
పాటతో మరిచి
బ్రతుకు కష్టాన్ని
చెప్పుతూ మరిచే
బ్రతుకు ఆట
మా బ్రతుకమ్మ...

–శ్రీపాల్
8978894808

నానీలు

చెట్లకు
సంభాషణలుంటాయి
కాకపోతే
శబ్దాలే ఎక్కువ

రాతిని
నిర్జీవంగా చూడకు
మనసుతో చూస్తే
అది సజీవ శిల్పం.

సేదతీరుస్తుంది
అలసినప్పుడల్లా
బాల్కనిలో
పిల్లతెమ్మెర

మట్టి రేణువులతో
బాల్యమంతా
సుగంధ పరిమళాలే
తనువంతా

కలవలేని
భగ్న హృదయాలు
ఎడబాటుతో
రైలు పట్టాలు

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

పుస్తక సమీక్ష

ఆత్మాశ్రయ కవిత్వంతో రూపుదిద్దుకున్న మరీచిక...!

రచయిత్రిగా, కవయిత్రిగా, కథకురాలిగా సాహితీలోకానికి తమ రచనల ద్వారా ఇదివరకే పరిచయమైన శ్రీమతి ఎస్వీ. కృష్ణ జయంతి 'మరీచిక' పేరుతో ఓ కవితా సంపుటిని వెలువరించారు. 2012లో "50 వసంతాల తెలుగు కవిత" అనే సాహిత్య విమర్శ గ్రంథాన్ని వెలువరించి.. తెలుగు కవిత వస్తువు-రూపం- శిల్పం వంటి అంశాలను సోదాహరణంగా విశ్లేషించిన అనుభవం ఆమెకుంది. 2008లో 'దృష్టి' కథా సంపుటిని ప్రకటించి.. అందలి దృష్టినాకర్షించారు. వాస్తవ ఘటనల ఆధారంగా 2002లో 'అభిమాని' పేరుతో ఓ నవలను వెలువరించి నవలా రచయిత్రిగానూ సాహితీ రంగమందు తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు. ఆమె కలం నుండి జాలువారిన అనేక కథలు.. వివిధ సంస్థల నుండి ఆమెకు పురస్కారాలను అందించాయి.

అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు పురోగమిస్తున్న ప్రస్తుత నేపథ్యంలో.. పురుషుడితో భిన్నంగా ఆలోచించే స్త్రీ హృదయాంతర్గత భావావిష్కరణకు ఆస్కారం కల్పించే 'ఆత్మాశ్రయ కవిత్వం' వెలువడాల్సిన అవసరం ఎంతైనా ఉందని బలంగా ఆకాంక్షించే ఆమె.. తమ సృజనాత్మక ప్రతిభను జోడించి ఆత్మాశ్రయ కవిత్వానికి పెద్దపీటవేస్తూ.. "మరీచిక" గ్రంథంలోని కవితలను తీర్చిదిద్దారు.

'నీ అభినందనలు-ప్రశంసలు
నాకు అందకపోతేనేం..
బాధ్యతల భారం మోయడంలోనే
నిమగ్నమైనాను" అంటూ సవినయంగా ప్రకటిస్తూ ఈ పుస్తకంలోని 'ప్రేమకు సాక్ష్యం'' కవితను తీర్చిదిద్దారు.

"నాణేనికిరువైపులా ఒక్కటే బొమ్మ
బొరుసు జాడేలేదు
దానికోసం మరీచికలా.. మర్మ గర్భిణిలా
పూర్ణత్వం సంతరించుకోని పిండాన్ని
మోయడమే కర్తవ్యం..
ఆశ-ఆవేదన-ఆర్తత-ఆక్రోశాలనే
భారాలు మోసే నిండు చూలాలినే.." అంటూ "మర్మ గర్భిణి" కవితలో కవయిత్రి కృష్ణజయంతిగారు ప్రకటించిన భావాలు ఆలోచనాత్మకంగా కొలువుదీరాయి.

"ఆలంబన" కవితలో
సహనం మాత్రలు మింగీ మింగీ
అలసిపోయాను- సొలసి పోయాను
కొనవూపిరితో కొట్టుమిట్టాడే నాకు
నా పిల్లల ఉనికి అనే ఇంజక్షన్ని
డ్రగ్‌లా నాకు నేనే గుచ్చుకుంటూ
ఇచ్చుకుంటూ" అని కొనసాగించిన పంక్తులు అందరినీ కదిలిస్తాయి.

"ఉంగరం' శీర్షికతో రాసిన కవితలో
జీవితపు వ్రేలికి
మమతల మాధుర్యమనే ఉంగరం తొడిగాను..!
ఏడడుగుల ఏడుపంతా దద్దరిల్లింది..
ఎనిమిదో అడుగు నుంచి.. తుది దినం
మొదలైందని వాపోయారు.. 'పునర్నిర్మాణం" కవితలో
నరనరాల్లో అణువణువులో
నాలోనేనే
కర్కశంగా.. దయనీయంగా
ధ్వంసమైపోతుంటే
అనుబంధాలు.. ఆప్యాయతలు
నిజమో..అబద్ధమో.. ఉన్నాయో.. లేదో
వస్తాయో.. రావో.. ఎలా అనుకోగలను? అని ప్రశ్నించుకున్నారు.

నాపై నేనే జాలిపడుతూ..నాలో నేనే విలపిస్తూ.. నాలో భద్రపరుచుకున్న నైతిక విలువలే.. నా ఆకలి తీరుస్తున్నాయంటూ.. విషాదాల సిందూరం" కవితను రాశారు.

"విషమ వలయం" పేరుతో రాసిన కవితలో.. జీవితమనే పుస్తకంలో.. శుభానికీ.. సుఖానికీ అధ్యాయాలే లేవనీ.. అన్నీ అవహేళనలే.. అంతా అవమానమే" అంటూ ఆవేదనను వ్యక్తపరిచారు.

"ఘోష" కవితలో.. "ఈ జీవితం నాది కాదు.. ప్రతీక్షణం విస్ఫోటనం.. అనురాగపు దారుల్ని వెతుక్కుంటూ వసంత మేఘం పరుగులు తీస్తుందనీ.. అంటూ 'పయనం' కవిత ద్వారా హితవు పలికారు.

'పీడకల' కవితలో..



మేధస్సులో మెరుపులు ఉరుముతాయి.. వ్యక్తిత్వ రూపంలో బదులివ్వమంటూ''. రాసిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి.

'ధహనధూపం' కవితలోనూ కవయిత్రి కృష్ణజయంతిగారు ఆత్మాశ్రయానికీ చోటు కల్పించారు.

"నీ భావంలో నేనో ఎండుటాకుని..
నీ ఆశయంలో నేనొక ఇసుక రేణువుని" అంటూ కవితను ప్రారంభించారు. "నీ సుదూర ప్రయాణంలో నేనొక పరిచిత ఒంటరి"నని అని కొనసాగించారు. నీ ప్రతీ శ్వాసలో బీభత్సపు వ్యర్థాన్నీ.. నీ జీవితంలోనే నేనొక దహన ధూపాన్ని అంటూ ముగించారు. ఆత్మాశ్రయునికే ప్రాధాన్యనిస్తూ కవితను రాసిన తీరు బాగుంది.

"ఈ విశ్వంలో వేకువకీ.. నిశీధికీ ఓ సమయ పాలన ఉంది. నేననుకునే నా జీవన పరిధిలో ఆ రెండింటికీ నిర్దిష్టమైన వేళాపాలా లేదు'' అంటూ 'నేనొక గడియారాన్ని'! కవితను రాశారు.

"కడలి కెరటం" కవిత ఆద్యంతం కవితాత్మకంగా మలచబడింది. ఎన్నో వేల క్షణాల జఢత్వంతో జీవితమంతా ఒంటరితనపు అనుభవాల సుదీర్ఘ ప్రయాణమే అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి.

ఇంకా ఈ కవితలో సగటు మహిళ అన్నీ ఉన్నా.. వివక్షతో పడే వేదనను అక్షరాల్లో బంధించారు.

నిరాశ ముసుగు నీ మనసు దరి చేరనీయకు.. నింగీ నేలకీ మధ్య శూన్యాన్ని నీ దిగులు బరువుతో నింపకు 'కలకాని కల.. కన్నీటి మడుగులో సుడిలాంటి కల!.. ఆ కలే నా జీవితం.. నిక్షిప్తంగా నా జీవితమే ఓ పీడకల" అంటూ ముగింపు వాక్యాలు పలికారు. 'నువ్వెవరు?" "చివరి సంతకం" "పరీక్ష" "గ్రహపాటు'', 'నకిలీ నవ్వు', 'విషవృక్షం', 'వృధాజన్మలు', 'పగటి చీకటి', 'పరారీ' తదితర కవితల్లో కవయిత్రి యొక్క కవితా పటిమను ప్రదర్శిం చారు. ఆలోచనాత్మకంగా.. సందేశాత్మ కంగా కవితల్ని మల చడంలో సఫలీకృతులైనారు.

"ఒంటరి ఉల్కని" కవితలోనూ.. ప్రారంభ పంక్తుల్లోనే.. తమ బలమైన భావాలకు చోటు కల్పించారు. "జీవితపు విలువని.. ఒక హామీ పత్రంపై రాసి.. వేరొక్కరి కిచ్చిన దౌర్భాగ్య దశ'' అంటూ వాపోయారు.

ఒక స్త్రీ యొక్క బాధలను.. వివక్షను గురయ్యే పరిస్థితులను.. ''మరీచిక'' కవితలో పొందుపరిచారు. క్షణాల మీద క్షణాలు జీవిత కాలాన్ని ప్రశ్నిస్తున్నాయనీ నా హృదయ ద్వారం ముంగిట పసుపు గడప కోసం ఆరాటపడుతున్నాయని మరో జన్మంటూ ఉంటే.. నువ్వు రావాలనీ.. పాప ప్రక్షాలన చేయాలని ఆకాంక్షించారు. ఇలా ఎన్నో కవితలు ఉదహరించడానికి యోగ్యంగా ఈ గ్రంథంలో ఉన్నాయి. ఆత్మాశ్రయానికి పెద్దపీట వేస్తూ.. మహిళల్లో స్వాభిమానాన్ని నింపేందుకు కవయిత్రి చేసిన ప్రయత్నాన్ని అభినందిద్దాం.

ప్రతులకు:
ఎస్.వి. కృష్ణజయంతి
19-90-పి & టి కాలనీ
దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్- 500 060.
సెల్: 92473 02882

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

పుస్తక సమీక్ష

ఆద్యంతం మానవతావాదం...!

**"తడిలేని అక్షరమైనా పాటైనా
మాటైనా..
ఏనాడు మనలేవు..
తడితనం సోకినప్పుడే
నవ్వైనా..పువ్వైనా..
చెట్టైనా.. పుట్టైనా
పక్షైనా.. పచ్చదనమైనా"** అంటూ కవి డా॥సి.హెచ్.ఆంజనేయులు తమ "దిగివచ్చిన గగనం" కవిత సంపుటిలో.. తడి యొక్క ప్రాశస్త్యాన్ని వడి వడి భావాలతో మనకు తెలియజెప్పారు.

తడి అంటే నాకిష్టం..
గుండె కింద తడి లేకపోతే ఏవీ మనల్ని
హత్తుకోలేవు ఆకర్షించలేవని భావించే కవి ఆంజనేయులుగారు. విభిన్నమైన కవితా వస్తువులపై తమ కవితా ధారను అక్షరాల్లో బంధించి మనకు ఈ గ్రంథం ద్వారా అందిస్తున్నారు. 81 కవితలతో కొలువుదీరిన ఈ పుస్తకంలోని కవితలు కవి యొక్క సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించేలా ఉన్నాయి.

సామాజిక చైతన్యం కోసం. కవి యొక్క ఆరాటం.. ఇందలి కవితల్లో అడుగడుగునా కానవస్తుంది.

**నిత్యశమయే సర్వశమైక ధారులై
తరతరాల రెక్కల కష్టమే ఆస్తిగా
నవ సృష్టినమ్ముకొని నిర్మాతలై సాగే
అనామానధీరులు ఈ వలస
కూలీలు"** అంటూ 'నిశ్చల తరంగం' కవితను తీర్చి దిద్దారు.

వివిధ రకాలైన 'బందీ'లను ఏకరువు పెడుతూ. తమ భావాలను కవి "బందీలు" కవితలో అందంగా బంధించారు.

కొందర వలపు కౌగిలిలో బందీలు
కొందరు ఆకలి బ్రతుకు కౌగిలిలో బందీలు
ఎవరు ఏ కౌగిలిలో బందీలైనా
చివరకు మృత్యు కౌగిలిలో బందీ కావలసిందేనని తేల్చి చెప్పారు.

మనస్సు నదిలో ప్రతిక్షణం
నవోత్సవ వెలుగులు వర్షమై
కురియాలని కాంక్షిస్తూ..
'మనస్సునది' కవితను రాశారు.

'సహజాలు' కవితలో జీవన సత్యాలను ఆవిష్కరించారు. జీవితంలోని చీకటి వెలుగులను తాత్త్వికంగా ప్రకటించారు.

'గగనం అంచులదాకా' కవిత ద్వారా ఆశావహ దృక్పథాన్ని నూరి పోశారు. గాయాలు.. విషాద సారంగీ రాగాలు.. ఆనందాలు బ్రతుకు వెన్నెల పూల పరిమళాలు అంటూ కవితను ప్రారంభించిన తీరు బాగుంది. లోక ప్రేమికుడివై ముందు చూపుతో.. సర్వానుభవాలను జీర్ణించుకొని.. విశ్వంలో ఎగిరే పక్షిలా.. గగనం అంచులదాకా సాగిపొమ్మని హితవు పలికారు.

'కాలం మంచులా" కవితలో..
**కాలం మంచులా కరిగిపోతూనే ఉంది
జీవితం మీద నిరాశయందు దుప్పటి
పర్చుకొంటూనే వుంది..
ఆశలు మల్లెతీగలై పెనవేసుకుని
సాగాలనుకుంటూనే ఉన్నాయి..**

**ఆకాశమంత ఊహల్లో
భావాల అందమైన శిల్పాలే కాదు..
దుఃఖాశ్రువుల రాస్తున్న
ఒక మాతృమూర్తి కన్నీళ్లు తుడవడానికి** అంటూ కొనసాగించిన పంక్తులు.. కవితలో చక్కగా ఒదిగిపోయాయి. జీవితంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ.. ఆశల జెండా ఎగరేస్తూ ముందుకు సాగడమే ధ్యేయంగా మలచుకోవాలని సూచించారు.

జీవన్మరణ ఆరాటాల్లోంచి
బ్రతుకు పోరాటాల నేపథ్యంలో
ఆత్మల అంతర్గత ఘోష
అందీ అందని ఫలాలు సర్వదా వుండనే వుంటాయి

అయినా ఆగదు మనుషులంతా సాగిపోయే ప్రగతిమార్గం దిశకై.. అంటూ ఓ కవితను కవి ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారు.

'బతుకెప్పుడూ మార్గదర్శి' కవితలో బ్రతుకును తొలిపొద్దు సూర్యునిలా ఆవిష్కరింపచేయాలని ఆకాంక్షించారు.

**బ్రతుకెప్పుడు గలగల చప్పుళ్ళను
వినిపించే సెలయేరు
బ్రతుకును దుఃఖాసలంలోంచి కురుట
పడ్డ మమతలవనం చేయాలని కోరారు.
బ్రతుకు మురికి కాలువకాదు.
స్వచ్ఛంగా పారే మానవతానది"** అని తేల్చి చెప్పారు.

'నిశ్శబ్దం నుంచి శబ్దంలోకి" కవితలో మనుషులంతా శబ్ద ప్రపంచంలో కదలాడే జీవులు కదా" అంటూ కొనసాగించిన పంక్తులు బాగున్నాయి.

"పల్లెవలస" కవితలో
నిన్నటి వరకు మమకార తీగలతో
మనుషులను చుట్టూ అల్లుకొన్న పల్లె నేడేమో నగరం ఎడారి ఆత్మల మధ్య ఏకాకిగా మారిందని వాపోయారు. నగరానికొచ్చి మంచి మనిషి గుండె పోగొట్టుకోకు అని సూచించారు. "విశ్వాసపు తెలివి"

'చింతనా శీలమే' కవితను
నీరస నిరాఘాట సన్నివేశ కల్పనలో
మనిషి మస్తిష్కం ఆలోచనల బుద్ధి
నిత్య చింతనాశీలమే దాని గమనం" అంటూ ముగించారు.

"అవకాశవాదం" కవితలో
అవకాశవాదం మానవీయ విలువలకు తిలోదకాలిస్తుందని మానవతా-వెలుగు చక్రం, చీకటి భూమితో నేస్తంకట్టి. .వెలుగు సర్వస్వాన్ని మింగి మాయం చేస్తుందని వాపోయారు.

మారుతున్న మనిషి నైజంను 'పర్యావసానం' కవితలో ఆవిష్కరించారు.

'చరిత్ర కథనచిత్రం' కవితలో జీవితమిప్పుడు కోటి ఆశల వసంతరాగం.. మనిషి అంతరంగం నిరంతర ప్రగతి తపనం అని తెలియజెప్పారు.

'కాలయానం' కవితలో.. శరీరం శిథిల మానవుదారుల వైపు సాగినా.. లావణ్యపు అగరువత్తులు కాలి కాలి బూడిద రాసిగా మారే క్షణాల రెక్కల్ని తొడిగినా.. మానవతా సుగంధాల సౌధాలను నిర్మిస్తూ వెళ్లాలని సూచించారు.

"మిగిలేవి విచారాల సారాంశాలు" కవితలో మనిషిలోంచి మంచితనపు పుష్పం రాలి వాడిపోయిందని 'డబ్బు' మాయలో పడి మనిషి ఏకాంత కారాగారంలోకి వెళ్ళిపోయాడని కవి తమ వేదనను ప్రకటించారు. 'మనిషే దేవుడవుతాడని" కవితలో నలుగురికి మంచి చేయాలని సూచించారు. 'తిరిగి మళ్లీ రావు' కవితలో.. మనిషికి మనిషి తోడుగా వున్నప్పుడే విషాద ఘట్టాలు తొలగి పోతాయని విడమరిచి వివరించారు.

"తనతనం" కవితలో మానవీయ విలువలపు కాపాడుదామని పిలుపునిచ్చారు.

నేటి అత్యాధునిక విజ్ఞాన ప్రగతిలోకమంతా.. మనిషితనం లేని దౌర్జన్యానికి తలవంచుకుంటోందని "జవాబుదారులెవరు?" కవితలో వాపోయారు.

బండబారిన గుండెలో అమృతాన్ని నింపుమంటూ "అనుభవాంశ" కవితను తీర్చిదిద్దారు.

ఇలా ఈ గ్రంథంలోని చాలా కవితల్లో మనిషికి పెద్దపీట వేశారు. మనసున్న మనిషిగా ఎదగాలని నొక్కి చెప్పారు. మానవతావాదానికి పట్టంకట్టారు. చాలా కవితల్లో కవిత్వాంశ కొరవడినప్పటికీ.. కవి యొక్క మానవీయ దృక్పథాన్ని అభినందించితీరుతాం.

మానవతా వాదమే ఆలంబనగా రాసిన ఇందలి కవితలు చక్కని సందేశాల

కదిలించే కవనం!

శబ్దమొచ్చి
అనురాగంతో కరచాలనం చేసిందా
పతంగిని చేసి గాలిలో విసిరేస్తా!

నిశ్శబ్దమే వచ్చి
భుజంమ్మీద వాలిందా
మాటలు నేర్పి వేకువ గీతం పాడిస్తా!

నవ్వొచ్చి
లలిత సమీరమై నన్నల్లుకుందా
నాలుగు పూలను చేసి విసిరేస్తా!

మిత్రులొచ్చి
సాయంత్రాలను వెలిగిస్తారా
వారికో వసంతాన్ని బహుమతిగా ఇస్తా!

శత్రుఒక్కడు
అకస్మాత్తుగా పెను సవాలు విసిరాడా
చిరునవ్వును వెదజల్లి అతని అహం చెరిపేస్తా!

రాజ్యం కుట్రలతో
నూకలు జల్లి వల విసిరిందా
తోటి కలాలను ఏకం చేసి వల నెత్తుక పోతా!

నినాదాలెన్ని
కవ్విస్తూ కుతంత్రాలెన్ని పన్నినా
'కోట్లా' కదిలించే కవనం ఆపేస్తావా?!

-కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

వ్యాక్సిన్

ఇన్ని రోజులూ
ఇరుకైన గదుల్లో
బెరుకైన హృదయాలతో
ఊపిరి ఆడని పరిస్థితులలో
ఆశకు ఊపిరి పోసుకుంటూ
ఎంత ప్రయాస పడ్డాం మనం
కనబడని శత్రువుతో
అలవాటులేని యుద్ధాన్ని చేస్తూ వచ్చాం మనం
మన బలాలన్ని బలహీనతలై
మనపైనే తిరగబడిన వేళ
మనం అల్లుకున్న బంధాలే కబంధ హస్తాలై
మనల్ని భయపెడుతున్న వేళ
ఒంటరిగా ఉంటూనే
ఎన్ని సమూహాలని సృష్టించుకున్నాం మనం
మన బలహీనతలకు విశ్వాసపు టానిక్ పోసి
శిఖరంలా ఎంత దృఢంగా
నిలబడగలిగాం మనం
పగిలిపోయిన స్వప్నశకలాలను అతికించి
ఎంత చక్కటి భవిష్యత్తుని
ఊహించుకున్నాం మనం
ఆకలి జంతువు నిర్దాక్షిణ్యంగా
గుండెని గాయపరుస్తుంటే
బాధను మాస్కు వెనకాల మూసుకొని
ఎంత గర్వంగా నవ్వగలిగాం మనం
ఒక్కపూట కడుపునిండా తినకపోయినా
ఆరు పూటలా చెయ్యి కడుక్కుంటూ,
ఒకరినొకరం తాకే వీలులేకున్నా
కళ్ళతోనే వెన్నుతట్టి భరోసానిచ్చుకుంటూ,
ఎంత నిబ్బరంగా నిలబడగలిగాం మనం
కమ్ముకున్న ఈ కరోనా చీకటి పొరని
మన పంతపు నిప్పురవ్వతో
ఎలా కాల్చి పారెయ్యగలిగాం మనం
సమస్యకు ఎప్పుడూ సహనమంటే భయం
సహనానికి సమస్య సలాం చేస్తుంది
తలవంచి దానిముందు గులాం అవుతుంది
అందుకే తప్పు తెలుసుకొని
ఓటమి ఒప్పుకొని
అడ్డు తప్పుకొని మనకు దారినిచ్చింది
మన ఓపికకు ఫలితంగానే
వ్యాక్సిన్ ఆయుధం వచ్చింది
మన రేపటి ఆశల నావకు
కొత్త దిక్సూచిని తెచ్చింది.

-డి.క్రాంతి కుమార్
7396721108

తలపులో ఎదురుచూపు

అవ్యక్తంలోని మౌనం
అవధూత ధ్యానంలా
నింగినిండా పరచుకొంది.
రకరకాల వన్నెల జవరాళ్ళు దానిపై
నగ్నంగా పొర్లాడి పొర్లాడి
కశ్మీరీ తివాచీని చేశాయి.

వలస వెళ్ళే పరిమళాలు
వెళుతూ వెళుతూ గమ్మత్తుగా

దిక్కులకు చక్కలిగింతలు పెట్టాయి.
ఓ మూలన అంతా చూస్తున్న తోటమాలి
ఆహ్లాదంలో ఇంటినే మరిచాడు
పాపం-అతడి ఇల్లాలు మాత్రం
ఇంకా ఎదురు చూస్తూనే వుంది.

త్రిసంధ్యల గుమ్మం దగ్గరే
గంపెడాశతో.. నిరీక్షిస్తూంది.

- ఉమ్మడిశింగు రాఘవరావు
సెల్: 9247108893

అనురాగ వనమే... చీకటి

చిక్కటి చీకటిని
ఎప్పటికీ శత్రువుగానే
చూస్తానంటావెందుకు?
విశ్రాంతినివ్వడానికి పిలిచిన
స్వాగత సౌదం అనుకోవొచ్చుగా!.
దినం తనువులో సగభాగమై
నిత్యం నీకు సహకరించే నిశి కృషిని
నిందిస్తావెందుకు?
జనం మేలుకోరి వచ్చిన
అనురాగవనం అనుకోవొచ్చుగా!.
రాకాసిలా వెలుగును మింగేసిందని
పదే పదే మాటలతో
రాచి రంపాన పెడతావెందుకు?
పగటి దీపమైన
సూర్యునికే సెలవిచ్చి
విధుల్లో చేరిన విశాల హృదయం
అనుకోవొచ్చుగా!.
చోరకళా ప్రదర్శనలు
చోటుచేసుకున్న కాలం
అనుకుంటావెందుకు?
జగదానందదాయకమైన
జానపద కళారూపాల ప్రదర్శనకు కూడా
అనుకూలమైన సమయం అదే
అనుకోవొచ్చుగా!.
చీకటంటే....
భయం కుత్తుకలో పూసి
ఒళ్ళంతా వణుకుపుట్టించే
పిశాచికి ప్రతిరూపం కాదు
అది
గగన తార అందాల ప్రదర్శనకు
అవకాశం కల్పించిన
ఆధునిక రంగస్థలం.
చీకటంటే....
పగటి దేహం మీద పరుచుకున్న
నల్లని పాన్పు కాదు
చెమట చుక్కను
తన ఒడిలో సేదదీరుమని కోరిన
సేవాహృదయం .
చీకటంటే...
పగటి రెక్కలకు పట్టుకున్న
అలసట దుమ్మును దులిపేది
కాలుష్యాన్ని కాస్త తగ్గించి
కావలిసినంత విశ్రాంతినిచ్చి
నరుని ఆయుష్షును
నాలుగు కాలాలు పెంచేది.

-కమలేశ్
9160396596

నానోలు

బడి
మూత
చదువు
ఆగం.

అమ్మ
తరువు
నాన్న
గొడుగు

వర్షం
జోరు
జీవనం
ఆగం.

వర్షం
గుంతలు
రహదారి
ప్రమాదం.

చీకటి
చట్టాలు
రైతు
గోస

తపస్సు
జపం
యోగ
నిష్ఠ.

ఫోన్
వ్యసనం
జీవితం
సంకటం.

శిల
విద్యార్థి
శిల్పి
గురువు

యుద్ధం
రక్తపాతం
సంధి
శాంతి.

-చాపల మహేందర్
9949864152

క్షుద్రశక్తి

అస్త్రాలు ఆయుధాలు
శస్త్రాలు శాస్త్రాలు
అర్థశాస్త్రం అణుశాస్త్రం
దేనికి లొంగనిది ఒంగనిది
కంటికి కనబడనిది
ఒంటిని విడబోనిది
ఐకమత్యాన్ని భిన్నపరచేది
అంటరానితనాన్ని అలవర్చేది
ప్రపంచీకరణ విచ్ఛిన్నం
నవీన జీవితాన్ని
కనిపించని జీవిగా
ప్రపంచాన్ని కలవరపెట్టే
క్షుద్ర శక్తి కరోనా
భయభ్రాంతులతో
విశ్వాన్నే ఏలుచున్న నియంత
కోవిడ్.

- సోమయాజుల సుబ్రహ్మణ్యశర్మ
సెల్:93466 71524

"విలక్షణ, వినూత్న కథనం"



సుమారు 5000 ఏండ్ల సనాతన సమాజ గమనించిన రచయిత గొర్తి వెంకట సోమనాథశాస్త్రిగారు చలించిపోయారు. పాశ్చాత్య సంస్కృతిలోని అవకతవకలు, మనలో తలెత్తుతోన్న మానసిక వికారాలు, దురాచారాలు గమనించి తనదైన 'సంస్కరణ' పద్ధతిలో మనకు చెప్పాలన్న ప్రయత్నమే ఈ 'జవరాలి కథలు'. ఇందులోని 24 రచనల్ని కథలనలేము. వ్యాసాలు అని కూడా అనలేము. మధ్యతరగతి మానవుడు ఎదుర్కునే సమస్యలకు తన నైపుణ్యంతో వ్యాసాల్లాంటి కథల రూపం కల్పించారు. కథకుడు అతని భార్య (జ)వరాలు-ముఖ్యపాత్రలుగా ఆనాటి భానుమతి రామకృష్ణగారి "అత్తగారి కథలను' గుర్తుకు తెచ్చారు.

ప్రథమ పురుషలో సాగే ఈ కథలన్నింటా కథా నాయకి 'వరాలు'. ఆమె సామాన్య స్త్రీ. పెద్దగా చదువుకున్నది కాదు. పల్లెటూరి నుండి పట్నం వచ్చిన పడుచు. అయినా ఆమె విచక్షణ. వివేకం, సనాతన ధర్మం, ఎడగల గౌరవం, సమయస్ఫూర్తి పాఠకుడిని ముగ్ధులను చేస్తుంది.

ఈ కథలను చదివాక పాఠకుడు ఒరిస్సాలోని 'సావిత్రి వ్రతం' (పే.121) గురించి తెలుసుకుంటాడు. నేడు కనిపించేవి ఉమ్మడి కుటుంబాలు కావు గుమ్మడి కుటుంబాలని తెలుసుకుంటాడు. (పే.174). దూదేకుల సాయేబుల కట్టుకథలకు 'పడి పోవద్దని' తెలుసుకుంటాడు (పే.189). ఆడవాళ్ళకు గుళ్ళూ, పూజలు వ్రతాలుపై, గల శ్రద్ధను తెలుసుకుంటాడు (పే.170). ప్రముఖ దేవాలయాలన్నీ కొండల మీద ఎందుకు కడతారో తెలుస్తుంది (పే.165). ఆడపిల్లయినా, అవసరాలని బట్టి ఉద్యోగం చేయాలనే నవీనత, ఇంటికి వచ్చిన ఆడపిల్లను ఉత్త చేతులతో పంపటం మన సాంప్రదాయం కాదు (పే.181) అన్న తెలివిడి కలుగుతుంది.

'Boy meets girl, they fell in love" అన్న మూస కథలు కావివి. ప్రముఖ కథా రచయిత శ్రీ వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు కథకు ఇచ్చిన నిర్వచనానికి సరిగ్గా సరిపోయే కథలివి. "అచ్చంగా తెలుగు" అంతర్జాల పత్రిక వ్యవస్థాపకురాలు భావరాజు పద్మిని గారన్నట్లు "సద్విమర్శ, సత్ సందేశం ఇచ్చే 'కథలు' ఇవి.

ప్రతులకు: గొర్తి వెంకట సోమనాథశాస్త్రి
సెల్: 9440495895 మరియు
acchamgatelugu@gmail.com
cell: 8558899478

- కూర చిదంబరం
సెల్: 8639338675

నానీలు

అంతర్జాలమే
వేదికైంది నేడు
కొత్త స్నేహాలను
కలుపుతూ.

అంతర్జాలమో
విజ్ఞాన ఖని
సద్వినియోగం
చేసుకో దానిని.

బద్ధకాన్ని పెంచుతోంది
అంతర్జాలం ..
కోరినవన్నీ
ముంగిట్లో నిలుపుతూ.

అంతర్జాలంలో
అర్థం కాని చదువులు..
అయోమయంలో
విద్యార్థులు..

ధన్యవాదాలు
అంతర్జాలానికి..
చిన్ననాటి మిత్రులను
కలిపింది మళ్లీ..

-గీతారాణి అవధానుల
9491475210

నన్ ఆఫ్ ది ఎబో

నేను ఎన్నికల గుర్తు నోటాను
బ్యాలెట్ లో చిట్ట చివరి మీటాను.
నేను ఏ పార్టీ అభ్యర్థిని కాను
ఎవరూ నచ్చలేదో ఉన్నాను నేను.
అందరిలా ఓట్లను నోట్లతో కొనలేను
మద్యంతో మనుషులను మార్చలేను.
మతాన్ని ప్రచారానికి వాడలేను
కులాన్ని నిలువుగా చీల్చలేను.
హామీలతో హంగామా చేయలేను
అబద్ధాల వాగ్దానాలు పలుకలేను.
నేను ఎన్నికల గుర్తు నోటాను
బ్యాలెట్ లో చిట్ట చివరి మీటాను.
నేను ఏ పార్టీ అభ్యర్థిని కాను
ఎవరూ నచ్చకుంటే ఉన్నాను నేను.
రోడ్ షోలతో ప్రచారాలు చేయలేను
అలవికాని హామీలు ఇవ్వలేను.
నిధులను దిగమింగే నోరులేదు
భూములను కాజేసే దమ్ము లేదు.
ధనాన్ని పోగేసే గుణం లేదు
ఋణాన్ని ఎగవేసే గణం లేదు.
రంగుల హంగుల జెండా లేదు
జెండాలను మోసే దండు లేదు.
అవినీతి పరుల అండలేదు
అక్రమ ఆస్తుల హుండీ లేదు.
నిరసన తెలిపే బాటాని
తప్పుడు నేతకు తాటాని.

-ముత్యాల రఘుపతి
9014767045

నీకో దండం

ఓ పానమా
సురాపానమా
మా దీపం ఆర్పకుమా
మా బతుకును నలపకుమా.
ఆ పగలు ఎప్పుడు చీకటి దుప్పటి
కప్పుకుంటుందా అని అదునుచూసి
శ్రమగొంతుకలో విషమౌతావు.
కష్ట కాయపు కరెన్సీని చిత్తుచేసి
బానిసత్వపు మత్తును ఎక్కించి
ముసుగేసిన దీపానికి వత్తువౌతావు.
కనికరం లేని కళ్ళల్లో
మమకారం మాయమై
కాఠిన్యపు మృగత్వాన్ని కసిదీరా నింపుతావ్.
నిషారాజ్యానికి విచక్షణ లేని పశురాజుని చేసి
వావివరుసలను మంటగలిపి
విలువల వలువలను పెరికిస్తావ్.

బంధాల బలం తరుగుతున్న
అనుబంధాలలో జీవన
సంబంధపు గొలుసును

కొట్టి కొట్టి పగలగొడతావ్.

ఆవరించిన మత్తుపొగలలో
నిలువెత్తు నిగ్రహాన్ని నశింపజేసి

శాశ్వత విగ్రహంగ మార్చేస్తావ్.
తల ఎత్తిన పౌరుషాన్ని
తనువునేమో నిలవకుండ
తలదించుక చేయునటుల తరిమితరిమికొడతావ్.

నీకో దండం కాస్త కనికరించు
మన'సారా' విముక్తుల గావించు...

-మీసాల చిన గౌరినాయుడు
9492848564

పుస్తక సమీక్షలు

కరుణ చిప్పిలుతోన్న కథలు



ఈ సంకలనానికి ముందుమాట రాస్తూ, శ్రీమతి రమాదేవి నెల్లుట్లగారు అన్ని కథలు కంచికి చేరవు' అంటారు. అవును కొన్ని కథలు గుండెను చేరి, అక్కడే ఆగిపోతాయి. పదే పదే గుర్తుకు వస్తాయి. గుర్తుకు వచ్చిన ప్రతిసారీ, గుండె నీరవుతుంది. పన్నెండేళ్ళ రేడపంగి కావేరి, కడలి అంత దుఃఖాన్ని కడుపులో దాచుకున్న గంసీ, బతుకు బండి ఆగకూడదని, గాయాలైనా పనికి బయలుదేరే రాంసింగ్ వీళ్ళంతా మనసులో మెదుల్తారు. కల్పిత పాత్రలే అయినా కట్టెదుట సజీవంగా నిలుస్తారు. కలవర పెడుతారు.

లోగడ అమ్మకథలు, రేలపూలు, తండావాసుల కథలు లాంటి కరుణ రసాత్మకమైన కథల్ని రాసి మనల్ని మెప్పించిన సమ్మెట ఉమాదేవి కలం నుంచి జాలువారిన గిరిపుత్రుల/ పుత్రికల కథలు. గ్రామీణ ప్రాంతపు తండాల్లోని ప్రజల జీవితగాథలు. అతి దగ్గరి నుండి పరిశీలిస్తూ, వారి కష్టసుఖాల్లో మమేకమౌతూ రాసిన కథలు. అందుకే ఇవి అతి సహజంగా ఉంటాయి. లోతైన వస్తు విషయ పరిశీలనతో అతిసహజంగా కనిపించే సన్నివేశాలలో కూడా అసౌకర్యాన్ని వెదికి తీస్తారు రచయిత్రి. 'ఇంటింటికీ మరుగుదొడ్డి'. ఎంత గొప్ప సౌకర్యం (మైసమ్మత్తో..!కథ) అనిపిస్తుంది. కాని వరమ్మకు ఇది అసౌకర్యమయింది. బహిర్భూమికని చెప్పి అదే ఊళ్ళో ఉన్న తల్లిని కలవగలిగేది. కష్టసుఖాలు చెప్పుకోగలిగేది. ఈ సౌకర్యం వచ్చాక వరమ్మ తన తల్లిని కలుసుకోలేకపోతుంది. ఇదీ వరమ్మకు కలగబోయే అసౌకర్యం. మనం ఎవ్వరం ఆలోచించలేనిది రచయిత్రి ఆలోచించగలిగింది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డెక్కక మానగలమా? రైలు ప్రమాదాలు జరుగుతాయని రైలుబండిలో వెళ్ళటం మానలేము. బ్రతుకుబండి సాగాలంటే, పులినోట్లో అయినా, తలదూర్చాల్సిందే. ఇదే సంగతి రాంసింగ్ నోటిగుండా చెప్పిస్తుంది బతుకు బాట కథలో. గణేష్‌తండాలో ఉంటున్న రెడపంగి కావేరిది ఓ చిత్రమైనగాథ. తల్లి మారుమనువు చేసుకుని బోనగిరిల ఉంటది. కొత్త నాన్న అశోక్‌తో ముసలి అమ్మమ్మకు తోడుగా తండాలో కావేరి ఉంటుంది. తాను కష్టపడ్డా అమ్మ కొత్తనాన్న దగ్గర మంచిగుంటే చాలు అనుకునే కావేరి చిన్నిగుండెలో ఎన్ని సంద్రాలో అంటూ అబ్బురపరుస్తుంది రచయిత్రి. పాఠకులు ఊహించను కూడా అలవి కాని సందేశం. తండా వాస్తుల్తో మమేకమై అతి దగ్గరగా పరిశీలిస్తే తప్ప తెలియని అంతర్యం.

స్థాలీపులాక న్యాయంగా పైన చెప్పిన కదల్లాంటివే మిగతా కథలు కరుణరసం చిప్పిల్లే పల్లీయుల వ్యథలు. ప్రకృతిని ప్రేమించే ఈ రచయిత్రి కథల నిండా.. వరిచేల పచ్చదనాలు, తెల్లని కొంగలు, నూలు పొగులు విచ్చులుకట్టి గులాల్ రంగులో ముంచినట్లున్న జమ్మిపూలు, వెదురుగుబుర్లు, పరుగుడు పొదలు. మలబార్‌చెట్లు. అరగదీస్తే తప్ప సుగంధం బయల్పరచని శ్రీ గంధం చెక్కలాంటి మనుషులు. ఆచారాలను అతిక్రమించలేని అమాయకత్వం. బ్రతుకు బరువును మోయలేకున్నా కుంకుండు గింజల్లాంటి కన్నుల్లో చెరిగిపోని అమాయకత్వం, "బతుకుడంటే ఎట్లన్న బతుకచ్చుగానీ, సచ్చిపోవాల్నంటే యెంత ధైర్నముండాలే"? (ఖేల్ షురూ..!) అంటూ చెప్పే నిష్ఠురం. మళ్ళీ మళ్ళీ చదివి తన్మయత్వం. పొందాలనిపించే కథలు.

ప్రతులకు: సోమయాజుల ఉమాదేవి
కే/ఆఫ్. బిడి. క్రిష్ణ, ఇ.నెం. 3-2-353,
2వ అంతస్తు, స్వామి వివేకానంద స్ట్రీట్
ఆర్‌పి. రోడ్, సికింద్రాబాద్-500 003.

- కూర చిదంబరం
సెల్: 8639338675

సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయ చర్చ



సంకలన రచయిత్రి విజయ భండారు 'ఉద్యోగ క్రాంతి' అనే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల పత్రికకు సహ-సంపాదకురాలు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల ప్రస్తావన. వాటి పరిష్కార మార్గాలు సూచించి తద్వారా ఉద్యోగులలో చైతన్యం కలిగించి మెరుగైన సమాజ స్థాపనకు దోహదం చేయటం ఈ పత్రిక ముఖ్యోద్దేశము. ఈ ఆలోచనల్లో భాగంగా రచయిత్రి 2015-2018 మధ్య కాలములో "కచ్చీరు కబుర్లు" అన్న శీర్షికతో ఒక "కాలమ్" నిర్వహించారు. వీటి నుండి 26 కబుర్లను ఏరి ప్రస్తుత సంకలనం "కచ్చీరు ముచ్చట్లు"గా అందిస్తున్నారు. తొలుదొల్త తమ రచనల పరిధి ఉద్యోగుల సమస్యలకే పరిమితం చేసినా, తరువాత్తరువాత, పలు సామాజిక సమస్యలు (పుష్కరాలు, మేడే, అంతర్జాతీయ మహిళా దినోత్సవము, హరితహారం మొ॥) రాజకీయ సమస్యలు (రాష్ట్ర) విభజన, ఉద్యోగుల బదిలీలు, ప్రజల వద్దకు పాలన, తెలంగాణ సాధనకై పోరాటం మొ॥) ఆర్థిక సమస్యలు (నోట్లరద్దు, కేంద్ర వార్షిక బడ్జెటు, నగదు రహిత లావాదేవీలు మొ॥) చర్చించారు. కాలక్రమేణ విస్తృతి పెంచి మత విషయాలను (ముస్లింల తలాఖ్, బతుకమ్మ పండుగ, రోహింగ్యాల వలసబాటలు విశ్వాసాలు మొ॥) ఎత్తుకుని విస్తృతిని 'సిరియా యుద్ధ క్షేత్రం వరకు పెంచారు.

నాటక ఫక్కీలో నడిచే ఈ ముచ్చట్లు, ఒక ఉద్యోగి(ని)గా సమస్యల ప్రస్థావన, సహ ఉద్యోగి(ని)లేదా, పై అధికారిగా, ఆ సమస్యల కూలంకష చర్చ, చివరన రచయిత్రికి సమంజసమనిపించిన పరిష్కార మార్గ సూచన (Conclusion) క్రమంలో సాగుతాయీ కబుర్లు.

"కచ్చీరు" పదం 'కచ్చరి' అనే ఉర్దూ-హిందుస్థానీ పదం నుండి పుట్టినదని, తర్వాతి కాలంలో ఆంగ్లేయులు 'కచేరీ'గా స్థిరపరిస్తే, స్వాతంత్ర్యానంతరం 'కచ్చీరు'గా రూపాంతరం చెందినదట! (ఎన్.వేణుగోపాల్‌గారి ముందు మాట) పాఠకులకు ఆసక్తి కలిగిస్తుంది.

రచయిత్రి ప్రస్తావించిన కొన్ని అంశాలు ఆనాడు (2015-16 మధ్యకాలం) Relevant గా ఉండినవే! ప్రాచుర్యం పొందినవే! అయినా నేటి కాలానికి అంటే నాలుగైదేళ్ళ తర్వాత ఇవి తమ ప్రాసంగికత కోల్పోయి నవిగా అవుపిస్తాయి. ఉదాహరణకు హైదరాబాదు నుండి విభజన తరువాత కొందరు ఉద్యోగుల కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌కు తరలి వెళ్ళటం రచయిత్రి చేసిన సూచనలు సలహాలు నేడు ఇవి కాలం చెల్లిపోయాయి. అలాగే, కేంద్ర ప్రభుత్వ బడ్జెటు 2017లో ఉద్యోగులకు ఒనగూరే లాభ నష్టాలు ఏకరువు పెట్టారు. నేడు ఇవి 'చరిత్ర'గానే మిగిలిపోయాయి.

కాలమ్ రచనలు అనగానే వాటి నిడివి ముందుగానే నిర్దేశించబడుతాయి. కనుక రాసేవారు ఈ డిసిప్లేన్‌కు లోబడి ఉండాలి. విస్తృత చర్చకు అవకాశం ఉండదు. ఇదేకాకుండా, ప్రభుత్వోద్యోగులు, తమ ప్రభుతను గట్టిగా విమర్శించకూడదు. ఇలాంటి Limitations (ప్రతి బంధకాలు)ను దృష్టిలో ఉంచుకుని రాయవల్సి ఉంటుంది.

మొత్తము మీద, పాఠకులకు విసువు పుట్టించకుండా, చెప్పదలచిన విషయాన్ని సూటిగా చెప్పటంవల్ల రచయిత్రి తన లక్ష్యాన్ని సాధించారనిపిస్తుంది.

ప్రతులకు: భండారు విజయ
హెచ్ఐజి, బ్లాక్-1,
ఫ్లాట్ నెం.-10, భాగ్‌లింగంపల్లి
హైదరాబాద్-500 044.
సెల్: 8801910908

- కూర చిదంబరం
సెల్: 8639338675

బంధాలు

మాటల్లో డిజర్వ్ అంటూనే
రిజల్ట్‌లో రిజర్వ్‌లో పెట్టే కాలం...
ఈర్ష అసూయ స్వార్థం
అగ్ని లావాలై పోటెత్తుతున్న ఈ కలియుగంలో
మనసుతనం పొడిబారి
మనిషితనం ఎడారి అయ్యింది.
నవ్వుతూ అమృతం చిందిస్తూనే
నీ అస్తిత్వాన్ని కూకటివేళ్ళతో పెకలించాలని
ఈటెల లాంటి మాటలు విసురుతూ
హాలాహలాన్ని సృష్టిస్తారు
అవకాశం వస్తే మనసారా తాగిస్తారు
మళ్లీ నీవు కోలుకోలేనంతగా
నోటితో నవ్వుతూనే నొసటితో వెక్కిరిస్తూ..
గెలుపు మెట్లు ఎక్కాలిఅన్న నీ తపన మెచ్చుకుంటూనే
నిట్టనిలువునా కూల్చే పథకాలకు
కత్తులు నూరుతూ మరోవైపు సిద్ధమే
అంతటా అవకాశవాదం వేళ్ళూనుకునీ
స్వార్థపు ముసుగేసుకున్న ఆర్థిక బాంధవ్యాలే
కనుచూపుమేరలో
ఇదేనేమో కలిమాయ....

-అరుణ కీర్తి పతాక
9395147443

ఆటవెలది

తల్లి తండ్రి విడుచు తనయులు తనయులు
కారు వారు చూడ కాల యములు
భక్తి తోడ కొలువ ముక్తి నీకు కలుగు
పుండలీకు మాట పూలబాట-

ఇంటి పనులు జేయ ఇల్లాలు కావలె
కట్ట లేము విలువ కాంత పనుల
కష్ట బెట్ట బోకు కలనైన ఆలిని
పుండలీకు మాట పూలబాట-

ఆడ బిడ్డ నంటు అపురూపముగ పెంచు
వారు ఆస్తి లోన వాట నివ్వ
మనసు రాదు నిట్టి మమత నిజమగునే
పుండలీకు మాట పూలబాట-

అన్న దమ్ము లనగ ఆత్మబంధమునుండు
ఆలి వచ్చి నపుడు అంత రించు
లోక మంత తెలసు లోని రహస్యము
పుండలీకు మాట పూలబాట-

ఆడ దంటె అబల అనుకుంటె పొరపాటు
ఆది శక్తి యగును ఆడవాళ్లు
కన్న తల్లి అబల కాదని తెలుసుకో
పుండలీకు మాట పూలబాట.

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

కవిత్వ నిర్మాణం వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది

'కాలస్పర్శ' కవితా సంపుటి ఆవిష్కరణలో అతిథులు.

ఒక కవి రాసే కవిత్వం ఆ కవి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుందని ప్రముఖ సాహితీవేత్త కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో ప్రముఖ కవి పెరుమాళ్ళ ఆనంద్ రాసిన కాల స్పర్శ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ పెరుమాళ్ళ ఆనంద్ కవిత్వం అనే రసవిద్య ను తెలిసినవాడు అన్నారు.

కవిత్వ నిర్మాణం లో వినూత్నమైన ఎత్తుగడ ముగింపు ఆనంద్ కవిత్వంలో కనిపిస్తాయి అన్నారు. డాక్టర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాల స్పర్శ గ్రంథాన్ని ప్రముఖ సాహితీవేత్త వేణు సంకోజు ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇటీవలి కాలంలో నల్లగొండలో ఒక సాహితీ స్పృహను కలిగించడానికి ఆనంద్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

కాల స్పర్శలోని కవిత్వం మానవ సంబంధాలను, సమాజంలోని అపసవ్యాలను చక్కగా చిత్రించింది అన్నారు. వేణు సంకోజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి వరకు పెరుమాళ్ళ ఆనంద్ సాహిత్యం పట్ల శ్రద్ధతో, సీరియస్ గా సృజన చేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా సాహితీ సృజన చేస్తూనే మరోపక్క అనేక గ్రంథాలకు సంపాదకత్వం వహిస్తూ నల్లగొండ సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు అన్నారు.

పుస్తకాన్ని మండల స్వామి సమీక్షించారు. తొలి ప్రతిని సూర్యాపేట కౌన్సిలర్ నామ అరుణాప్రవీణ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సృజన సాహితీ ప్రధాన కార్యదర్శి సాగర్ల సత్తయ్య, ఏభూషి నరసింహ, కస్తూరి ప్రభాకర్, గడ్డం శ్రీను, మేరెడ్డి యాదగిరి రెడ్డి ఉప్పల పద్మ బండారు శంకర్ గంటెకంపు గణేష్, మాదగాని శంకరయ్య, దాసోజు జ్ఞానేశ్వర్, కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి చిలుముల బాల్ రెడ్డి శీలం భద్రయ్య, పగిడిపాటి నరసింహ మర్మోజు రఘురాములు గజ్జెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నానీలు

ఊరి చివర
ఊడల మఱ్ఱి!
సంచారులకదే ఇల్లు
పసిపాపకు ఊయల!

చేని గట్టుపై
రీవిగా నిలబడిన తుమ్మ!
మహాదాత
శిబిలా ఉంది!

ఇంటి ముందు
వేప చెట్టు,
శ్రీమహాలక్ష్మిలా
ఆరోగ్యం పెంచుతోంది!!

శిశిరం
ఆకులు రాల్చేసింది!
చెట్టు ఆశాజీవి
చిగురులతో నవ్వింది!

ఫలాలతో చెట్టు
వంగింది!
ఎదిగినా ఒదిగుండమనే
గురువది!!

-సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

గూడు చెదిరిన గువ్వ !

నేను పుట్టాక
అమ్మ మురిసిందేమో కానీ
నన్ను చూసి
నా నీడే నవ్వుకుంది
నేను నవ్వినప్పుడు
నాన్న గుండె తేలికైంది.

నేను పుట్టాక
అమ్మా నాన్నలు
ఎన్ని కలల్ని
కళ్ళలో నాటుకొన్నారో
నా కళ్ళలోకి చూస్తూ
ఈ జగాన్ని సైతం మర్చిపోయి
సంబరాల్లో ఎంతగా తేలిపోయారో.

మా గుడిసె చిన్నదే
నాన్న మనసే గొప్పది
ఇసుమంత ధనం లేకపోయినా శ్రమని ఇంధనం చేసి
ఇల్లంతా ఆనందపు గంధాన్ని చల్లి
ఇంద్రధనుస్సు ఊయలలో
ఉగ్గుపాల పాటలెన్నో పాదేది మా అమ్మ.
యేటిలో నీటి పాట పాడాక
నాన్న నా బోసి నవ్వుల కోసం
సూర్యుణ్ణి సాగనంపి
మరో చంద్రుడై వచ్చేవాడు
ఆనందం అంతా నాన్న వెంటే వచ్చేది
మా ఇంటిపై కప్పులోంచి చందురుడు
ఈ సంబురాన్ని చూస్తూ
ముచ్చటగా మూతి ముడిచేవాడు.

కాలానికి కన్ను కుట్టిందేమో
సంబరాలన్నీ సమిధలయ్యాయి
అమ్మ ఆకాశ చుక్కై
నాన్న అలసి మేఘాల్లో సూర్యుడై
మరో లోకానికి పయనం అయ్యి
గుండె కన్నీటి విస్ఫోటనల మధ్య
గూడు చెదిరిన గువ్వనై
జ్ఞాపకాల గమకాల్లో
ఇప్పటికీ నిస్తేజంగా నిలిచి ఉన్నా...!!

-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

నీ బల

మనిషి ఎటుపోయాడో...

పగలు వీధి వీపు పగిలి
లక్షల అడుగుల కింద
నలిగిన బాధతో
రాత్రి వేళ
విశ్రాంతి నీడలో సేదతీరుతుంటే
పొట్టలో దిగిన గాజు ముక్క
నిద్రను బయటకు తోసి
బాధను నిద్రలేపింది.

మెరుస్తున్న పదునుతో
గాజు పెంకులు హెచ్చరికల మధ్యలో
నీడకు నిజానికి తేడా తెలియని
తడబడే అడుగుల మగతకు
రక్తం తేమ అర్థం కాలేదు.
వీధి మేల్కొని జాలిపడి కాస్త జాగా పరిచింది.
ఓ మూల ముడుచుకుపడుకొన్న
వీధి కుక్క మొరగడమనే ఓ మర్యాదను
పోగొట్టుకోవడం ఇష్టం లేక
మౌనాన్ని కప్పుకొని తప్పుకొంది.

వీధిలో వలువలూడిన
ఇంటి పరువు నగ్నంగా దారి తప్పి
ఏ వీధి తలుపు కొడుతుందో భయంతో
ఓ మొరటు పదం చాటు నుండి
దూసుకొచ్చి ముఖాన్ని చిట్లుగొట్టింది.

జారిన చిల్లర కోసం
వంగిన నడుము
మత్తుకు బానిసగా కొమ్మలా విరిగి నేలను ఒరిగింది.

మనిషిని తొక్కే మత్తు సందడితో
గొంతు నంగి నంగిగా
వంగి వంగి లోకానికి దండాలు పెడుతూ
కాళ్ళను ఈడ్చుతూ,
వంకరటింకరిగా
చేతుల్ని ఊపుతూ పాడే పాట
ఊపుకు కాలి చెప్పు తెగి
జారి ఎటో వెళ్ళిపోయింది.
మనిషిలో మనిషి ఏమయ్యాడో గాని
మనిషికున్న మెదడు మొద్దుబారిపోయింది.

-సాహితి
83094 63567

నిజమిది తెలుసుకొనుము

మనుషుల నడుమన చెలిమి
మమతలు మనిషికి కలిమి
నిజమిది తెలుసుకొనుము
మనిషికి విలువలు బలిమి

"సమయము"యన తరుణము
"పద" సదనము చరణము
నిజమిది తెలుసుకొనుము
"దయ" గనుమన శరణము

పిలుక పలుకులు కలుపు
పెమలి కులుకుల వలపు
నిజమిది తెలుసుకొనుము
యువతకు వలపు పిలుపు

కడు "గడసరి"యన వెలది
కులసతి వినయము కలది
నిజమిది తెలుసుకొనుము
జనగణము వినదగినది

కడలి అడుగు కనబడదు
మది అలజడి వినబడదు
నిజమిది తెలుసుకొనుము
అణచిన మది బలపడదు

-కుడికాల జనార్ధన్
9703275050

ఓటే బులెట్ -అవినీతే టార్గెట్

కుర్చీలాటలో నవ్య నీచ క్రీడలు
కాసుల గుర్రాలే రేసులో నిలిచి
నికార్సయిన మద్యం పారించి
కులాల కుంపట్లు రగిలించి
మతవిద్వేష మంటలు రేపి
నోట్లతో ఓట్లు కొల్లగొట్టే నీచులు
నరుల నెత్తిన కూర్చునే ప్రబుద్ధులు !

కాసుల రాసులు కుమ్మరించి
ఓట్లను పోగేసే నవ నాయకులు
నోట్లతో ఓట్లను దోచే అక్రమార్కులు
ఐదేళ్ల అవినీతి ద్వారాలు తెరిచి
నరుల్ని నరక కూపంలోకి నెట్టి
రాజ్యమేలే రాక్షస నికృష్ట చేష్టలు
చేజిక్కించుకుంటాయి సీట్లు !

చేతులు కాలక ముందే ఓటు పట్టుకొని
స్వస్తిక్ ముద్రను సంకనెత్తుకొని
ఓటు బులెట్‌తో అవినీతిని టార్గెట్ చేసి
నీతిమంతుల్నే గెలుపు పల్లకీ ఎక్కించి
ఊళ్ళన్నీ తళతళ మెరిసి మురిసి
పంచవర్ష ప్రగతి రథం పరుగిడి
ప్రజాహితాన్ని పట్టాభిషేకం చేయాలె !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఉదయించే సూర్యుడు

ప్రకృతి విపత్తులను
తట్టుకుంటూ
కరవు వైపరీత్యాలను
అధిగమిస్తూ
శమైక దోపిడీకి
బలి అవుతూ
శరీర కష్టాలకు
సలిగిపోతూ
నిత్యం జీవన్మరణ
పోరాటం సాగిస్తున్న
పలస గుండెకు
దెబ్బ మీద దెబ్బ
కరోనా విలయ తాండవం
అయినా..
కడుపు చేత పట్టుకుని
కుటుంబ బాధ్యలను
భుజాన వేసుకుని
బంధాలను కాళ్ళకు కట్టుకుని
క్షుద్బాధను తీర్చుకోడానికి
ఉదయించే సూర్యుడిలా
బ్రతుకు పోరాటానికి
సమాయత్తమైయ్యాడు
వలస కూలీ...

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

నానీలు

రైతు కళ్లల్లో
వెలుగు రేఖలు
పొలం దేహం దాహం
తీర్చినప్పుడే కదా

దైవం కోసం
నిత్యాన్వేషణ
నీలోనే ఉన్నాడన్నది
తెలుసుకునేదెప్పుడో?

అమ్మ తొలి నేస్తం
ముదుసలలో
నువ్వేమిగలాలి
ఆసరాగా బిడ్డా!

నాన్న
ప్రేమకు నిర్వచనం
నువ్వే అవ్వాలి
అసలైన వారసుడిగా

నిరంతరం
నీ కృషి గడియారంలా
ఫలితం
విజయసూచనే!

-యలమర్తి అనూరాధ
9247260206

'విశ్వర్షి వాసిలి' యౌగిక అంతర్దర్శనం 'నేను' తొలి తెలుగు యౌగిక కావ్యం

వ్యవహారిక ప్రపంచంలో, 'నేను' సర్వ సామాన్యమైన మాట. కాని విశ్వర్షి వాసిలి, అర్ధశతాబ్ది ధ్యానానికి అక్షరయానం అయిన ఈ 'నేను' లౌకిక అలంకారాలు లేని యోగమగ్న సాధకుని, తాత్త్విక సంకేతంతో, తెలుగు వాకిళ్లలోకి వచ్చింది. ఇలాంటి యౌగిక కావ్యం, అందరికీ కాదు, తెలుగులో ఇంకొకటి ఉండదు. నేను అనేది డా॥ వాసిలికాదు. ఒక సాకృత మానవున్ని నడిపించే చైతన్య శక్తి. అటువంటి అరూప చైతన్యాన్ని అక్షరాలలో సారూప్యం చేసిన తొలి తెలుగు దీర్ఘ కావ్యం ఈ 'నేను'. సాకృత చైతన్యాన్ని 'నేను' అంటున్నాం. ఒకటికి రెండుసార్లు చదివితే అవగతం అయ్యే కావ్యం కాదు యిది. విశ్వర్షి వాసిరి, అకుంఠితంగా ఈ యౌగిక అంతర్దర్శనాన్ని మాస్టర్ సి.వి.విగారు ప్రబోధించిన 'భృక్త రహిత తారక రాజయోగం' లోకి మాతా పితరులైన శ్రీమతి యామినీదేవి, శ్రీ శౌర్వరిగార్లను గురు దంపతులుగా స్వీకరించిన డా॥ వాసిరి, మాస్టర్ సివివికి నమస్కారం అంటూ, ఆత్మస్వరంతో ఉచ్ఛరిస్తూ



ప్రవేశించిన ఈనాటి 'నేను' అంబరచుంబిత అవకాశం అంటారు. అందుకే డా॥వాసిరి వసంతకుమార్, డా॥ వాసిరిగా తెరమరుగై అలౌకిక యెగమగ్నమైన 'విశ్వర్షి వాసిరి'గా సర్వజన హితం, ఆకాంక్షిస్తున్నారు.

మెటా ఫిజిక్స్, తత్త్వ, భౌతిక శాస్త్ర ప్రగాఢ సమన్వితంగా ప్రాకృశ్చిమ దార్శనికతను ప్రతిబింబింప చేసే, ఈ అనుభావ్య కావ్యం, దూకుడు చదువరులకు అర్థం చేసుకొని అమృతాన్ని వెలికి తీయగలిగే అనంత సంగ్రహాన్ని విశ్వర్షి అందించారు. పరిణామం, ప్రమోదం, ప్రమాణం, ప్రస్థానం, ప్రయోగం, ప్రవిదులు, పరమపథంగా ఏడు విభాగాలతో ఈ యౌగిక కావ్యం ముందుకు సాగుతుంది. ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా॥ఏల్చూరి మురళీధరరావు, భువనచంద్ర, ఆచార్య రాణి సదాశివమూర్తి, డా॥పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, డా॥ రాయదుర్గం విజయలక్ష్మి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కవేరా, డా॥ రాజేశ్వరి దివాకర్ల ఈ యౌగిక కావ్యానికి ముందు మాటలతో నిండు అభినందనలు అందచేసారు. పదార్థం, చైతన్యం కలిస్తే ఏర్పడే ప్రాణిగా మానవుడు సాధించిన స్వారాజ్య స్వానుభవ మార్గమే యోగం. ఇహపరాలను ఒక్కటిగా సాధించిన సాకృతచైతన్యం నేనుగా అభివ్యక్తీకరించబడింది. అణువులోంచి అనంతరం ఉద్భవించిందనే ఆధునిక సైన్సుకు, ప్రగాఢ యోగ తాత్త్వికతకు మధ్య సాపత్యం కుదుర్చి విశ్వాంతర్వర్తనీయంగా యోగ పరిభాషను ప్రతిపాదించిన తొలి కావ్యం యిది. సప్త విభాగాల చిత్రాలను అందించిన శ్రీ జింకా రామారావు, అపూర్వ చిత్రశైలి, రేఖాచిత్రాలు సమకూర్చిన శ్రీ పినిశెట్టి చిత్ర ప్రతిభ, ముఖచిత్రాలను ఎంతో అందంగా తీర్చిదిద్దిన అనుపోజు జయశ్రీ ప్రభాకర్ అభినందనీయులు.

ప్రతులకు: డా॥ వాసిలి
'యోగాలయం, ఫ్లాట్ 90
క్రిష్ణా ఎన్‌క్లేవ్, ఎండి. ఫారంరోడ్, కనాజీగూడ
తిరుమలగిరి,
సికింద్రాబాద్-500 015.
9393933946

- జయసూర్య
సెల్: 9440664610

పుస్తక సమీక్షలు

కరోనాపై కదన శంఖారావం

ఇంతింతై వటుడింతయై...

బ్రహ్మాండాంత సంవర్ధి యై...అన్నట్లు కంటికి కనిపించని కరోన వైరస్ మొదలు వుహాన్ నగరానికే పరిమితమై నెమ్మది నెమ్మదిగా వేగాన్ని పుంజుకుంటూ దాదాపు 214 దేశాలలో వ్యాపించి మానవ జాతినే ఉక్కిరి బిక్కిరి చెస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది.

ఇది ఏదో ఒక ప్రాంతానికి ఒకదేశానికి ఒకవర్గానికి కాదు ..తరతమ భేదం లేకుండా లక్షలాది మందిని కబళిస్తూ విలయతాండవం చేస్తుంది.. అన్నిప్రభుత్వాలు ఇది సోకకుండా తగిన జాగ్రత్తలను సూచిస్తూ లాక్డౌన్లను ప్రకటిస్తున్నాయి..

వైద్యులు, పోలీసులు పురపాలక సిబ్బంది అహోరాత్రాలు శ్రమిస్తున్నారు..మీడియా కూడా ప్రజల్ని ఎప్పటికప్పుడు చైతన్య వంతులను చేస్తుంది..

ఇలాంటి విపత్కర,అసాధారణ పరిస్థితులు వచ్చినప్పుడు బాధ్యత గలవారందరూ తమదైన రీతిలో స్పందిస్తారు..హృదమున్న కవి ఈ పరిస్థితులలో స్పందించకుండా ఎలా ఉంటాడు ..పరిస్థితుల్ని ఆకళింపు చేసుకొని ప్రజలను చైతన్యవంతులను చేసి తగిన జాగ్రత్తలు పాటించి కరోనాను తరిమి కొట్టాలని జనులను కరోన బారిన పడకుండా చేయాలని తన కలానికి పదను పెట్టాడు.. కవి గంగాప్రసాద్.. దాని ఫలితమే "కరోన పై కవితా శంఖారావం."

ఈ పుస్తకంలో మొత్తం 28 కవితలు, పాటలు, పద్యాలు ఉన్నాయి ..అన్నీ సులభ శైలిలో ఉండి అందరికీ అర్థం అయ్యే విధంగా ఉన్నాయి....

పాటలన్నీ గానయోగ్యంగా ఉండి పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోయే విధంగా ఉన్నాయి..

ప్రతి కవితలో తీసుకోవలసిన జాగ్రత్తలను, కరోనా యొక్క స్వభావ, స్వరూపాన్ని జనులకు తెలియ జెప్పి జాగరూకుల్ని చేసే ప్రయత్నం చేశాడు..కవి గంగా ప్రసాద్.

"కరోనా కాటు(పాట)" లో
కరోనా ఎక్కడో లేదు నీ గుమ్మందగ్గరే నీ రాకకొరకు వేచిఉంది అని ఇలా అంటాడు

"వీధి గుమ్మము కాద
వేంచేసి వున్నాది
బయటకెప్పు డొస్తె
పట్టుకుందామని"
"నిన్ను కుట్టిన కరోన
నిన్నిడిసి పోబోదు
నీయింటి వారికి
అంటించి పోతాది.."

అంటూ హెచ్చరిస్తాడు కవి..
నాకేమి కాదులే
గట్టిగా ఉన్నాను..
అంటే సరిపోదు ఎంతటి వారైనా కాంతాదాసులే అన్నట్టు అజాగ్రత్త గా ఉంటె కరోన అంటుకుంటుందని చక్కని ఉపమానంతో చెబుతాడు..

"శాపం" అన్న కవితలో



వైద్యుల సలహాల తంత్రం,
పారిశుద్ధ్య పనివారల స్థైర్యం,
కరో నాకు కాగలదు ..
భారతీయుల సత్తా చూసి
పారిపోక తప్పదు..

పదితలల రావణుడే తలవంచాడు కదా అని మరో ఉపమానం చెబుతాడు.

"అమ్ముల పొది" అనే పాటలో
"నీ ఇల్లే నీకు రథం,
నీ నోట మాస్కే ఆయుధం,
శానిటైజర్, డెట్టాలె
అమ్ముల పొది లోని అస్త్రాలు!" అని ప్రభోదిస్తాడు..

"విరుగుడు సూత్రాలు"లో
"శుభ్రతకై విలువిచ్చి
వీధుల్లో ఉమ్మబోకు"
అని సూచిస్తాడు..
భౌతిక దూరం బ్రహ్మాస్త్రం,
మానవత్వం మహా శక్తి,

అదే నీకు యుక్తి, అదే నీకు ముక్తి అని ఉద్భోదిస్తాడు..

ఇలా ప్రతి పాటలో కవితాత్మకంగా పాఠకులు పాటించవలసిన విషయాలను తెలియజేస్తాడు కవి.

భారతీయ సాంప్రదాయ అలవాట్లే
కరోనా అంతానికి ఆపద్ధర్మ ఆయుధాలు. అంటూ మరోకవితలో అంటాడు..

మరో "పొట్టి కవితలో"
శారీరక శుభ్రత, ఆరోగ్యానికి మూలం,
మానసిక పరిపక్వత ఐశ్వర్యానికి మూలం,
ఈ రెండూ ఉన్నప్పుడు కరోన కాటికే అంటాడు..

వలస కూలీలను గురించి మే డె కవితలో

దినసరి భత్యానికి చోటు లేదు..పుట్టినచోటు కడుదూరం, మైళ్ళకొద్దీ ప్రయాణం, కాలినడక ఎన్నాళ్ళు అంటూ వాపోతూ ప్రవరాఖ్యుని పాదలేపనం దొరికితే బాగుండును అని ప్రబంధాలను గుర్తు జేస్తాడు.

కన్నవారు కనిపిస్తే కడదాకా బ్రతికినట్లే, గడిచిన దినానికి నేటి దినానికి సామ్యమేది అని దిగులు పడతాడు కవి.

ఇక పద్యకవితల్ని పరిశీలిద్దాం..

"స్తుతి" లో ఒక పద్యంలో
"కళకళ లాడిన తిరుమల
కళదప్పిన దేమివింత"

అంటూ దేవుణ్ణి కళ్ళు ఉరిమి కరోనాను పారద్రోలమంటాడు..

కరోనావచ్చి ఉగాది సంబరాలను తుడిచి పెట్టుకుపోయిందని ఆవేదన వెలిబుచ్చుతాడు ..

కాలమహిమ అన్నపద్యకవితలో
"వలయాకారపు గుర్తుల
నిలబడి కడు దూరముండ నేరము దప్పున్"

అంటూ భౌతిక దూరాన్ని పాటించమంటాడు..కవి.

"చిత్రానికి స్పందన "లో వైద్యులను, వైద్యురాండ్రను నర్సుల సేవలను కొనియాడిన పద్యాలు ఆకట్టుకుంటాయి.. భారత దేశం వైద్యుల చేతుల్లో ఆరోగ్య కరంగా వుంటుందని అభిలషిస్తాడు..

ప్రతి వారు ఈ కరోన సమయంలో చదువ దగిన పుస్తకం.. ఇందులోని సూచనలు, సలహాలు పాటిస్తే మనకు ప్రమాదం తప్పినట్లే..

కవికి సమాజంపట్ల ఉన్న ఆర్తిని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనే తపనను ఈ పుస్తకం తెలియజేస్తుంది..

ఈ గడ్డు కాలంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కరోనా పై పుస్తకాన్ని వెలువరించిన కవి శ్రీ గంగా ప్రసాద్ అభినందనీయులు...

పుస్తకం పేరు: "కరోనాపై కవితా శంఖారావం"
రచయిత : యెనిశెట్టి గంగా ప్రసాద్.
పేజీలు:38
వెల:30 రూపాయలు.

ప్రతులకు:
యెనిశెట్టి గంగా ప్రసాద్
ఇ.నెం.4-10-153,
ఫారెస్ట్ ఆఫీస్ రోడ్
కామారెడ్డి, జి॥కామారెడ్డి
సెల్:9866447234.

-మంద పీతాంబర్
9848451892

హేమంతరాగం!

పగలంతా మంచుదుప్పటి
రాతిరంతా మంచుచీకటి
ఇదిహేమంత మార్గశిరము
ఇది చలిసన్నాయి స్వరము
తుషార అందాల కెంపులు
పల్లెపట్టణాల కులకుల చెంపలు
నిగనిగల చలిమొగము
నిలువెల్లా పూలసోయగము
తీవెసాగే ఎలకోయిలతీపి రాగము
వినిపులకించే నా హృదయము
కల్లముందు గంతులఉడత
కనువిందు చేసేనుకేరింతల బుడత
మౌనమునిగా గోడమీదిబల్లి
హాలుమరచి వెల్లుమరచి వెల్లబోదు తుల్లి
ఝుమ్మన్న భ్రమరనాదము
లెమ్మన్న తుషార సుప్రభాతము
మొరాయించే పూలమొగ్గలు
నునులేత వేలసిగ్గులు
నవవధువుచేతి దోరసిగ్గుల పొగలుక్రమ్మే కాఫీ
నడిరేయిహాయివాయినాల సిగ్గులకన్నీ మాఫీ
బతుక ఎరుకచెప్పేటి సూఫీ
తెలుసుకొని మనసునిలిపి మసులుకుంటే
బ్రతుకెంతో తీపి
సుప్తచేతనం కప్పుకునే రోగి
సహస్రకన్నులిప్పుకునే భోగి
ఊతకర్రల పండుముసలి
దినమొక గుండెలోతుదిగేటి ఇగము ఉలి
నడిచి వస్తుంది నవకాంతి
కోటిఆశల మకర సంక్రాంతి
పత్తిచేల పంట సిరులు
ఎండ్లబండ్ల ఇండ్లకు తరలు
వరిధాన్యపు రాసులు
గుమ్మిన చేరి చెప్పేను ఎన్నో ఊసులు
హరిలోరంగ హరియనే చిరుతల హరిదాసులు
నడిచిపోయే ఇంటిగుమ్మాలు ఎన్నో కోసులు
మంచుసోయగాల విరుల దారులు
మురిపించు నయనాల పూలపుప్పొడి ఏరులు
వేతన జీవికి వేయి ఆశలు
నిరుద్యోగికి తనువెల్లా నిట్టూర్పులు
పోటి పరిక్షల అభ్యర్థికి కోటి ఆశలు
వేసింది వాక్సిన్ చివురాకులు
ఇక ఖతముగతమయ్యేను కరుణలేనికరోనా చిరాకులు
ఢిల్లీ శివారున అలిగిన అరకలు
తల్లడిల్లే అన్నదాతల చిరుఆకలి కేకలు
దేశపుసౌభాగ్యపుపుటలలో కనిపించు పాడు రేఖలు
క్రొత్త యేడాది మోసుకొచ్చే కోటి ఆశలు
లిఖించేను ఇగభాగ్యరేఖలు

నీలాల హేమంతఆకాశము
నీవైపే చూసి ఏదోఅడిగే ప్రతినిముషము
ప్రతిభగల భావావేశము
పలికించే ఆశలసందేశము
సుఖదుఃఖముఖముల గాలము
క్షణక్షణము కాలరూప ఇంద్రజాలము

-నల్లగొండ
8309452179

అన్నదాత....

ప్రమిధలా
విశ్వానికి వెలుగుపంచువాడు
కర్మవీరులకు
శ్రమ ఫలమును అందించువాడు
తన చెమటను
రక్తాన్ని, కష్టాన్ని, త్యాగాన్ని,
నిరంతరం తన కోసం కాక
నలుగురి కోసం
తన శ్రమఫలాన్ని ఇచ్చే వాడు
మోస మెరుగని వ్యాపారి
మోసపోయె యజమాని
అన్ని తనపైనె ఆధారపడ్డ
తను మాత్రం ప్రకృతిపై ఆధారపడువాడు
నమ్మకన్ని నమ్మెవాడు
నమ్మకంగా బ్రతుకువాడు
అలుపెరగనిఅన్నదాత...
నీ రుణం తీర్చలేడు
ఏ విధాత.....

-శ్రీ పాల్
8978894808

కాలం

జీవితమంటే కాలం.మరేదో కాదు.
ఈ కాలాన్ని మించింది మరొకటి లేదు
కాలానికి కాయం దాసోహం
కాయానికి గాలం కాలం
కాయానికి గాయం కాలం
కాయానికి ప్రాయాలు కాయం
కాయానికి మరణం కాయం
కాయాలు సుఖ దుఃఖాల మయం
కాలాన్ని చూసి చేసుకోకు మనసు గాయం
కాలము ఉంటుంది కలకాలం
కాయముండదు ఎల్ల కాలం
ఆగడం అనేది తెలియనిదే కాలం
తెలుసు కోవడానికి చాలదు జీవిత కాలం
తెలిస్తే ప్రాణాలు ట్రాఫిక్ జామ్లో ఆగడం కాయం!
కాలానికి వుండదు పక్షపాతం
సాగి పోవడమే దాని పంథం
కాలం ఒక కని కట్టు దాన్ని పట్టుకోలేం!
లాకర్లో భద్రంగా దాచిపెట్టలేం!
కాలం ఒక మాయా క్రీం!కరిగి పోతూనే ఉంటుంది
మంచు కురిస్తే మళ్ళీ పెరగదు!
వాడుకుంటే మంచి చెడుల వడ్డీ పొందుతాం!
వాడుకున్న వారికి వావాడుకున్నంత మహాదేవ!
కాలానికి వుండదు అంతం
ఉండి లేనట్లు లేక వున్నట్లుంటుంది
కాలానికి వుండదు ఏబంధం
కాయానికేలరా ఈ అనుబంధం!
కాలం ఒక మాయా జాలం
దాని కన్నుకప్ప జాలం
కాలానికి అతీతంగా మన జాలం
తెలుసుకో జాలం దాని
మహేంద్ర జాలం

-పి.బక్కారెడ్డి
9705315250

ఇద్దరం వున్నప్పుడు

ఇద్దరం వున్నప్పుడు
అండగా వున్న...
కొండంత ధైర్యం
ఇప్పుడు..
ఒటరిగా మిగిలాక
గులకరాళ్ళెన్ని పోగుచేసినా...
మళ్ళీ వస్తుందా !?
ఇద్దరం వున్నప్పుడు
కురిసిన....
వెన్నెల జలపాతం
ఇప్పుడు...
ఒంటరిగా మిగిలాక
చుక్కలెన్ని లెక్కబెట్టినా
మళ్ళీ వస్తుందా !?
నిరాశ..
నిస్పృహలు
నీదరికి రానివ్వవు కదా...
మరి...వాటి పక్కనే
నన్నెందుకొదిలి వెళ్ళావు ??

-లక్ష్మీ సోమేశ్వర శర్మ
9494480753

బల్లెం ఎక్కడున్నా
ప్రమాదమే
అది
పక్కలో ఉంటె
మరింత ప్రమాదమె!

బయటి ప్రమాదాలను
కొంత వరకు పసిగట్టవచ్చు
కాని!
ఇంటిదొంగను
ఈశ్వరుడైనా పసిగట్టలేడు
అన్నట్లు
పక్కలోనే బల్లెం రూపంలో
పొంచియున్న ప్రమాదాన్ని
గుర్తించడం చాలా కష్టం!

మనం! ఎంతసేపూ
శత్రువు బయట ఉన్నాడని
భ్రమల్లో బతుకుతున్నాం
సంకలపిల్లను బెట్టుకొని
ఊరంత వెతికినట్లు
అంతశ్శత్రువులను
అదుపులో పెట్టుకోలేక
అల్లల్లాడి పోయి
ఆగమాగమవుతున్నాం!
నిజానికి
మన చేతులారా
మనమే శత్రువులను
తయారు చేసుకుంటున్నాం!
కామంతో కొందరిని
క్రోధంతో కొందరిని
మోహంతో కొందరిని
లోభంతో కొందరిని
మధంతో కొందరిని
మాత్సర్యంతో కొందరిని
స్వార్థంతొ కొందరిని
అత్యాశతో కొందరిని
అధికార దాహంతో కొందరిని
దూరం చేసుకుని ఏకాకులమై
బతుకు చికాకుల్లో ముంచుతున్నాం!
అందుకే!
పక్కలో బల్లేంల్లాంటి
అరిషడ్వర్గాలను
నేర్పుగా, ఓర్పుగా
తొలగించుకుంటేనే
దూరమైన వారందరూ
దగ్గరవుతారు
మనమనుకున్నవన్నీ మనకు
దగ్గరవుతాం.

- డా॥ కూర్మాచలం శంకరస్వామి
9703268858

మీరు పెట్టిన భిక్షయే.....

"అన్నయ్యా....నా వివాహం నిశ్చయమైంది. శుభలేఖ వాట్సాప్ చేస్తాను. విశేషాలన్నీ కలుసుకున్నప్పుడు చెప్తాను. తప్పక రావాలి" ఉదయానే మంజుల ఫోన్.

"చాలా సంతోషమమ్మా. తప్పక వస్తాను. మాష్టారికి నమస్కారాలు అందజేయి" మరి కొంచం సేపు మాట్లాడి పెట్టేసాను.

అనాథలమైన నన్ను వివేక్ నీ, కావ్యనీ.. దాశరథి మాష్టారు చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించారు. ఆయన చలవవల్లనే ఈరోజు మేమింతవారమయ్యామంటే అతిశయోక్తికాదు. మాకంటే పదేళ్ళు చిన్నదైన మాష్టారి కూతురు మంజుల మాకందరికీ ఎంతో ఆప్తురాలు. ముగ్గురమూ పెళ్ళికి రెండ్రోజుల ముందే బయలుదేరాము.

మాష్టారింటికి చేరుకుని చూద్దుము కదా...ఎక్కడా సందడిలేదు. ఎప్పుడూ ఎదురొచ్చి మమ్మల్ని ఆప్యాయంగా ఆహ్వానించే మంజులా కనిపించలేదు. మనసు ఏదో కీడు శంకించింది.

మమ్మల్ని చూడగానే "అక్కా..అన్నయ్యలూ" అంటూ కౌగలించుకుని భోరుమంది మంజుల.

"అరే..ఏమైందమ్మా ఎందుకేడుస్తున్నావు మాష్టారేరీ?" ఆందోళనగా అడిగాము.

"ఆస్పత్రిలో చేర్చాము" అని "నా పెళ్ళికోసం నాన్న ఒక ప్రైవేటు బ్యాంకులో డబ్బు దాచారు. ఊహించని విధంగా నిన్న హఠాత్తుగా ఆ బ్యాంకు దివాలా ప్రకటించింది. రెండ్రోజుల్లో పెళ్ళి. ఇప్పటికిప్పుడు అంత సొమ్ము ఏర్పాటు చేయడమెలాగో తెలియక విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనై నాన్నకి గుండెపోటు వచ్చింది" వెక్కి వెక్కి ఏడ్చింది.

మంజులకి ధైర్యం చెప్పి హుటాహుటిన ఆస్పత్రికి పరిగెత్తాము. మాష్టారు ఐ.సి.యు. లో ఉన్నారు. డాక్టర్ ని కనుక్కుంటే సమయానికి తీసుకుని రాబట్టి ప్రాణాలు కాపాడగలిగామనీ 2 స్టెంట్స్ వేయాల్సొచ్చిందన్నారు.

మేమెవరమో వచ్చిన పనేంటో చెప్పి కలవాలని బ్రతిమిలాడగా ఒత్తిడి కలిగించొద్దని హెచ్చరించి ఒప్పుకున్నారు.

మమ్మల్ని చూసి "వచ్చారర్రా! విన్నారా ఏంజరిగిందో అమ్మాయి పెళ్ళి.." ఆపై మాటలురాక కంటతడిపెట్టారు మాష్టారు.

"తెలిసింది. మీరు నిశ్చింతగా ఉండండి. అంతా సవ్యంగా జరుగుతుంది" ఆయన చేతిపై చేయి వేసి భరోసా ఇచ్చాము. ఆర్థికంగా మేము ముగ్గురమూ మధ్యతరగతి వాళ్ళమేనని ఆయనకు తెలుసు అయితే మామీద నమ్మకమో ఏమో ఆయన ముఖంలో నిశ్చింతతో కూడిన చిరునవ్వు తేలికగా ఊపిరి తీసుకున్నాము.

ఇప్పటికిప్పుడు అంత డబ్బు ఎవరిస్తారు..అయితే ఇప్పుడదంతా ఆలోచించే వ్యవధి లేదు వెంట నే రంగంలోకి దిగాము. బ్యాంకుకి వెళ్ళాము...కావ్య తన చేతి గాజులూ గొలుసూ తనఖా పెట్టి కొంత, పై నెలలో కూతురి స్కూలుకి డొనేషన్ కోసం దాచిన సొమ్ము, భార్యకి పరిస్థితి వివరించి ఆమె నగలు కుదువ పెట్టించి వివేక్ మరికొంత, నా సేవింగ్స్ ఖాతాలో ఉన్నదంతా ఊడ్చి కొంతా నా పై అధికారితో మాట్లాడి మరికొంత నేనూ...మొత్తానికి ఎలాగైతేనేం...సమయానికి మాష్టారి కూతురు మాఫియమైన చెల్లెలూ మంజుల పెళ్ళికి కావలసిన పైకం ఏర్పాటు చేసాము.

> **"సమయానికి ఆదుకున్నారర్రా. మీ ఋణం ఏమిస్తే తీరుతుంది?" భావోద్వేగానికి లోనయ్యారు మాష్టారు"**

మాష్టారి ఆరోగ్యరీత్యా ముహూర్తం వారం ముందుకు జరగటంతో సెలవు పొడిగించి అక్కడే ఉండిపోయాము. మంజుల వివాహం నిర్విఘ్నంగా జరిగిపోయింది. మాష్టారి ముఖంలో ప్రస్ఫుటిస్తున్న ఆనందం చూసి తృప్తి కలిగింది.

"సమయానికి ఆదుకున్నారర్రా. మీ ఋణం ఏమిస్తే తీరుతుంది?" భావోద్వేగానికిలోనయ్యారు మాష్టారు.

"ఆ మాట మేమనాలి మాష్టారూ. మా జీవితాలు మీరు పెట్టిన భిక్షయే. ఈ విధంగానైనా మీ ఋణం తీర్చుకునేందుకూ, మీకు గురుదక్షిణ చెల్లించుకునేందుకూ కూడా అవకాశం మాకు దొరికింది. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఏ అవసరమైనా తప్పక తెలియజేయండి" మాష్టారి ఆశీర్వాదాలు అందుకుని తిరుగు ప్రయాణమయ్యాము.



-దినవహి సత్యవతి
9790752180

దగ్గరవుతాయి

వాడు

ప్రక్కలో పెద్ద పాములాంటోడు
చక్కగా వున్నట్టే నటిస్తూ
ఎక్కడ నుండో ఓ గొడవకు
తిక్క తిక్క లెక్కల్తో
తగవులకు తెరతీస్తాడు
దురాక్రమణ కోసం చూస్తాడు
వాస్తవాదీన రేఖలోనికి
వీలు చేసుకొని వాలు ఆనిస్తాడు
వాడి తోక కత్తిరించడమే
మన తక్షణ కర్తవ్యం-
తరుణోపాయం ఏమైనా వుందా అంటే
మారణ హోమానికైనా వెనుకడుగేయొద్దు.
పవిత్ర నా దేశంలో
చరిత్రలో లేని విధంగా ఏ మహమ్మారికి
కారణమై కష్టాలపాలు చేసి
కన్నీటి సంద్రాల్ని సృష్టిస్తున్నాడు-
ఆమాట కొస్తే అన్ని దేశాల్తో
సామ్రాజ్య విస్తరణ కాంక్ష పెట్టుకొని
ఏ రాజ్యాన్నైనా లొంగదీసుకోవాలనుకుంటాడు
అగ్రరాజ్యాల సరసనే అగ్రగామిగా
వుండాలనుకుంటున్నాడు-
లేని పెద్దరికం కొత్త కొత్తగా
సంపాదించుకోవాలనుకుంటున్నాడు
ఘనమైన సంస్కృతి నా దేశానిది
హీనంగా తగవులు పెట్టుకుంటాడు
మిత్రుత్వం నెరపి శత్రుత్వం చూపిస్తాడు
పొరుగు దేశాల్తో సంబందాల్ని కావాలని పెంచుకొని
మనదేశాన్ని ఏకాకిని చేయాలని చూస్తాడు
పంచశీల సూత్రాల్ని పక్కన పెట్టి
వంచన చేయడం చూశాం గదా
అల్లర్లు చేసి చొరబాట్లుగా
మార్చేస్తాడు వాడు
వాడి కోరలు పీకాలి మనం
అప్పుడే మన దేశానికి క్షేమం.

- డా॥చిట్యాల రవీందర్
సెల్:7798891795

సావిత్రి భాయి పూలే

దేశం గర్వించదగ్గ
గొప్ప వ్యక్తి
అందరూ ఎన్నదగ్గ
మహిళా శక్తి

సమాజంలో మార్పుకు
శ్రీకారం చుట్టింది
మూడ వ్యవస్థకు
వ్యతిరేకంగా పోరాడింది

అస్పృశ్యతా నివారణకై
నడుం బిగించింది
విద్య అభివృద్ధికై
కంకణము కట్టింది

బహుజనుల బాగుకై
కదిలింది

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి, కళా వి.యస్.జనార్ధనమూర్తి, డా॥ సముద్రాల వేణుగోపాలచారి తదితరులు.

బ్రాహ్మణులకు మంత్రిపదవి ఇవ్వాలి

-బ్రాహ్మణ ఐక్య వేదిక సదస్సులో వక్తలు

బ్రాహ్మణులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగితేనే రాజకీయంగా రాణిస్తారని ప్రముఖ వక్తలు అన్నారు. బ్రాహ్మణులకు మంత్రిపదవి ఇవ్వాలని కోరారు. అర్హులైన బ్రాహ్మణులకు ఆరోగ్యశ్రీతో పాటు రెండెకరాల భూమి కేటాయించాలని, ఇతర సామాజిక వర్గాలకు అందించే అన్ని సంక్షేమ పథకాలనూ ఆ సామాజిక వర్గం వారికి అందించాలని డిమాండ్ చేశారు. త్యాగరాయ గానసభ, గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గానసభలో బ్రాహ్మణ ఐక్యవేదిక సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడా రు. పేద బ్రాహ్మణ పిల్లల కోసం, విదేశీ విద్యనభ్యసించే వారికి బ్రాహ్మణ పరిషత్ ఆర్థిక సహకారం అందజేస్తోందని ఆయన తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన పేద బ్రాహ్మణులు తెల్ల రేషన్ కార్డులు పొందాలని, దాని వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి సూచించారు. సభలో కళా వి.యస్.జనార్ధనమూర్తి, అయాచితం నటేశ్వర శర్మ , అయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజరుగ్మతలను రూపుమాపేది కవులే - ఎస్పీ రెమా రాజేశ్వరి

సమాజంలో ఆధునికత ఉరకలెత్తుతున్న నేటి కాలంలో హృదయ భాషకు స్పందించే సున్నితత్వం, సమయం కరువైందని, అయినా సరే కళాకారులు మాత్రం తమ ప్రయత్నం కొనసాగించడం అభినందనీయమని మహబూబ్ నగర్ జిల్లా ఎస్.పి. రెమా రాజేశ్వరి అన్నారు. జనవరి 30 న మహబూబ్ నగర ఎస్పీ. కార్యాలయంలో పి.ఆర్.ఓ. గా విధులు నిర్వహిస్తున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ రంగినేని మన్మోహన్ రచించిన కవితాసంపుటి ×రంగులేని కలం× పుస్తకావిష్కరణ కార్యక్రమం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఎస్.పి. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజంగా జీవించే వ్యక్తులలో కళాకారులను మొదటగా పేర్కొనవచ్చునని, అటువంటివారి స్పందనలోనే జీవం ఉండడం వాస్తవమని అభివర్ణించారు. శతాబ్దాల నుండి అద్భుతమైన నైపుణ్యాలతో అలరారిన వివిధ కళా రూపాలలో ఆధునికత, యాంత్రికత చోటు చేసుకోవడంతో మనిషిలోని తృష్ణ మెల్లమెల్లగా కోల్పోతుండడం చూస్తున్నామని, అందుకే కళలను కాపాడుకోవడం ఎంతైనా అవసరమని విశ్లేషించారు. నిరంతర సాధనతో ఊపిరి బిగబట్టి పాడే వేణువు, వేలి కొసలతో నవరసాలను పలికించే వీణ వంటి వినసొంపైన శబ్దాలను ఆధునికత యాంత్రికంగా చేయడం చూస్తే సాధనాపరుల మనస్సు చివుక్కుమనక తప్పదని అన్నారు. అయినా కళాకారులు తమ పోరాటం చేస్తూనే ఉన్నారని, తమ శాఖలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మన్మోహన్ రచనా వ్యాసంగంలో పేరు సంపాదించడం తమకు గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉండే ఒత్తిడిని అధిగమించి కవితలు, వ్యాసాల రచనలతో పాటుగా సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, అతను మరిన్ని పుస్తకాలు వెలువరించాలన్న ఆకాంక్షను ఎస్.పి. వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వివిధ కళా రంగాలకు చెందిన వ్యక్తులను కలుసుకున్నందుకు సంతోషంగా ఉన్నదని ఎస్.పి. అన్నారు. కవి రంగినేని మన్మోహన్ మాట్లాడుతూ, కవిత్వం వాస్తవాలను ఎలుగెత్తుతూ సమాజహితం కోరుకోవాలన్న లక్ష్యంతోనే తన రచనలు సాగుతాయని, తన సాహిత్య వ్యాపకానికి అధికారులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల తోడ్పాటు ప్రధానమైనదని అన్నారు. మనదైన చరిత్ర, విశిష్టతలను వేరెవరో వెల్లడించే, ప్రకటించే సహృదయత లోపిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని, రేపటి సమాజానికి మనవైన గుర్తులు భద్రపరిచే బాధ్యత మనమే తీసుకోక తప్పదని రంగినేని పేర్కొన్నారు. ఎస్.పి. రెమా రాజేశ్వరి గారు రచయితగా, తననెంతో ప్రోత్సహించారని, అదేవిధంగా సుదీర్ఘకాలంగా సాగుతున్న తన సాహిత్య జీవితానికి సహకరిస్తున్న వారికి ఎల్లవేళలా కృతజ్ఞతతో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ కవితారంగంలో రంగినేని శైలి ప్రత్యేకమైనదని, ఎందరో పెద్దల అభినందలతో పాటుగా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, సత్కారాలు అందుకున్న విషయం గుర్తు చేశారు. పోలీసుతో పాటుగా కవితా కుటుంబసభ్యునిగా కొనసాగుతూ వృత్తి, ప్రవృత్తి పట్ల నిబద్ధతతో ఉండడం అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో ఎస్.పి. సి.సి. రామిరెడ్డి, రహమాన్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, రామ్మోహన్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమీలా శక్తిపీఠం - విశిష్ట సాహితీ కార్యక్రమాలు

'ప్రమీలా శక్తిపీఠం' స్థాపన 2017లో జరిగింది. ఆచార్య మసన చెన్నప్ప గారి సహధర్మచారిణి ప్రమీల కీర్తిశేషులైన తర్వాత ఆమె పేరు మీద పీఠం స్థాపింపబడింది. పీఠం లక్ష్యాలలో ముఖ్యమైంది. సాహిత్యంలో కృషి చేసిన వారిని ప్రోత్సహించి సన్మానించడం. ప్రతి సంవత్సరం ప్రమీల జన్మదినమైన నవంబర్ 8 నాడు వార్షికోత్సవాన్ని నిర్వహించి, పీఠం పక్షాన ప్రచురితమైన గ్రంథాలను ఆవిష్కరింపజేసి, ముఖ్యంగా రచయిత్రులను లేదా కవయిత్రులను పురస్కారాల రూపంలో, ధన రూపంతో సన్మానించడం జరుగుతుంది.

2017లో హైదరాబాదులోని తాగ్యరాయగాన సభలో శక్తిపీఠం ప్రారంభింపడింది. సంస్థలో ... ఉస్మానియా యూనివర్సిటీ అప్పటి వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య ఎస్. రామచంద్రంగారు ఆవిష్కరించారు. ఆనాటి సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆచార్య చెన్నప్ప గారు రచించిన 'ప్రమీలా త్రిశతి' అనే 308 పద్యాలుగల స్మృతి కావ్యాన్ని ఆవిష్కరించారు. అంతేగాక డా॥ జి. ధర్మోజీరావు రచించిన 1 మసన చెన్నప్ప సృజనాత్మక రచనలు – పరిశీలన' పిహెచ్.డి. గ్రంథాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సభకు ప్రారంభకులుగా అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు విచ్చేసినారు. ముఖ్యంగా ఈ ప్రారంభ సభలో ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన మహిళా మణులకు నగదు పారితోషికంతో పాటు పురస్కారాలు అందజేయబడినాయి. పురస్కారాలు పొందిన వారిలో మాతా నిర్మల యోగ భారతి, డి॥ సి. వసుంధర, డా॥ సూర్యా ధనంజయ, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి, వి. మమత మొదలైన వారున్నారు. ఈ సభలో నేటి నిజం పత్రికా సంపాదకులు శ్రీ బైసదేవదాసు, డా॥ కళా వేంకట దీక్షితులు, డా॥ తిరునగరి, డా॥ రచ్చయాదగిరి, డా॥ వంశీరామరాజు, డా॥ ధర్మోజిరావు పాల్గొన్నారు. ఈ సభలో సిరిపంగి మహేశ్వర్‌కు మసన 'రామాక్షమ్మ పురస్కారం' అందించబడింది. ఈ ప్రారంభ సభకు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు అధ్యక్షత వహించారు.

ప్రమీల శక్తిపీఠం 2018, 2019 సంవత్సరాల్లోను వార్షికోత్సవాలను నిర్వహించింది. 2018లో ఆర్య సమాజ్ భవనం, సీతాఫల్‌మండీలో ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య సామాజిక మహిళా కార్యకర్తలకు సన్మానం నిర్వహింపబడింది. 'ఆసందుక' కవిత్వాన్ని హిందీలో అనువదించిన డా॥ రంగయ్య గారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఆచార్య మోహనసింగ్ గారు 'చింతన' ఆధ్యాత్మిక వ్యాస సంపుటిని, 'ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు' గ్రంథాలతో పాటు అడపాల నరసింహారెడ్డి గారి 'శ్రీ హనుమత్ సహస్రపద్య రత్నావళి'ని ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథిగా డా॥ శ్రీరామ ప్రసాద్ ఐఎఫ్ఎస్ (రిటైర్డ్) గారు పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవంలో ప్రముఖ రచయిత్రి శ్రీమతి శైలజామిత్రకు, తెలంగాణ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా॥ వి. త్రివేణికి, డా॥ సునీతారామ మోహన్‌రెడ్డి గార్లకు ప్రమీలా శక్తి పీఠం పురస్కారాలు అందజేయబడినవి. ఒక్కొక్కరికి నగదు రూపంలో పారితోషకం కూడా ఇవ్వడం జరిగింది.

2020లో కరోనా కారణంగా వార్షికోత్సవం నిర్వహింపబడలేదు. కాని ఈ 2021లో జరుగుతున్న వార్షికోత్సవానికి మంచి గుర్తింపు ఉంది. తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖామాత్యులు ముఖ్య అతిథిగా వస్తున్న ఈ సభా కార్యక్రమంలో వారికి ఆచార్య మసన చెన్నప్ప గారు తాము అమెరికాలో ఉండి రచించిన 'మాతృగీత' శతకాన్ని అంకితం చేస్తున్నారు. అట్లే ముంబై వాస్తవ్యులైన ప్రముఖ శ్రీ యెల్ది సుదర్శన్ గారికి 'శ్రీ రామ కథా గేయం' సంపూర్ణ రామాయణం అంకితం గావింపబడుతుంది. అంతేకాక ఆచార్య చెన్నప్ప గారి పర్యవేక్షణలో రచించిన పిహెచ్.డి. గ్రంథాన్ని వారి శిష్యురాలు డా॥ బేరి రమణి గారి 'రామాయణంలో రామరాజ్యం ధర్మ స్వామ్యం' చెన్నప్ప గారికే అంకితం చేయనున్నారు.

ఈ వార్షికోత్సవంలో 08-02-2021 ఈ కార్యక్రమం విషేషం ఏమంటే, ఎన్నో విద్యా సంస్థలకు అధినేత్రిగా ఉండి, తెలుగు సాహిత్యానికి ఎంతో సేవచేస్తూ ఎంతో మంది కళాకారులను, కవులను సత్కరిస్తున్న డా॥ అమృతలత గారిని 'ప్రమీల శక్తిపీఠం' విశిష్ట సాహితీ పురస్కారం 2020'తో సన్మానించడం.

ప్రమీలా శక్తిపీఠం ఆధ్వర్యంలో రామగిరి (భువనగిరి యాదాద్రి జిల్లా) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించడం జరిగింది. ముఖ్య అతిథిగా డా॥ కస్తూరి లక్ష్మీనారాయణ వచ్చారు.

'తెలుగు భాషా చైతన్య సమితి' పక్షాన 10, నవంబర్ 2020 నాడు జూమ్ ద్వారా జరిగిన 'భగవద్గీత శ్లోకాల' పోటీలలో విజేతలైన విద్యార్థులకు 'ప్రమీలా శక్తిపీఠం' ద్వారా నగదు పారితోషికాలు అందజేయబడినవి.

ప్రమీలా శక్తిపీఠం పక్షాన రచయితలకు, రచయిత్రులకు ఆర్థికంగా తోడ్పడమేగాక, వారి స్వంత పుస్తక ప్రచురణలకు ఉచిత సహాయం అందించడం జరుగుతుంది.

స్వర్గీయ మసన 'ప్రమీల స్మృత్యర్థం ఏర్పడిన ప్రమీలా శక్తిపీఠం పక్షాన దాని అధ్యక్షులైన ఆచార్య చెన్నప్పగారు భవిష్యత్తులో ఇంకా సాహిత్యానికి ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆశిస్తున్నాను.

– డా॥ మసన రామనాథం
94913 10031



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'బడులు మళ్ళీ మొదలు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'బడులు మళ్ళీ మొదలు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

తెరుచుకుంటున్న కలల ప్రపంచం

ఆన్ లైన్ మార్గంలో సంచరిస్తోన్న వాణి
భూమార్గం పట్టేందుకు సిద్ధమౌతోంది
నిస్తంత్రీ విద్య రూటు మార్చి
తరగతి గదుల వైపు చూస్తోంది
అరచేతిలో ఇమిడిపోయిన పాఠం
నల్ల బల్ల దిశగా అడుగులు వేస్తోంది
గాలి తరంగాలను వాహిక చేసుకుని
టీవీ గుండా
మెదళ్లలోకి పరావర్తనమైన విజ్ఞాన కాంతి
నేరుగా ప్రసారమయ్యేందుకు
రంగం సిద్ధం చేసుకుంటోంది
ఆధునిక సాంకేతికతను
ఆవాహన చేసుకున్న చదువు
సంప్రదాయం వైపు కదులుతోంది
ఇక
బుల్లి తెరలను
కళ్లు పోయేలా చూడడానికి
శుభం కార్డు
సామూహిక ఒంటరి విద్య స్థానే
బృంద వైయక్తిక శ్రద్ధకు
మళ్ళీ బీజం
పాఠానికీ పఠితకూ మధ్య
సందేహాల పొరలు తొలగినట్టే
కరోనా పుండుకు
చదువుల లేపనం రాసినట్టే
మరో కలల ప్రపంచానికి
మార్గం వేసినట్టే
జ్ఞాన సామ్రాజ్యానికి
దారులు తెరిచినట్టే
కలలు మళ్ళీ మొదలు
కళలు మళ్ళీ మొదలు
కలకలం మళ్ళీ మొదలు
కళకళలు.. గలగలలు
అన్నీ మళ్ళీ మొదలు..
అవును..
బడులు మళ్ళీ మొదలు..

–డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు.

కనురెప్పలు

ఆగిన బడి గంట మోగుతున్నది
విద్యార్థి చదువు కొనసాగనున్నది.
వైరస్ ఉపద్రవాలను కట్టడి చేయాలంటే
వ్యవస్థకు ఊతమిచ్చే జాగ్రత్తలు
మనజాతి సంపద యువత చేతుల్లోనే.
బడులన్నీ రంగు రంగుల కలలు
ఆన్లైన్ చదువులకు సమీక్షలు
నిత్యం కొత్తగా పంతుళ్ళకు సవాళ్ళు
ఔషధ మొక్కల చిన్న కుండీలు
వైరస్ నియంత్రణకు ప్రయోజనాలు.
తులసీ వేము ఘాటైన పత్రాలే రక్ష
వృక్ష శాస్త్ర విజ్ఞానమే కాపాడే దక్షత.
అధ్యాపకుల శోధనా ఫలితాలు ఫలించి
బడులే చేతనత్వ ప్రయోగ వేదికలైతే
జగతికి మన దేశం మార్గదర్శనం.
సవాళ్ళకు స్వాగతమంటూ
భద్రతకు పెద్దపీట వేస్తూనే
విద్యాలయాలు
విశ్వానికి పొద్దుపొడుపై నిలవాలి
పచ్చని పుడమికి కొత్త చిగుళ్లు తొడుగుతూ
నిరంతరం జాగరుకతతో అడుగులు వేయాలి
కరోనాకు ముందూ అంతా సంబరమే
కరోనాతో సహచర్యం నేడు సాహసమే
మార్పులకు శ్రీకారం
ఆరోగ్య బయోమెట్రిక్ సిస్టమ్
ఆపదలనుండి కాపాడే తొలిమెట్టు
నేటి తరం పిల్లలు
రేపటి తరానికి మన కంటిపాపలు
కాపాడుకుందాం కనురెప్పలమై
విద్య భూషణం
విద్య సంస్కార ఉద్దీపనం
విద్య ఉపాధి మేధోమథనం
విద్య సకల శాస్త్రపరిశోధనం

– ఏడెల్లి రాములు,
94948 00454

ఏమో- అంతా పరీక్షే

తుప్పు పట్టిన
బడి గంట!
మ్రోగుతుందో! లేదో!!.
రంగుల ఫోనులో!
ఇరుక్కుపోయిన
విద్యార్థి మస్తిష్కం!
తరగతి గదిలో
విషాలమౌతుందో! లేదో!!.
చూచి వ్రాత మాని!
టచ్ స్క్రీన్ టచింగులకు
అలవాటుపడ్డ ఆ చిట్టి వ్రేలు
వ్రాత నొప్పి భరిస్తుందో!.. లేదో!!.
దృశ్య మాధ్యమం
నేర్చిన గురువు!
విద్యార్థుల కట్టడి తంత్రం!
సమ్మోహితా బోధన మంత్రం!
గుర్తుకు వస్తుందో! రాదో!!.
పుస్తకాల బరువు మరచిన
విద్యార్థి!
పుస్తకాల మోత భరిస్తాడో! లేడో!!.
ండు అడుగుల దూరానికి!
కలిసి పంచుకోలేని భోజనానికి!
పిప్పరంబిళ్లలకు, చాకోలెట్లకి!
ఇచ్చి పుచ్చుకోవడం లేని
పెన్సిల్ పెన్ను బలపాలకి!
స్నేహం చిన్నబోతుందేమో!!.
బడులు మొదలు!
తల్లి తండ్రుల గుండెల్లో గుబులు!
బుడుతలకి చదువుల దిగులు!
పంతుల్లకి బాధ్యతల మోతలు!
ఇకిలిస్తు.. సకిలిస్తున్న కరోనాకి
ఆటలు!
అందరికీ పరీక్షలే!!.

–జె. నరసింహ రావు,
9490128690

బడి బండి

సీ. బండిలాగబడి బతుకీడ్చెనటుల
బడిలోన మాస్టారు భయముతోని.
చేతినిండాపని సతమత పడుతున్న
పిల్లలయల్లర్లు యాలకిస్తు
ఆనంద పథతాడు యాప్యాయత నిలిపి
దేశమే గొప్పగా దివ్య ముగను
మూగబోయిన బడి మురిపెంబు గొలుపును
పిల్లల యల్లర్లు యదనునిలుపు
ఆ॥ బడులు తెరుచుకున్న
బంగారు మయమాయె
ఊరు గూడు వారు యుర్వి నందు
పాఠశాల నిలిచి పదికాలలందున
పిల్లమూకలయిరి పదముల్లె
ఆ॥మొదలు పెట్టు బడి ముత్యాల హారమై
ముసిముసిగ మురిసెగ పుడమి నందు
కొత్త కొత్త బాట కొంగొత్త గయ్యిన
చదువు కున్నవారు సంపదొసగి.

– వి. సంధ్యా రాణి,
9542299500

చీకటి వెలుగులు

నిత్యం నీ రాక కోసం ఎదురు చూసే
ఉద్యానవనం మూగబోయింది
సుమధుర సుగంధం వెదజల్లే
అక్షరాల తోటలు
కంటికి కనపడని
మాయ రోగంతో నిద్ర పోయాయి
అనునిత్యం కేరింతల అలజడి
కనుమరుగయ్యింది
చిలక పలుకుల తో చిగురించే
పూల తోటలు మూగబోయాయి.
బీటలు బారిన నా గుండెల్లో
ఆశలు రేకెత్తించింది
పవిత్రమైన నీ పాద స్పర్శతో
పావన మయ్యే గడియను తెచ్చింది
బాధలన్నీ మరచి
బతుకుజీవుడా అని భరోసా ఇచ్చింది
అస్తమించిన సూర్యుడు
ఉదయించి వెలుగు కిరణాలు తెచ్చాడు
బడులు మొదలై
కొత్త వెలుగునివ్వనున్నాయి
భారమైన బ్రతుకులకు
భరోసా ఇచ్చి కొత్త ఆశలు నింపుతాయి
అజ్ఞానపు చీకట్లను తొలగించి
దివ్యమైన అక్షర జ్యోతులను వెలిగిస్తాయి
బాధపడే వారందరికి
తొలకరి జల్లుల తీపికబురు చెప్పాయి
మట్టిలో మాణిక్యం అనే సుగంధాన్ని
మనసునిండా నింపుతాయి
వసంత ఋతువులో కోయిల రాగంలా
పాఠశాలలు కిటకిటలాడనున్నాయి.

–పి. విజయ రాళ్ళి,
9959154032

ఆవేదనలూ ఆనందాలూ

ఆన్లైన్ క్లాస్ లు ఉన్నాయి
ఆనందాల హరివిల్లులు లేవు
రోజువారీ పలకరింపులున్నాయి
రంజుగ ఉండే బాల్యం లేదు
రోజు వారి హడావిడి ఉంది
రోజంతయినాక ఇంకెన్నాళ్ళు
ఈ బందీఖాన జీవితం అనే బాధ
కేరింతలు లేవు
జన్మదిన శుభాకాంక్షలు లేవు
జీవితం నిర్మానుష్యమైన
ట్యాంక్ బండ్ పరిసరాల మాదిరి
బావురుమంటోంది
బోర్ కొడితే క్రికెట్టు
కబడ్డీ వంటి ఆటలెన్నో ఆడి
అలసేవాళ్ళం.
ఇప్పుడు అవన్నీ
ఒక కలగా కదలాడుతూ
మంచిరోజుల కోసం
ఎదురుచూస్తూ
ఆశలపల్లకీలలో ఊరేగుతున్న
విద్యార్థులుగా మిగిలిపోతున్నాం
జీవితం లోని
ఒక సంవత్సరానికి ప్రకృతి కాటు
మా వెతలసర్థం చేసుకొని
ప్రభుత్వం
బడులు తెరుస్తున్నందుకు
లోలోపల సంతోషం
ఎక్కడో...
హృదయాంతరాళాలలో
భయం కరోనా ...
కుచ్ కర్నా హే హమ్
ప్లీజ్ మమ్మల్ని దరిచేరకు ..
మా రిక్వెస్ట్ మన్నించు.

–ఆర్. కళ్యాణి,
9912898029

బడులు మొదలు

ప్రతి వేసవి కాలం రెండు నెలలు
బడులకు సెలవులు
పిల్లలు ఊర్లకు ప్రయాణాలు
ఇంట్లోనే ఉంటే రకరకాల ఆటలు
ఇల్లు పీకి పందిరేయడాలు.
ఉపాధ్యాయులతో అనుబంధం ఉండి
విద్యపై మక్కువ గల విద్యార్థులు
బడులెప్పుడు తెరుస్తారని ఎదురు చూపులు
పై తరగతికి వెళ్లే ఆనందపు అనుభూతులు.
కరోనా కారణం
రెండు నెలల సెలవులు ఎగబాకి
పన్నెండు నెలలకు పెరిగితే
పంతుళ్ళూ పిల్లలూ నారాజుగున్నరు
బడి కూడా చిన్నబోయి
చెత్త చెదారంతో నిండిపోయి
ఇద్దరికోసమూ ఎదురు చూస్తోంది.
ఏమైతేనేం
మళ్లీ బడులు మొదలు
ఉపాధ్యాయులతో ప్రేమగా ముచ్చటించాలి
స్నేహితులతో సంతోషంగా ఆడుకోవాలి.

– నాగిరెడ్డి అరుణ జ్యోతి,
9966181561



జీవితంలో వసంతం

జీవితంలో కరువైన నవ్వులు
నిన్ను చూడగానే కురిశాయి ...
ఎన్నడూ మూగబోయి ఉండే నా గొంతు
నిన్ను చూడగానే పాడాలనిపించింది !.
నిత్యం విలపించే నాకళ్ళలో
నిన్ను చూడగానే ఆనందం విరిసింది..
నిదుర రాక కలలకు దూరమైన నేను
నిన్ను చూస్తూనే స్వప్నలోకంలో మునిగాను.
ఎన్నడూ ఉత్తేజం చెందని నా గుండె
నిన్ను చూడగానే వడివడిగా స్పందించింది !.
బడుల పునఃప్రారంభం తో...
నిరాశాంధకారంలో పయనిస్తున్న నాకు
ఏవో ఆశాకిరణాలు ప్రసరింపజేశావు....
మోడువారిన నా జీవితపు ఎడారిలో
నీవల్లే మళ్ళీ వసంతం వెల్లివిరిసింది !.
కరోనా వల్ల నిరర్థకం అనుకున్న
నా జీవన పయనంలో
నీ రాక మరో వసంతమైంది
నీవల్ల అర్థవంతమైన నా జీవితంలో
ఆనందం అనంతమై వర్ధిల్లుతుంది!.

– వై.మంజులత,
9396983346

భవిత దిద్దుకొనగా...

అనుకోకుండా
రోగమొకటి
ఉప్పెనలా ఉపద్రవాలు
విరుచుకు పడి
ఊపిరి సలపకుండా చేసె
భయం నీడన బతుకులన్ని
ఉక్కిరిబిక్కిరి
అనుక్షణం చిత్రవధ.
కంటికి కనిపించని కరోనా
కల్లోలం చేసి
మనుషులందరినీ ఎడం చేసె
కష్టకాలంలో కనికరించేవారు లేక
కుమిలిన మనుషులు.
పిల్లల భవిత ప్రశ్నార్థకం
బడులన్నీ భయం గుప్పిటిలో భద్రం
చదువుల తల్లి తల్లడిల్లింది
ఆటపాటలతో అలరారుతూ
అనునిత్యం చదువుల దీపాలతో
ప్రజ్వరిల్లుతున్న పాఠశాలలో
చిమ్మచీకటిలు కమ్ముకున్నాయి
కరోనా చేత చీక్కి
సుదీర్ఘ కాలాంతరం
కళకళలాడబోతున్న బడులు
భవిత దిద్దుకొనగ
భావి బాలల కదలిక
చదువులమ్మ స్వాగతం
చక్కని చిక్కని చదువులన్నీ

– పురం మంగ,
8106248082

నాటి సభలు, సమావేశాలు...
జనవరి 11 నుండి జనవరి 16 వరకు

జ్ఞాపకాలు — జనవరి 11

జనవరి 11, 2014న ఆంధ్రసారస్వత పరిషత్‌లో "మనసంతా నువ్వే" పుస్తక ఆవిష్కరణ సభలో రత్నాకర శర్మ, ఎన్సీ. రఘువీర్‌ప్రతాప్, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥ సినారె. రచయిత ఆర్.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్, రఘుశ్రీ

జనవరి11, 2020న కరీంనగర్‌లో చిందం సునీత "కానరాని వసంతం" పుస్తకావిష్కరణలో 'నేటినిజం' దినపత్రిక 2020 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర బి.సి.కమీషన్ అధ్యక్షులు బి.యస్.రాములు, చిందం సునీత, దాస్యం సేనాధిపతి, వైరాగ్యం ప్రభాకర్, ఆడువాల సుజాత తదితరులు.

జ్ఞాపకాలు — జనవరి 11

జనవరి 11, 2013న శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి పురస్కారాల సభలో పురస్కార గ్రహీతలతో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం. వెంటేశ్వరు, జ్ఞానపీఠ అవార్డు గ్రహిత, డా॥సి. నారాయణరెడ్డి, డా॥ కళా వేంకట దీక్షితులు, శ్రీమతి భాను, యల్వీ

జనవరి 11, 2013న శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి పురస్కారాల సభలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుతో హైకోర్టు

జ్ఞాపకాలు — జనవరి 11

జనవరి 11, 2021న నూతనంగా ఎన్నికైన జవహర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ముషీరాబాద్ ఎంఎల్ఏ ముఠాగోపాల్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి శేఖర్ .

జనవరి 11, 2021న జవహర్‌నగర్ డివిజన్ పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సభలో రచ్చ శ్రీనివాసరావు, సన్నపురి వెంకటేశ్, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, జవహర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి శేఖర్ తదితరులు.

జ్ఞాపకాలు — జనవరి 11

జనవరి 11, 2021న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జ్ఞాన గురువు స్వామి వివేకానంద జయంతి సభలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, తెలంగాణ రాష్ట్ర అధికార భాషాసంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు, కళా వి.యస్. జనార్దనమూర్తి, శివపార్వతి, త్రినాథరావు.

జనవరి 11, 2021న జవహర్‌నగర్ పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠాగోపాల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై జవహర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు.

జ్ఞాపకాలు — జనవరి 12

సభలో ఇల్లెందువాసి శ్రీమతి మోదెపల్లి కన్నాంబ (సన్మత్రీ) ప్రాసిన శ్రీమతి జోలపాట సి.డి.ఆవిష్కరణలో శ్రీమతి భాను, దూబగుంట రామకృష్ణ, జనార్దనమూర్తి, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆచార్య టీ. గౌరీశంకర్, సన్మత్రీ, దాస్యం సేనాధిపతి, జయలక్ష్మి, ఎల్వీ సుబ్రహ్మణ్యం.

జనవరి 12, 2019న కిరణ్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో దూబగుంట రామకృష్ణ రచించిన "ఈనాటి కథలు" ఆవిష్కరణలో శ్రీమతి భాను, కళాజనార్దనమూర్తి, బైస దేవదాసు, రచయిత దూబగుంట రామకృష్ణ, ఆవిష్కర్త ఆచార్య టీ. గౌరీశంకర్, దాస్యం సేనాధిపతి, పి. జయలక్ష్మి, ఎల్వీ సుబ్రహ్మణ్యం.

జ్ఞాపకాలు — జనవరి 12

జనవరి 12, 2020న హైదరాబాద్‌లోని నాగారంలో స్వామి వివేకానంద జయంతి సభలో "రసవాహిని" అధ్యక్షులు పద్మకవి రాధశ్రీ దంపతులను సత్కరిస్తున్న ఆచార్య సాధనాల, శ్రీమతి గొడవర్తి సంధ్య, శ్రీమతి బైస వీణాదాసు, బైస దేవదాసు.

2015లో త్యాగరాయ గానసభలో జరిగిన ఒక సభలో సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వెంకటేశ్వరరావుకు 'అమ్మ' కవితా సంకలనం అందజేస్తున్న బైస దేవదాసు, పొత్తూరి సుబ్బారావు.

జ్ఞాపకాలు — జనవరి 12

జనవరి 12, 2012న బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో అలిశెట్టి ప్రభాకర్ సంస్మరణ సభలో 'నేటినిజం' ప్రచురించిన అలిశెట్టి ప్రభాకర్ కవిత ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన నిజాం వెంకటేశం, వరవరరావు, అలిశెట్టి భార్య భాగ్యమ్మ, అలిశెట్టి తల్లి, జింబో, అల్లం నారాయణ, జయధీర్ తిరుమలరావు.

జనవరి 12, 2012న బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో అలిశెట్టి ప్రభాకర్ సంస్మరణ సభలో 'నేటినిజం' ప్రచురించిన అలిశెట్టి ప్రభాకర్ కవిత ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న వరవరరావు. వేదికపై నిజాం వెంటేశం, అలిశెట్టి భార్య భాగ్యమ్మ, జింబో, అల్లం నారాయణ, జయధీర్ తిరుమలరావు.

జ్ఞాపకాలు — జనవరి 13

జనవరి 13, 2005న శ్రీశ్రీ 95వ జయంతి సందర్భంగా త్యాగరాయ గానసభలో సీనీ నటుడు కాంతారావు మాట్లాడుతున్న దృశ్యం. వేదికపై తంగిరాల చక్రవర్తి, బైస దేవదాసు, మహీధర, డా॥ పోతుకూచి సాంబశివరావు, డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు, ముక్తేవి భారతి.

కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో 2014లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎం.వి.నరసింహారెడ్డి సాహితీ పురస్కార ప్రధానోత్సవంలో వైస్ ఛాన్సలర్ కదారు వీరారెడ్డి, డా॥నందిని సిధారెడ్డితో బైస దేవదాసు.

జ్ఞాపకాలు — జనవరి 14

జనవరి 14 2019న త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీ గేయ రచయిత కొసరాజు రాఘవయ్య జయంతి సభలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గాయని లలితారావు, యలమర్తి రాజేంద్రప్రసాద్, కళా జనార్దనమూర్తి, బాపిరాజు, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

జనవరి 14న కళా లలితా వేదికలో "మన పందగల్లో సంక్రాంతి ప్రాశస్త్యం" అంశంపై ప్రసంగం చేసిన డా॥ కేతవరపు రాజ్యశ్రీని జ్ఞాపికతో సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై డా॥ తెన్నేటి సుధాదేవి, వంశీ రామరాజు, రామకృష్ణమఠం పి.ఆర్. ఓ.రాం.

జ్ఞాపకాలు — జనవరి 15

జనవరి 15 2007న రాష్ట్ర చిన్న మధ్యతరహా దినపత్రికల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ దృశ్యం.

జనవరి 15న 2007న రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికల అసోసియేషన్ క్యాలెండర్‌ను సచివాలయంలో ఆవిష్కరించిన రాష్ట్ర సమాచార శాఖమంత్రి ఆనం రాం నారాయణరెడ్డి,అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు.

జ్ఞాపకాలు — జనవరి 15

జనవరి 15, 2019న కళావేంకట దీక్షితులు కళా వేదికలో "సద్గురు శ్రీ త్యాగరాయ స్వామివారి ఆరాధనోత్సవాలు" కార్యక్రమంలో నృత్య గురువు శ్రీమతి శివ పార్వతిని సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు,వేదికపై కళా వి.యస్.జనార్దనమూర్తి, ఎన్. సత్యనారాయణ, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ బుద్ధ మురళి, పొత్తూరి జయలక్ష్మి, త్రినాథరావు.

జనవరి 15, 2019న కళావేంకట దీక్షితులు కళా వేదికలో "సద్గురు శ్రీ త్యాగరాయ స్వామివారి ఆరాధనోత్సవాలు" కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

జ్ఞాపకాలు — జనవరి 16



జనవరి 16,1986న నిజామాబాద్‌లో 'ప్రజాకళ' చిత్రకళా సంస్థ ద్వితీయ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రముఖ వైద్యులు డా॥ లక్ష్మారెడ్డి. వేదికపై డా॥ కేశవరెడ్డి, పి.వి. రాజ్‌గణేశ్, బైస దేవదాసు, ప్రముఖ చిత్రకారులు చంద్ర.



జనవరి 16, 1986న 'ప్రజాకళ' నిర్వహించిన చిత్రకళ పోటీలో పాల్గొన్న పి.హెచ్.జి. కిషన్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రముఖ చిత్రకారులు, రచయిత చంద్ర.

అభివృద్ధి పనులతో మారుతున్న గ్రామాలు

పంచాయితీలకు నేరుగా నిధుల మంజూరు
పల్లె ప్రగతి కార్యక్రమాలకు పెద్దపీట

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): గ్రామ పంచాయతీలకు ఈ యేడు ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసి, పల్లెప్రగతిని అములు చేస్తోంది. దీంతో జిల్లాల్లోని గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల అయ్యాయి. గతంలో ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కేటాయించేవారు. ప్రస్తుతం పంచాయితీల సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటిని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా నిధులను నేరుగా గ్రామపంచాయతీలకే నేరుగా కేటాయించాలని నిర్ణయించింది. ఇప్పటికే గ్రామాల్లో స్మృతి వనాలు, రైతువేదికలు, శ్మశానవాటికల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయి. గ్రామాల్లో చెరువులకు స్థానిక నేతల సహకారంతో సుందరీకణ చేపట్టారు. అత్యధిక నిధులు మేజర్ గ్రామ పంచాయతీలకు వచ్చాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులతో పాటు అంతర్గత రోడ్లు, వీధి దీపాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు గ్రామాల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నారు. శాశ్వత అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పంచాయతీ అధికారులు అంటున్నారు.

నిధుల విడుదలతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్తు బిల్లులు, బోర్లు వేయడం, మోటార్ల కొనుగోలుకు ఈ నిధులను వెచ్చిస్తారు. గత ఏడాదిలో మాదిరిగా కాకుండా ఈ సంవత్సరం వర్షాకాలానికి ముందుగా నిధులు విడుదల కావడంతో సర్పంచులు, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ముందుగా స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజల సమక్షంలో పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. గుర్తించిన పనులను గ్రామసభలో తీర్మానం చేసి ప్రణాళికబద్ధంగా నిధులను వినియోగిస్తారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ-పంచాయతీ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామాల అభివృద్ధి, పూర్తి వివరాలతో పాటు పనులు ఏ మేర జరుగుతున్నాయో తెలుసుకొనేందుకు అన్ని జీపీలను ఈ-పంచాయతీలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికన ఈ నిధులను కేటాయించారు. వర్షాకాలం కంటే ముందుగానే నిధులు రావడంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధుల నుంచి విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ఉన్న నిధులను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులను జారీ చేసింది. గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది.

నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం లే కుండా చూస్తూ ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గత ప్రభుత్వాలు ఎన్నడూ విడుదల చేయని విధంగా ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా జాప్యం చేయకుండా మొదటి విడత నిధులను ప్రభుత్వం ముందుగానే విడుదల చేయగా.. రెండో విడత నిధులను కూడా జనవరి నెలలోనే విడుదల చేయడంతో అభివృద్ధి పనులు పరుగులు పెట్టే అవకాశం ఉంది. ఈ నిధులను సంబంధిత గ్రామ పంచాయతీ ఖాతాల్లో త్వరలో జమ చేయనున్నారు.

దీప్‌సిద్దూ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు

ఆచూకీ చెబితే లక్ష నజరానా ఇస్తాం
ఢిల్లీ పోలీసుల ప్రకటన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): రైతుల నిరసనల్లో భాగంగా రిపబ్లిక్ డే సందర్భంగా ఎర్రకోట వద్ద జరిగిన హింసాకాండ కేసులో ప్రధాన నిందితుడైన దీప్ సిద్దూ ఆచూకీ కోసం పోలీసలు గాలింపు ముమ్మరం చేశారు. అలాగే అతని ఆచూకీ చెబితే లక్షరూపాయల బహుమతి ఇస్తామని ఢిల్లీ పోలీసులు బుధవారం ప్రకటించారు. రైతుల నిరసనలో భాగంగా ఎర్రకోట వద్ద జరిగిన హింసాకాండలో పాల్గొన్న మిగిలిన నలుగురి ఆచూకీ చెప్పిన వారికి రూ.50వేల రివార్డును ఇస్తామని ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఎర్రకోటపై సిక్కు పతాకాలను ఎగురవేసిన దీప్ సిద్దూ, జుగరాజ్ సింగ్, దీప్ సిద్దూ మరో ఇద్దరు సహచరుల ఆచూకీ చెబితే లక్షరూపాయల నగదు బహుమతులు ఇస్తామని ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఈ కేసులో నిందితులైన జజ్బీర్ సింగ్, బూటాసింగ్, సుఖదేవ్ సింగ్, ఇక్బాల్ సింగ్‌ల ఆచూకీ చెప్పిన వారికి రూ.50వేల చొప్పున నగదు బహుమతులు ఇస్తామని ఢిల్లీ పోలీసు ప్రత్యేక దర్యాప్తు బృందం జాయింట్ కమిషనర్ బీకే సింగ్ చెప్పారు. ఈ కేసును బీకే సింగ్ నేతృత్వంలో డీసీపీలు జాయ్ టుర్కీ, భేషంసింగ్, మోనికా భరద్వాజ్ లు దర్యాప్తు చేస్తున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఎర్రకోట వద్ద జరిగిన ఘటనపై కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రంతోపాటు ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.కాగా ఎర్రకోట ఘటనలో పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ను ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ డిఎన్ పటేల్, జస్టిస్ జ్యోతిసింగ్‌ల ధర్మాసనం డిస్మిస్ చేసింది.

శనగ కొనుగోళ్లకు రంగం సిద్ధం

-తుదిదశకు చేరుకున్న పత్తి కొనుగోళ్లు

నిర్మల్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): జిల్లాలో శనగ కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో యాసంగిలో సాగు చేసిన శనగపంట మరో వారం, పది రోజుల్లో రైతుల చేతికి రానుంది. ఈ నేపథ్యంలో రైతుకు మద్దతు ధర అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను చేపట్టనున్నారు. నిర్మల్ జిల్లాలో మూడు చోట్ల, ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో అత్యధిక దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఎక్కడెక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. నిర్మల్ జిల్లాలో ముథోల్, ఖైంసాతో పాటు జిల్లా కేంద్రంలో మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నిర్మల్ జిల్లాలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సుమారు లక్ష క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఖైంసా, కుభీర్, మాటేగాం, నిర్మల్, సారంగాపూర్, ఖానాపూర్‌లో కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, తాంసి, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్‌లో కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రతిపాదించారు. బోథ్, తాంసి మినహా నాలుగు కేంద్రాల్లో కందులు కొంటున్నారు. రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా పూర్తి పంటను కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో కంది పంటను జనవరి రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణం సైతం కంది పంటకు అనుకూలించడంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఇదిలావుంటే జిల్లాలో గత ఏడాది అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు చివరిదశకు చేరుకున్నాయి. ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో సీసీఐ వాణిజ్య కొనుగోళ్లను ప్రారంభించక పోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలో ఇచ్చోడ, నేరడిగొండలో సీసీఐ ప్రైవేట్ వ్యాపారులతో పోటీపడి పంటను కొంటున్నారు. సీసీఐ రంగంలో దిగడంతో వ్యాపారులు సైతం రైతులకు సరైన ధరలు చెల్లించాల్సి వస్తోంది. వ్యాపారులు పంటను కొనుగోలు చేస్తుండగా.. వారు నిర్ణయించిన ధరకే రైతులు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. పంట విక్రయాలు చివరి దశకు చేరుకోవడంతో రోజువారీ కొనుగోళ్లు జరుగుతున్నాయి.

త్వరలో సారస్వత పరిషత్తు పురస్కారాల ప్రదానం

"ఉత్తమ సాహిత్య గ్రంథాల రచయితలకు అందజేత

తెలంగాణ సారస్వత పరిషత్తు కొత్త కార్యక్రమాల్లో భాగంగా ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలు అందజేయనుందని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా॥ జుర్రు చెన్నయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్ల కాలంలో వివిధ ప్రక్రియల్లో మొదటిసారిగా ముద్రితమైన గ్రంథాలను సేకరించి, పరిశీలించి పురస్కారాలను త్వరలో అందజేస్తామన్నారు. అలాగే, తెలంగాణ భాష, సాహిత్యం, కళా సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేసిన ఐదుగురు ప్రముఖులను విశిష్ట పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. యువతీయువకులను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండు యువ పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు.

నిత్యస్మరణీయులు

-దోరవేటి
సెల్:9866251679

పోతన

చెతులారంగ నిచ్చని పూజించినొళ్ల
నోరు నొవ్వంగ హరికీర్తి నుడివినొళ్ల
శ్రేష్ఠ భాగవతమునే రచించినొళ్ల
తల్లి లక్కమాంబ భవంబు ధన్యమయ్యె.

హలమునే బూని వృషివలత్వమున నీ యర్థాంగికిన్, సంతకునే
కలియో, గంజియొ జోని పెంచుకొనుచున్ కాన్యోష్ణతానందమున్
కలమునే కవ్వము జేసి చిల్కితివి భక్తానంద సాహిత్య సం
చలనంబై తరరరు లీతి సకవీ! శశ్వద్యశో భినిధీ!

చిరుతరమైన నీయలంకార శక్తి
శక్తిమంతమౌ నీలోని శబ్దయుక్తి
పద్యసాహిత్య మకుట ప్రభాసమనగ
భాగవత పురాణమును భవ్యమొప్పెనర్చె...

తరములు మారె, నెన్నియె శతాబ్దులు మించెను, కాలమెంతయో
కరిగెను, లోకశోకముల గాఢత హెచ్చెను గాని, నీ కథా
సరణిని నేటికిన్ మనుజ జాతి సుధా మధురంబుగా యశ
స్కరమగు స్రోలుచుండె నన భూ! కవి పోతన! నీకు మ్రొక్కెదన్.

నాణ్యత ఉంటేనే మద్దతు ధరలు

జనగామ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): నాణ్యతా ప్రమాణాలు పాటించి తీసుకువచ్చే ధాన్యానికి మార్కెట్‌లో మద్దతు, గిట్టుబాటు ధర లభిస్తుందని జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ-నామ్, హాకా ఆధ్వర్యంలో కందులు, వేరుశనగ కొనుగోళ్లను సక్రమంగా చేపడుతున్నామని అన్నారు. రైతులతో మాట్లాడి యార్డులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ధర ఎంత మేరకు లభిస్తుందని అడిగి తెలుసుకొని నాణ్యత ప్రమాణాలను పరీక్షించారు. నాణ్యమైన సరుకును ప్రతీ రోజు యార్డులోకి అనుమతిస్తామని, తర్వాత వచ్చే వాహనాలను నిలిపివేస్తామని చెప్పారు. కందులు శుభ్రం చేసుకునే మిషన్ల కోసం రైతులు పోటీ పడుతున్నారు. క్లీనింగ్ మిషన్లు తెప్పించినా రైతులు పాట్లు పడుతున్నారు.

నేటి నిజం

బాధ్యత ఆకలి తీర్చుమంటుంది
భవిష్యత్తు అక్షరం నేర్చుకోమంటుంది
నడుస్తున్న దారిలో.. పల్లెరు ముళ్ళ స్వాగతం
బతుకు ప్రయాణంలో.. చికిపోతున్న బాల్యం
ఉసూరుమంటుంది

ఇదే.. నా భారతం
దేశం కోసం నేనా.. నా కోసం దేశమా..
అన్నే..సమాధానం దొరకని ప్రశ్నలే.. తొ..భారత్..!

- కెరె జగదీష్

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

పోటీ ఫలితాలు

'బుధవారం బాధ్వా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: *డా॥ప్రతికంఠం మాలతీలత*
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ
బహుమతి విజేత

శీర్షిక: గాయమైనా... హాయిగానే ఉంది

ఎదనంతా నిండి ఎడబాటులోనున్న నా చెలి
ఎపుడు కలుసునో అని నామది పలవరించగా
ఆశలపల్లకిపై ఊరేగిన మనసు ఆరాటపడుతూ కలవరించగా
కలే నిజమైందో... కవితే రూపమై ముందు నిలిచిందో
వెండి వెన్నెల ముస్తాబై ఎదుట నిలువగా...
గుండె శృతిలయలు తప్పి మదన గీతాలు పాడగా
చుట్టూ ఉన్న మనుషులు చెట్టుచేమలై తోచ
భవనాలు రహదారులు మంచుకొండలై చలిగాలివీచ
ఉండుండి నా మనసు ఊహల రెక్కలతో
గాలిలో లీలగా తేలియాడుతుండగా...
పరదాల మాటున సరదాగా నవ్వేటి నా చెలి
ఎదలోన గాటుచేసి తీయని బాధతో పెట్టెను గిలి
కనులతో కమనీయ కావ్యాలు చెబుతోంది
పెదాలతో అనిర్వచనీయ మకరందాలు పంచుతోంది
కరస్పర్శతోనే నాపై మత్తుమందు జల్లుతోంది.
చురచుర చూపులతోనే ఎదనంతా జల్లెడ చేస్తోంది
గాయమైనా ఏమిటో... హాయిగానే ఉంది
స్వప్నమైనా ఎందుకో... స్వర్గమే అనిపిస్తోంది
నేనిక... ఈ స్వప్నాన్ని విడిచి రాలేను
నాచెలిని... స్వర్గాన్ని విడిచి ఉండలేను.

-తంగెళ్ళపల్లి ఆనందాచారి
చరవాణి: 9848683377

ద్వితీయ
బహుమతి విజేత

శీర్షిక: ఆశల పల్లకిపై ఊరేగిన మనసు

-ఆశల పల్లకిపై ఊరేగిన మనసు ఆరాటపడుతూ కలవరించగా....
-వెండి వెన్నెల ముస్తాబై ఎదుటే నిలువగా...

'ఆశల పల్లకిపై ఊరేగిన మనసు ఆరాట పడుతూ కలవరించగా...'
వెన్నెల వెలుగులతో ఇలా..
చల్లగాలి తోడురాగా కూనిరాగం పాడుతూ....
ఆ నీలిగగనానికే సోయగాలనిచ్చే వెన్నెల కుసుమన్ని చూసి..
అందరి మనసులు ఆహ్లాదపడుతుండగా...
'వెండి వెన్నెల ముస్తాబై ఎదుటే నిలవగా...'
మేఘాల సంద్రాన దొబ్బులాడుతూ...
తారకాలన్నీ తోడుగా నిలిచి...
నీలి సంద్రపు అద్దంపై అందాలను చూసుకుంటూ...
మా అందరికి ప్రియ భాంధావుడవై..
ఆకాశ దేశాన్ని ఏలేటి వెన్నెల రారాజు.
వెండి వెలుగులు పున్నమి తేడు..
నాకోసం దిగివస్తాడని...
ఎన్ని యుగాలు నీకై వేచి ఉంటాను..
ఎప్పటికీ నిన్నే ఆరాధిస్తూ...
నీ మీద కవనాలు రాస్తూ...
ఇలాగే ఉండిపోతాను....

- సావిత్రి రవి దేశాయ్

ఆహ్వానము
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
జివిఆర్ ఆరాధన
ఎక్సెల్ అవార్డుల ప్రదానం

అవార్డు స్వీకర్తలు

డా॥ జి. చిన్నయ్య
అమెరికా

శ్రీమతి రామరాజు లక్ష్మీశ్రీనివాస్
సంగీతం, గుంటూరు.